thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

## సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 259 కరీంనగర్ బుధవారం, 26 నవంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## భారత్‌లో పెరుగుతున్న అంటువ్యాధులు

న్యూఢిల్లీ : భారత్‌లో అంటువ్యాధుల వ్యాప్తి క్రమంగా పెరుగుతోంది. ఐసీఎంఆర్ నివేదిక ప్రకారం ఈ ఏడాది తొలి త్రైమాసికంలో అంటువ్యాధుల వ్యాప్తి 10.7 శాతం గా నమోదవగా.. రెండో త్రైమాసికంలో ఇది 11.5 శాతా నికి పెరిగింది. ఐసీఎంఆర్ అధ్యయనంలో భాగంగా దేశ వ్యాప్తంగా పరీక్షించిన ప్రతి 9 మందిలో ఒకరిలో సంక్రమి త వ్యాధికారకాలు ఉన్నట్టు తేలింది.

ఐసీఎంఆర్ నెట్‌వర్క్ కింద ఉన్న ల్యాబ్‌ల్లో 4.5 లక్షల మందిని పరీక్షించగా 11.1 శాతం మందిలో వ్యాధికారక సూక్ష్మజీవులు ఉన్న ట్టు కనుగొన్నారు. అక్యూట్ రెస్పిరేటరీ ఇన్ఫెక్షన్ (ఏఆర్ఐ) కేసుల్లో ఇన్‌ఫ్లుయెంజా-ఏ, తీవ్రమైన జ్వరం, రక్తస్రావం కేసుల్లో డెంగీ వైరస్, కామెర్ల కేసుల్లో హెపటైటిస-ఏ, డయేరియా కేసుల్లో నోరోవైరస్, అక్యూట్ ఎన్సిఫాలిటిస్ సింద్రోమ్ (ఏఈఎస్) కేసుల్లో హెర్పస్ సింప్లెక్స్ వైరస్ (హెచ్ఎసవీ)లను టాప్-5 వ్యాధికారకాలుగా గుర్తించారు.

# పాపం వాళ్లు 'ఇక తిరిగి' రారు.!

## ఇన్నాళ్లు మావోయిస్టు పార్టీలో ఉన్నరని భ్రమ.!!

### వాళ్ళు బస్తర్,మాడ్ సహా ఎక్కడ లేరంటున్న మల్లోజుల,తక్కళ్లపల్లి.!!!



చురకలు ప్రత్యేక ప్రతినిధి వీళ్లంతా మావోయిస్టు పార్టీలో ఉన్నారా?లేరని తేలి పోయింది..ఎప్పుడో ఒకసారి తిరిగి వస్తారని అనుకున్నారు.30 ఏళ్ల నుండి..40 ఏళ్ల నుండి ఇప్పటి వరకూ ఎదిరి చూడని వారులేరు.మావోయిస్ట్ పార్టీ లో చేరినతమవాళ్ళు ఇంకా బతికి ఉన్నారని భావిస్తున్న కుటుంబాల వారు గుండె ధైర్యం తెచ్చు కోవాలి..దశాబ్దాలుగా పార్టీ ఎక్కడో ఉంటే చాలు అనుకున్నారు.తిరిగి రావొచ్చు లేదా అమరులుగా మారుతారు. కానీవ్వు అని నిట్టూర్పు లో ఉన్న కుటుంబాలకు చివరికి కన్నీళ్లే మిగిలాయి.లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేతలు మల్లోజుల వేణుగోపాల్ రావు,తక్కళ్లపల్లి వాసుదేవరావు లను అడిగితే అలాంటి వారు బస్తర్,ఛత్తీస్ ఘడ్ సహా ఇతర రాష్ట్రాలలో లేరని చాలా స్పష్టంగా చెప్పారు.ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 1983 తర్వాత అప్పటి పోలీస్ నిర్బంధం లో అడవిబాట పట్టినట్టు లెక్కల్లో ఉన్నట్టు అందరూ భావించారు. కానీ ఇప్పుడు ఆ పది మంది అన్నల గూర్చి వింటే చాలు గుండె బరువెక్కుతుంది..పాపం ఈ పదిమంది ప్రాణాలు తో ఉన్నది ముమ్మాటికి తప్పే .మావోయిస్ట్ పార్టీలో చేరిన వారిలో పలువురు నేతలు లొంగిపోతున్నారు.బీజేపీ సర్కార్ తలపెట్టిన ఆపరేషన్ లో ఖతం చేయబడుతున్నారు.ఆ పది మంది ఏ లెక్కల్లో కూడా లేరు.అగ్ర నేతలు చెప్పారు కాబట్టి ఇక వారు తిరిగి రాని లోకాలకు వెళ్లిపోయారు.ఇంత కాలం వరకు ప్రభుత్వం నుంచి ఆ అన్నలపై రివార్డ్ కూడా ప్రకటించింది..వాళ్లు ఎవరు వాళ్లు ఏమయ్యారు .వాళ్ళెవరో చూద్దాం. ఉమ్మడి జిల్లాలో నుండి మాయమైన వారు..మంతిని మాజీ ఎం ఎల్ ఏ రాంరెడ్డి స్వయానా భావ మరిది గంకిడి సత్యనారాయణ రెడ్డి పెద్దపల్లి ఐటిఐ తర్వాత వరంగల్ జిల్లాలో పై చదువుల కోసం వెళ్లి పోయారు.ఐతే గంకిడి సత్యన్న పార్టీలో చేరారని..ఆయన రాష్ట్ర,లేదా కేంద్ర కమిటీలో సభ్యుడిగా ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది.ఆపార్టీ నుంచి వచ్చిన ఓ ముఖ్య నాయకుడు అసలు గంకిడి సత్యనారాయన రెడ్డి ఏ కమిటీ లో లేరు..పార్టీకి రాలేదన్నారు.ఇంకా ఆలేటి రామ లచ్చులు,పాలితం 1983 లో యుజి లో ఉన్నారు.ఇది పోలీస్ స్టేషన్ రికార్డ్ :65 ఏళ్ల వయస్సున్న రామ లచ్చులు గూర్చి చెప్పారు.ఆలాంటి వాళ్ళు కూడా చూడ లేదు అని అన్నారు.అంటే రామలచ్చులును ఎవరు చంపారు.మాయం చేసారు మరో విద్యార్థి నాయకుడు ధాతు అశోక్ వరంగల్ జిల్లా స్టూడెంటుగా పార్టీలో చేరారు,గోపయ్యపల్లి .ఇప్పుడు అశోక్ వయస్సు 42,డిగ్రీ చదువుతున్న కొడుకు ఎక్కడ ఉన్నాడో చెప్పమంటూ పెద్దపల్లి పోలీసులు అనేక సార్లు అశోక్ తల్లి తండ్రులను చిత్రహింసలకు గురి చేసారు..పాపం ఎక్కడ బతికి లేడని తేలి పోయింది. హుజూరాబాద్ కు చెందిన మాజీ దళపతి పంజాల వెంకట్ నారాయణ అదృశ్యం వీడలేదు.ఎందరో నాయకులు లొంగిపోతే ఆయన మాత్రం జాడలేరు.1983 నుంచి ఇప్పటివరకు జాడలేని కాసులపల్లి కి చెందిన అలువాల ప్రభాకరరెడ్డి ఎల్లవరం దళం లో డిప్యూటీ కమాండర్ స్థాయి నుంచి పని చేస్తూ మాయం అయ్యాడు. తెలంగాణ రాష్ట్రం సర్కార్ కొంత కాలంగా సానుకూలంగా ఉండడంతో ఇప్పటికీ జాడలేదు జూలపల్లి మండలంలో వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన దికొండ శంకరయ్య రాడికల్ యువ సంఘంలో చేరారు.తీవ్ర నిర్బంధ పరిస్థితుల నేపథ్యంలో శంకరయ్య మాయం కావడంతో ఆయన 1984 లో యుజీ ఐనట్టు కనిపించారు.. అయితే తీరా చూస్తే శంకరయ్య పార్టీలో లేనే లేరని అంటున్నారు. అలాగే గోదావరిఖని నుంచి మాయమైన తాళ్లపల్లి తిరుపతి 1990 లో సికాస లో పనిచేస్తూ కనపడకుండా పోయారు.కోరుట్ల కు చెందిన బెజ్జారపు కిషన్, మెకానిక్ 1985 లో అడవి బాట పట్టారు అంటూ..ఈపాటికి ఆయన మావోయిస్టు టాప్ లిస్టు లో సీసీ స్టాయి లో ఉంటారని అందరూ ఊహించారు.అప్పట్లో కిషన్ ఆర్ ఎస్ యు తో సంబంధాలు కలిగి ఉన్నాడు.దీంతో పార్టీకి వెళ్లారని ప్రచారం కావడంతో భార్య పిల్లలు కిషన్ రాకకోసం ఎదురు చూస్తున్నారు ఈ మధ్య కాలంలో అనేక సార్లు పత్రిక ద్వారా లొంగిపొమ్మంటూ భార్య విన్నమించారు.కానీ కిషన్ మాత్రం పార్టీలో లేరని ముఖ్యులు చెబుతున్నారు.విల్లందరూ ఏమీ అయ్యారో తెలియని విషయంకాదు. అప్పట్లో అంటే 1985 తర్వాత పోలీసులు మిలిటెంట్లును చంపి దేహాలను బయటకు ఇవ్వలేదు. నక్సల్స్ అణిచివేతలో పాల్గొన్న పోలీస్ అధికారు లు కఠినంగా వ్యవహరించారు.మరో వైపు పోలీసు ఏజెంట్ల టీమ్ నల్ల దండు ముఠా కూడా మిలిటెంట్ల చంపి వాళ్ళే కాల్చి బూడిద చేశారు.యువ కులను చంపి కనీసం ఫోటోలు కూడా రిపోర్టర్లకు ఇవ్వలేదు.పాపం వారు అలా ఆ జాబితాలో ఉన్న వారే కావచ్చు.వారి బంధువులు ఇంకా పార్టీలో ఉన్నారని ఎదిరి చూస్తున్నారు.వందల మంది నెలకొరుగుతుండగా వారి శవాల గుట్టలు గుట్టలుగా పడుతున్నాయి.లొంగిపోతున్న వారి లెక్కల్లో కూడా లేరు.వారు ఏ విధంగా చూసినా ఏ లెక్కల్లో లేరు ఇది నిజం నూరు శాతం నిజం.!!




## నెక్కొండ మున్సిపాలిటీకి హైకోర్ట్ గ్రీన్ సిగ్నల్..

తెలంగాణ రాష్ట్రంలో మరో మున్సిపాలిటీ ఏర్పాటుకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. వరంగల్ జిల్లాలోని నెక్కొండ మండలంలో నెక్కొండ మేజర్ గ్రామ పంచాయతీని మున్సిపాలిటీగా మార్చాలంటూ నెక్కొండ మాజీ సర్పంచ్ సొంటిరెడ్డి యమున రెడ్డి, పత్తిపాక గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ లావుడ్యా సరిత.. లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం ఈ మేరకు తీర్పు వెలువరించింది. నెక్కొండ మేజర్ గ్రామపంచాయతిని నెక్కొండ, అమీన్ పేట, గుండ్రపల్లి, పత్తిపాక, నెక్కొండ తండా, టీ.కె తండా గ్రామ పంచాయతీలను కలిపి మున్సిపాలిటీగా చేయాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. కాగా నెక్కొండకు మున్సిపాలిటీగా అవకాశం కల్పించాలని ప్రభుత్వానికి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖకు కోర్టు ఆదేశాలు జారీ చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ నేపథ్యంలో.. నోటిఫికేషన్‌కు ముందే నెక్కొండ మేజర్ గ్రామపంచాయతీని మున్సిపాలి టీగా గుర్తించాలని హైకోర్టు ఆదేశించింది. వరంగల్ జిల్లాలో ప్రస్తుతం మూడు మున్సిపాలిటీలు ఉన్నాయి. వర్ధన్నపేట, నర్సంపేట, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఉండగా.. నెక్కొండ మున్సిపాలిటీగా మారితే మొత్తం నాలుగు అవనున్నాయి. నెక్కొండను మున్సిపాలిటీగా చేస్తే.. ఈ ప్రాంతం మొత్తం అభివృద్ధి చెందుతుందని స్థానికులు చెబుతున్నారు.



## ఇండియా గేమ్ చేంజర్..

### ఇక మన యుద్ధవిమానాల్లో సొంత ఇంజిన్..

### ప్రపంచ దేశాలకు షాక్!

భారత ఆర్మీలో.. వాయుసేన కీలకపాత్ర పోషిస్తోంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో మన వాయుసేన ఉగ్రస్థావరాలతోపాటు పాకిస్తాన్‌లోని ఎయిర్ బేస్‌లను తుత్తుతుత్తు చేసింది. ఇప్పటికీ పాకిస్తాన్ ప్యాచ్ వర్క్‌లు చేసుకుంటోంది. ఇంతటి కీలకమైన వాయుసేనకు చెందిన తేజస్ యుద్ధ విమానం.. ఇటీవల దుబాయ్‌లో కూలిపోయింది. ఎయిర్‌షో సందర్భంగా ఒక్కసారిగా అదుపు తప్పి కూలిపోయింది. మన వింగ్ కమాండర్ దుర్మరణం చెందారు. దీంతో తేజస్ యుద్ధ విమానాలపై ఇప్పుడు చర్చ జరుగుతోంది.

**విదేశీ ఇంజిన్లే..** భారత్ చాలా వరకు విదేశీ యుద్ధ విమానాలే కొనుగోలు చేసింది.

మొన్నటి రఫేల్ కూడా ఫ్రాన్స్‌కు చెందినది. అయితే ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్ సొంతంగా ఆయుధాల తయారీపై దృష్టిపెట్టింది. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా ఆయుధాలు తయారు చేస్తోంది. డీఆర్డీవో, హెచ్ఏఎల్ ఆయుధాల తయారీలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. అయితే తేజస్ కూడా మనం తయారు చేసుకున్నదే. అయితే ఇందులో ఉన్న ఇంజిన్ మాత్రం విదేశీయులది. మన తయారు చేస్తున్న విమానాల్లో వాడుతున్న ఇంజిన్లన్నీ వీదేశాల నుంచి తెచ్చినవే. మనం సొంత ఇంజిన్లు తయారు చేసుకోకుండా అమెరికా, రష్యా అడ్డుకుంటున్నాయి. ఎందుకంటే వారి వ్యాపారం దెబ్బతింటుంది.

**డీఆర్డీవో అద్భుతం..** ఈ క్రమంలో మన డీఆర్‌డీవో అద్భుతం చేసింది. శాఫ్రాన్ పేరిట ఫిఫ్త్ జనరేషన్ స్వదేశీ ఇంజిన్ డిజైన్ పూర్తి చేసింది. ఇది విజయవంతం అయితే భారత రక్షణ పరిశ్రమలో స్వయం ఆధారత ఎక్కువ అవుతుంది, విమాన యంత్రాలు కేవలం దిగుమతులపై ఆధారపడకుండా తయారీ విస్తరణ జరుగుతుంది. తేజస్ ప్రాజెక్టుకు సరిపోయే ఇంజిన్ ఎంపిక కీలకం. జీఈ ఎఫ్404, యూరోజెట్ ఈజే200 లాంటి ఆధునిక ఇంజిన్లు తేజస్‌కు సమర్ధవంతంగా ఉండటంతో డీఆర్డీవో కవేరి ఇంజిన్‌లో తక్కువ శక్తి కారణంగా అవమానాలు ఎదురైంది.

అందుకే శక్తివంతమైన ఇంజిన్ వికాసం దేశ రక్షణ సామర్థ్యాలను పెంచుతుంది. డీఆర్డీవో శాఫ్రాన్ ఇంజిన్‌ను పూర్తి చేసి పారదర్శకతలతో ఇంజిన్ తయారీలో విదేశాలపై ఆధారాన్ని తగ్గించే దిశగా చర్యలు తీసుకుంటోంది. ఇది భారత అభివృద్ధిని ప్రపంచస్థాయిలో నిలబెట్టే కీలక దశగా భావిస్తున్నారు. ఈ విజయాలు భారత వేదికపై స్వదేశీ యుద్ధ విమాన పరిణామానికి కీలక పాత్ర పోషిస్తున్నాయి.

# మోగిన సర్పంచ్ ఎన్నికల నగారా..




హైదరాబాద్: జీహెచ్ఎంసీని విస్తరించేందుకు తెలంగాణ కేబినెట్ ఆమోదం తెలిపింది. 27 మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశమైన మంత్రివర్గం సుమారు 4 గంటలకుపైగా వివిధ అంశాలపై చర్చించింది. రాష్ట్ర మంత్రి వర్గం తీసుకున్న నిర్ణయాలను మంత్రి శ్రీధర్‌బాబు మీడియాకు వెల్లడించారు. పెద్ద అంబర్‌పేట్, జల్‌పల్లి, శంషాబాద్, తుర్కయంజాల్, మణికొండ, నార్సింగి, ఆదిభట్ల, మేడ్చల్, నాగారం, దమ్మాయిగూడ, పోచారం, ఘట్‌కేసర్, గుండ్లపోచంపల్లి, తూంకుంట, తుక్కుగూడ, కొంపల్లి, దుండిగల్, బొల్లారం, తెల్లాపూర్, అమీన్‌పూర్, బడంగ్‌పేట్, బండ్లగూడ జాగిర్, మీర్‌పేట, బోడుప్పల్, నిజాంపేట్, ఫిర్జాదిగూడ, జవహర్‌నగర్ మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. అంతేకాకుండా మరో డిస్కమ్ ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రి తెలిపారు.

కొత్త డిస్కమ్ పరిధిలోకి లిఫ్ట్ ఇరిగేషన్ కనెక్షన్లు, హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై, వ్యవసాయ కనెక్షన్లు, మిషన్ భగీరథ కనెక్షన్లు వస్తాయన్నారు. వచ్చే పదేళ్లలో విద్యుత్ డిమాండ్‌కు అవసరమైన ఏర్పాట్లపై చర్చినట్లు వివరించారు. ఈ క్రమంలోనే 3వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ కొనుగోలు చేయాలని, ఈ మేరకు త్వరలోనే టెండర్లు పిలవాలని నిర్ణయించినట్లు చెప్పారు.

**క్యాబినెట్ మరిన్ని నిర్ణయాలు...** 2 వేల మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ కొనుగోలు. పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ విభాగంలో పెట్టుబడుల ఆహ్వానం. కొత్త పరిశ్రమలకు సొంతగా విద్యుత్ తయారీ చేసుకునేందుకు అనుమతి. ఎన్టీపీసీ ఆధ్వర్యంలో రామగుండంలో 800 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణం.

పాల్వంచ, మక్తల్‌లోనూ ప్లాంట్ల నిర్మాణ అవకాశాలపై పరిశీలన. హైదరాబాద్‌ను 3 సర్కిళ్లుగా విభజించి భూగర్భ కేబుల్ విద్యుత్ వ్యవస్థ ఏర్పాటు. భూగర్భ విద్యుత్ వ్యవస్థతోపాటు టీఫైబర్ కేబుళ్ల ఏర్పాటు. భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెం మండలం పెద్దనల్లవెల్లిలో యంగ్ ఇండియా స్కూల్ ఏర్పాటుకు 20 ఎకరాల స్థలం కేటాయింపు. ములుగు జిల్లా జగ్గన్నపేటలో స్పోర్ట్స్ స్కూల్‌కు 40 ఎకరాలు కేటాయింపు. జూబ్లీహిల్స్‌తోపాటు రాష్ట్రంలో మరికొన్ని అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌ల ఏర్పాటు.

## అమల్లోకి ఎన్నికల కోడ్..

హైదరాబాద్ : తెలంగాణలో మరోసారి ఎన్నికల నగారా మోగింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 4,200 సర్పంచ్ స్థానాలకు గాను 37, 440 వార్డులకు తొలిదశలో ఎన్నికలు జరుగుతాయని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణికుముదిని మీడియాలో వెల్లడించారు. ముఖ్యంగా ఎన్నికలు మూడు దశల్లో జరుగుతాయని తెలిపారు. తొలి దశ డిసెంబర్ 11 న పోలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. ఆ తర్వాత డిసెంబర్ 14, మూడో దశలో డిసెంబర్ 17న ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. నామినేషన్లను ఎల్లుండి నుంచి స్వీకరించేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు ఎన్నికల కమిషనర్ తెలిపారు. మరోవైపు ఇవాల్టి నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని తెలిపారు. అదే విధంగా ఓటింగ్ జరిగిన రోజేఫలితాలను వెల్లడిస్తామన్నారు. 31 జిల్లాల్లోని 12, 733 పంచాయతీలు, 1,12, 288 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. మరోవైపు ఇప్పటికే రిజర్వేషన్లు సైతం ఖరారు అయిన విషయం తెలిసిందే. దీంతో మరోసారి తెలంగాణలో ఎన్నికల హడావిడి మొదలైంది. ఎన్నికలు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించి అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు తెలిపారు. అయితే.. సెప్టెంబర్ 29న ఎన్నికల షెడ్యూల్ ను ప్రకటించామని ఎన్నికల కమిషనర్ రాణికుముదిని తెలిపారు. 37, 440 తొలిదశలో, రెండొ విడతలో4,333 సర్పంచ్ స్థానాలకు, మూడో విడతలో 4,159 సర్పంచ్ స్థానాలకు, 36, 452 వార్డులకు పోలింగ్ నిర్వహించనున్నట్లు ఎన్నికల కమిషనర్ రాణికుముదిని ఒక ప్రకటనలో వెల్లడించారు.




**1.66 కోట్ల ఓటర్లు...** 'ఈ ఏడాది సెప్టెంబర్ 29న ఎన్నికల షెడ్యూల్ ప్రకటించాం. కొన్ని వివిధ కారణాల వల్ల అక్టోబర్ 9న ఈ షెడ్యూల్ పై హైకోర్టు స్టే విధించింది. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల్లో ఓటర్లు 1.66 కోట్ల మంది ఉన్నారు. 4,236 సర్పంచ్ స్థానాలకు 37,440 వార్డులకు మొదటి తొలి దశలో ఎన్నికలు నిర్వహిస్తాం. నవంబర్ 27 నుంచి తొలి దశ పోలింగ్‌కు సంబంధించిన నామినేషన్లు స్వీకరించనున్నాం. రెండో విడత ఎన్నికలకు నవంబర్ 30 నుంచి, మూడో దశ ఎన్నికలకు డిసెంబర్ 3 నుంచి నామినేషన్లు స్వీకరించనున్నాం. రెండో విడతలో 4,333 సర్పంచ్ స్థానాలు, 38,350 వార్డులకు పోలింగ్ జరగనున్నాయి. మూడో విడతలో 4,159 సర్పంచ్ స్థానాలు, 36,452 వార్డులకు పోలింగ్ నిర్వహిస్తాం' అని ఎస్ఈసీ రాణి కుమిదిని తెలిపారు.

చురకలు







# కేబినెట్ నిర్ణయాలివే..

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో జరిగిన మంత్రి మండలి సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇందులో భాగంగా జీహెచ్ఎంసీ విస్తరణకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఓఆర్ఆర్‌ను ఆనుకొని ఉన్న 27 మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. పెద్ద అంబర్ పేట్, జల్‌పల్లి, తుర్కయంజాల్, శంషాబాద్‌లు, మణికొండ, నార్సింగి, ఆదిభట్ల, దమ్మాయి గూడ, తుక్కుగూడ, మేడ్చల్, నాగారం, పోచారం, ఘట్‌కేసర్, గుండ్లపోచంపల్లి, తూంకుంట, కొంపల్లి, అమీన్‌పూర్, బడంగ్‌పేట్, బండ్లగూడ జీగిర్, మీర్‌పేట్, తెల్లాపూర్, ఫిర్జాదిగూడ, జవహర్ నగర్, బోడుప్పల్, నిజాంపేట్, దుండిగల్, బొల్లారం మున్సిపాలిటీలు జీహెచ్ఎంసీలో విలీనం కాబోతున్నాయి. మరోవైపు మూడో డిస్కం ఏర్పాటుకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. వ్యవసాయ కనెక్షన్లు, లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్స్ కొత్త డిస్కం పరిధిలోకి రానున్నాయి. అదేవిధంగా 3 వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ కొనుగోలుకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

**కేబినెట్ నిర్ణయాలివే..** 1. హైదరాబాద్ తెలంగాణ కోర్ అర్బన్ ఏరియా పరిధిలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లన్నీ జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఔటర్ రింగ్ రోడ్ లోపల, బయట, ఓఆర్ఆర్‌ను ఆనుకొని ఉన్న 27 అర్బన్ లోకల్ బాడీస్ (మున్సిపాలిటీ, కార్పొరేషన్లను) జీహెచ్ఎంసీ GHMCలో విలీనం చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. 2. రాష్ట్రంలో ఇప్పుడున్న NPDCL, SPDCL రెండు డిస్కమ్‌లతో పాటు కొత్తగా మూడో డిస్కమ్ ఏర్పాటు చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. వ్యవసాయ కనెక్షన్లు, లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్స్, మిషన్ భగీరథ, సురక్షిత మంచి నీటి పథకాలు, హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లయ్ సీవరేజ్ బోర్డ్ పవర్ కనెక్షన్లన్నీ కొత్త డిస్కమ్ పరిధిలోకి వస్తాయి. 3. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్, రాబోయే పదేళ్లకు అవసరమయ్యే విద్యుత్తు సరఫరా, విద్యుత్తు ఉత్పత్తి అంచనాపై కేబినెట్ సమగ్రంగా చర్చించింది. విద్యుత్ విభాగం అధికారులు సమగ్రంగా సమర్పించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను పరిశీలించింది. పునరుత్పాదక విద్యుత్తు వినియోగం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నిబంధనల ప్రకారం.. రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్ వినియోగాన్ని పెంచేందుకు మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా 3000 మెగా వాట్ల సోలార్ పవర్ కొనుగోలుకు వీలైనంత తొందరగా టెండర్లు పిలవాలని నిర్ణయం తీసుకుంది. ఐదేళ్ల పాటు విద్యుత్ సరఫరా చేసే కాల పరిమితి ఒప్పందాలతో ఈ టెండర్లు పిలవాలని కేబినెట్ నిర్ణయించింది. 4. సోలార్ పవర్ తరహాలోనే పంప్డ్ స్టోరేజ్ పవర్ వినియోగం పెంచాల్సి ఉంది. 2000 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ పవర్ కొనుగోలుకు టెండర్లు పిలవాలని నిర్ణయం తీసుకుంది. ఐదేళ్ల కాల పరిమితితోనే ఈ టెండర్లు కూడా పిలవాలని కేబినెట్ నిర్ణయించింది. రాష్ట్రంలో పలు చోట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు అనువైన ప్రాంతాలున్నాయి. పంప్డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్లను నెలకొల్పేందుకు ముందుకొచ్చే కంపెనీలు, పెట్టుబడిదారులకు అనుమతి ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇప్పటికే డిస్కమ్‌ల వద్ద ఉన్న ఎంవోయూలను కూడా పరిశీలించాలని నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో 10 వేల మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ విద్యుత్తు ఉత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు అనుమతులు ఇవ్వాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఈ ప్లాంట్ల ఏర్పాటుకు ఆసక్తి ప్రదర్శించే కంపెనీలకు ప్రభుత్వమే అవసరమైన భూమిని కేటాయించి, నీళ్లను అందిస్తుంది. ఈ ప్లాంట్లలో ఉత్పత్తి చేసే విద్యుత్‌ను ముందుగా మన డిస్కమ్‌లకే అమ్మాలనే షరతుతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంటుంది. 5. రాష్ట్రానికి వచ్చే కొత్త పరిశ్రమలు, పెట్టుబడులను ఆకర్షించేందుకు క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీలో భాగంగా రాష్ట్ర మంత్రివర్గం మరో కీలకమైన నిర్ణయం తీసుకుంది. కొత్తగా స్థాపించే పరిశ్రమలు తమకు అవసరమైన విద్యుత్తును తమతంట తామే సొంతంగా ఉత్పత్తి చేసుకునేందుకు అవకాశం కల్పించింది. కొత్త పరిశ్రమలు క్యాప్టివ్ పవర్ జనరేషన్‌కు అప్లై చేసుకుంటే వెంటనే అనుమతి ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. ఇందులో విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యానికి ఎలాంటి గరిష్ఠ పరిమితి లేదు. ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న పరిశ్రమలకు ఇప్పుడున్న విధానంలోనే విద్యుత్ సరఫరా జరుగుతుంది. 6. రామగుండం థర్మల్ పవర్ స్టేషన్‌లో కొత్తగా నిర్మించే 800 మెగావాట్ల ప్లాంట్‌ను ఎన్టీపీసీ అధ్వర్యంలో చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. పాల్వంచ, మక్తల్ లోనూ ఎన్టీపీసీ అధ్వర్యంలో విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని అధికారులకు సూచించింది. ఎన్టీపీసీకి ఈ యూనిట్ నిర్మాణం అప్పగిస్తే ఎంత విద్యుత్ యూనిట్ రేట్ పడుతుంది.. జెన్ కో ద్వారా చేపడితే ఎంత రేట్ పడుతుందో.. ముందుగా అంచనాలు వేసుకుని తుది పరిశీలన చేయాలని కేబినెట్ నిర్ణయించింది. 7. హైదరాబాద్‌లో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే బెంగుళూరులో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ సిస్టమ్ ఉంది. ఇటీవలే అక్కడ అమలు చేసిన విధానాన్ని అధికారులు అధ్యయనం చేసి వచ్చారు. అక్కడ అమలు చేసిన విధానం ప్రకారం %+ఎవీజ% పరిధిలో అండర్ గ్రౌండ్ కేబుల్ సిస్టమ్ ఏర్పాటుకు దాదాపు రూ. 14,725 కోట్లు ఖర్చు అవుతుందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. హైదరాబాద్ సిటీని విద్యుత్ సర్కిళ్ల వారీగా మూడు విభాగాలుగా విభజించి.. ఈ ప్రాజెక్ట్ చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. విద్యుత్‌తో పాటు టీ ఫైబర్, వివిధ కేబుల్ నెట్‌వర్క్ వైర్లన్నీ అండర్ గ్రౌండ్‌లోనే ఉండేలా చేయాలని, ఆ కంపెనీలతో సంప్రదింపులు జరపాలని నిర్ణయం తీసుకుంది. అందుకు సంబంధించి వర్కింగ్ ప్లాన్ రెడీ చేయాలని అధికారులను ఆదేశించింది. 8. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం పెద్ద నల్లబెల్లి గ్రామంలో ఎస్సీ, ఎస్టీ బీసీ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి 20.28 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 9. ములుగు జిల్లా ములుగు మండలంలోని జగ్గన్నపేట గ్రామంలో స్పోర్ట్ స్కూల్ ఏర్పాటు చేసేందుకు 40 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 10. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కొత్తగా అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. ఇప్పుడున్న 56 ఏటీసీలతో పాటు కొత్తగా 6 ఐటీఐలలో ఏటీసీలను ఏర్పాటు చేయాలని నిర్ణయం.




తూర్పు లద్దాఖ్‌లోని వాస్తవాధీన రేఖ వెంబడి శాంతిభద్రతలు కాపాడుకోవడమే లక్ష్యంగా భారత్- చైనా మధ్య ఉన్నతస్థాయి చర్చలు జరుగుతున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఇరుదేశాల సరిహద్దుల్లో ప్రశాంతత నెలకొన్నప్పటికీ.. చైనా టిబెట్‌లోని భారత సరిహద్దు సమీపంలో తన సైనిక మౌలిక సదుపాయాలను విస్తరిస్తూనే ఉంది. వాస్తవ నియంత్రణ రేఖ వెంబడి తమ స్థానాన్ని బలోపేతం చేయడానికి పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ సైనిక వసతుల నిర్మాణ సౌకర్యాలు, లాజిస్టిక్స్ హబ్‌లను నిర్మిస్తోంది. ఇందులోభాగంగా తాజాగా చైనా టిబెట్‌లో మానవ రహిత విమానాల, డ్రోన్ల పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటుచేసినట్లు అమెరికా వైమానిక దళంలో భాగమైన చైనా ఏరోస్పేస్ స్టడీస్ ఇన్స్టిట్యూట్ తన నివేదికలో వెల్లడించింది. దాదాపు 4,300 మీటర్ల ఎత్తులో నిర్మించిన ఈ కేంద్రంలో 720-మీటర్ల రన్‌వే, నాలుగు హ్యాంగర్లు, పరిపాలనా భవనాలు ఉన్నట్లు సమాచారం. అయితే ఈ ప్రాంతంలోని కఠినమైన వాతావరణ పరిస్థితుల వల్ల సైనికుల ఆరోగ్య పరిస్థితులు, కార్యకలాపాల పైనా తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉన్నట్లు నివేదిక అంచనా వేసింది. గతంలో టిబెట్ సరిహద్దు ప్రాంతాల్లో సరైన రవాణా, నెట్‌వర్క్ సదుపాయాలు లేకపోవడం వల్ల చైనా సరిహద్దుల్లో బలగాల మోహరింపు పరిమితంగా ఉండేది. దీంతో భారత్ సరిహద్దుల్లో పీఎల్ఏ సైనికులు మోహరించేందుకు వీలుగా సౌకర్యవంతమైన వాతావరణం సృష్టించుకోవడానికి కొన్నేళ్లుగా చైనా ఏర్పాట్లు చేస్తోంది. రోడ్ల విస్తరణ, అవుట్ పోస్టుల నిర్మాణం, క్యాంపుల ఏర్పాటు వంటి చర్యలు చేపడుతోంది. తాజాగా టిబెట్‌లో మానవరహిత విమానాల పరీక్షా కేంద్రం, సైనిక వసతుల నిర్మాణ సౌకర్యాలు ఏర్పాటుచేయడంతో డ్రాగన్ సరిహద్దుల్లో తన బలాన్ని పెంచుకుంటున్నట్లు తెలుస్తోంది.




హైదరాబాద్, నవంబర్ 25: మతపరమైన దీక్షలపై పోలీసు శాఖ కఠినమైన ఆదేశాలు జారీ చేసింది. మతపరమైన దీక్షలు చేపడితే తప్పనిసరిగా సెలవులు తీసుకోవాలని నిబంధన విధించింది. డ్యూటీలో ఉండగానే అయ్యప్ప దీక్ష వంటి మతాచారాలు చేయకూడదని సూచించింది. డ్యూటీలో నిబంధనలు ఉల్లంఘించినందుకు సౌత్ ఈస్ట్ జోన్ కంచన్‌బాగ్ ఎస్సై కృష్ణకాంత్‌కు పోలీసు శాఖ మెమో జారీ చేసింది. అంతేకాకుండా పోలీసులు జుట్టు, గడ్డం పెంచుకోవద్దని స్పష్టం చేసింది. అలాగే షూస్ లేకుండా సివిల్ డ్రెస్సులో (బ్లాక్ డ్రెస్) డ్యూటీ చేయవద్దని హెడ్ ఆఫీస్ ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం పోలీస్ శాఖలో చాలా మంది అయ్యప్పమాల దీక్ష ధరిస్తున్నారు. కానిస్టేబుల్ నుంచి ఉన్నతాధికారుల వరకు మాలలు ధరిస్తున్నారు. ఈ క్రమంలోనే పోలీస్‌శాఖ ఇలాంటి ఆదేశాలు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఇక డ్యూటీలో ఉన్న పోలీసులు కచ్చితంగా యూనిఫామ్ ధరించాల్సి ఉంటుంది. ఒకవేళ దీక్షలో ఉంటే ముందస్తుగా ఉన్నతాధికారుల అనుమతులు తీసుకుంటే రెండు నెలల పాటు సెలవులు మంజూరు చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నారు. దీక్ష ధరించి విధులకు రావొద్దని.. నల్ల దుస్తులు, నల్ల కండువాలు ధరించి యూనిఫామ్ లేకుండా విధులకు హాజరుకావొద్దని పోలీసు శాఖ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

**రాజాసింగ్ అభ్యంతరం..** అయితే పోలీసు శాఖ ఆంక్షలపై రాజాసింగ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రతీ సంవత్సరం కూడా పోలీస్ శాఖ ఇలాంటి ఆదేశాలు ఇస్తోందన్నారు. హిందువులకే ఇలాంటి రూల్స్ ఉంటాయా అంటూ ప్రశ్నించారు. రంజాన్ వేళ ఇలాంటి ఆదేశాలు ఎందుకు ఇవ్వరు అంటూ రాజాసింగ్ విరుచుకుపడ్డారు.

## అవినీతి కోసమే హెచ్ఐఎల్‌టీపీ పాలసీ.. రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ సీరియస్



హైదరాబాద్, నవంబర్ 25: అవినీతి కోసమే హెచ్ఐఎల్‌టీపీ పాలసీని కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ తీసుకువచ్చారని మాజీ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం 5 లక్షల కోట్ల అవినీతి స్కీంకు తెర లేపిందని ఆరోపించారు. 9,292 ఎకరాల భూమి దారాదత్తం చేసేందుకు హెచ్ఐఎల్‌టీపీ పాలసీని తీసుకువచ్చిందని విమర్శించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ అవకాశాల కోసం ప్రజల నుంచి సేకరించిన ప్రభుత్వ భూమిని అతి తక్కువ ధరకి పారిశ్రామిక వ్యక్తులకు గత ప్రభుత్వాలు ఇచ్చాయని గుర్తుచేశారు. హైదరాబాద్‌లో ఉన్న 20 పారిశ్రామికవాడలలోని 9,292 ఎకరాల భూమిని ప్రైవేటు వ్యక్తులకు దారాదత్తం చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఒకప్పుడు పరిశ్రమల కోసం, ప్రజల ఉపాధి కోసం వచ్చిన భూములను.. ప్రైవేటు వ్యక్తులు అపార్ట్‌మెంట్లు కడతామంటే కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతి ఇస్తోందని మండిపడ్డారు. తాము గతంలో తీసుకువచ్చిన గ్రిడ్ పాలసీలో భాగంగా 50 శాతం ఐటీ ఆఫీసులకు, మిగిలిన 50 శాతం ఇతర అవసరాలకు వినియోగించుకునేలా ప్రభుత్వానికి తగిన ఫీజులు కట్టిన తర్వాత అవకాశం ఇచ్చామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా ప్రైవేటు వ్యక్తుల లాభం కోసం దారాదత్తం చేస్తోందని వ్యాఖ్యలు చేశారు. మార్కెట్ ధరలతో సంబంధం లేకుండా కేవలం ప్రభుత్వ రిజిస్ట్రేషన్ విలువలో 30 శాతం చెల్లిస్తే చాలు అంటున్నారని.. అప్పనంగా ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తున్నారని మండిపడ్డారు.

రేవంత్ రెడ్డితో పాటు ఆయన మనవడు, ముని మనవడు వరకు కావాల్సినన్ని డబ్బులు సంపాదించుకుంటున్నారంటూ ఫైర్ అయ్యారు. అంబానీ సరసన నిలవాలని రేవంత్ రెడ్డి ప్రయత్నం చేస్తున్నట్లు కనిపిస్తోందంటూ కేటీఆర్ కామెంట్స్ చేశారు.

## మహిళలకు రూ.60 వేలు ఇచ్చి సారె పెట్టాల్సిందే: హరీష్ రావు

సిద్దిపేట, నవంబర్ 25: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రతి బతుకమ్మ పండుగకు18 ఏండ్లు నిండిన కోటి 30 వేల మహిళలకు చీరలు అందించారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు తెలిపారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎస్‌హెచ్‌జీ గ్రూప్‌లో ఉన్న సుమారు 40 లక్షల మందికి మాత్రమే చీరలు ఇస్తున్నారని విమర్శించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సిద్దిపేట నియోజకవర్గ స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాల పంపిణీ కార్యక్రమంలో మాజీ మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ.. సిద్దిపేట జిల్లాలో మూడు లక్షల 83 వేల మంది మహిళలు ఉంటే లక్ష 99 వేల మందికి మాత్రమే చీరలు ఇస్తున్నారన్నారు. ఒక్క ఏడాదికి మాత్రమే చీర ఇచ్చి సారె పెట్టిన అని అంటున్నారని.. కానీ మహాలక్ష్మి పథకం ద్వారా ఇవ్వాల్సిన రూ.60 వేలు ఇచ్చి సారె పెట్టాలని డిమాండ్ చేశారు. పట్టణ ప్రాంతాల్లో చీరలు లేవు, వడ్డీలేని రుణాలు లేవని వ్యాఖ్యలు చేశారు. మహిళా సంఘాలు రూ.25 వేల కోట్ల రుణాలు తీసుకుంటే రూ.5 వేల కోట్లకు మాత్రమే వడ్డీలేని రుణం వస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 20 పైసలు ఇస్తూ 80 పైసలు ఎగబడుతోందని.. మొత్తం డబ్బులకు వడ్డీలేని రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్త్రీ నిధికి కూడా వడ్డీలేని



రుణాలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం జిల్లాలోని మహిళ సంఘాలకు ఒక్క ఆర్టీసీ బస్సులు ఇవ్వలేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి మెగావాట్ల సోలార్ పవర్ ఇస్తామని నేటికి ఒక్క మెగావాట్ పవర్ ఎక్కడా కూడా పెట్టలేదని విమర్శించారు. కేసీఆర్ పండుగ పండగకి సంక్షేమ పథకాలు ఇస్తే రేవంత్ రెడ్డి ఓట్ల ఓట్లకు సంకేమ పథకాలు ఇస్తున్నారంటూ మాజీ మంత్రి హరీష్ రావు దుయ్యబట్టారు.




## జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశంలో రచ్చ రచ్చ

హైదరాబాద్, నవంబర్ 25: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో మంగళవారం తీవ్ర గందర గోళం నెలకొంది. వందేమాతరం, జయ జయహే తెలంగాణ గీతాల ఆలాపన సమయంలో మజ్లిస్ కార్పొరేటర్లు కుర్చీలో నుంచి లేవలేదు. దీంతో బీజేపీ కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. వందేమాతర గీతం పాడితేనే దేశంలో ఉండాలంటూ వారు బిగ్గరగా నినాదాలు చేశారు. దాంతో బీజేపీకి వ్యతిరేకంగా ఎంఐఎం కార్పొరేటర్లు ఆందోళనకు దిగారు. ఇరు పార్టీల కార్పొరేటర్లు.. ఈ సమావేశంలో టేబుల్స్ ఎక్కి హంగామా చేశారు. దాంతో మార్షల్స్ రంగంలోకి దిగి.. వారిని బయటకు తీసుకు వెళ్లే ప్రయత్నం చేశారు. సభ సజావుగా జరిగేలా సహకరించాలంటూ కాంగ్రెస్ పార్టీ సభ్యులు ఈ రెండు పార్టీల కార్పొరేటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ రోజు జరుగుతున్న జీహెచ్ఎంసీ పాలక మండలి తుది సమావేశం. మరో రెండున్నర నెలల్లో ప్రస్తుత పాలక వర్గం గడువు ముగియనుంది. ఈ సమావేశంలో 95 ప్రశ్నలు, 45 అజెండ అంశాలపై చర్చించాల్సి ఉంది. ఈ తుది సమావేశానికి జీహెచ్ఎంసీ కార్పొరేటర్లతోపాటు సిటీలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు.

## గురు తేజ్ బహదూర్ బలిదానాన్ని దేశమంతా గుర్తించాలి: రామచందర్‌రావు



హైదరాబాద్: మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మోహన్ సింగ్ ఆధ్వర్యంలో భాజపా రాష్ట్ర కార్యాలయంలో గురు తేజ్ బహదూర్ 350వ వర్ధంతి సందర్భంగా బలిదాన్ దివాస్ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు మాట్లాడుతూ.. గురు తేజ్ బహదూర్ బలిదానాన్ని దేశమంతా గుర్తించాలన్నారు. "దేశానికే శ్రీగురు తేజ్ బహదూర్ మార్గదర్శి. భాజపా ఓటు బ్యాంక్ రాజకీయాలు చేయదు. ఆయన చేసిన త్యాగాన్ని గుర్తించి జయంతి, వర్ధంతులు నిర్వహిస్తున్నాం" అని రామచందర్‌రావు అన్నారు.

## ఐబొమ్మ రవి కేసుపై పీపీటీ.. సంచలన విషయాలు వెల్లడించిన సీపీ

హైదరాబాద్: ఐబొమ్మ రవి కేసుకు సంబంధించి అధికారులు దర్యాప్తును వేగవంతం చేశారు. కీలక సమాచారాన్ని రాబడుతున్నారు. మంగళవారం మధ్యాహ్నం ఐబొమ్మ రవి కేసుపై సీసీఎస్ అడిషనల్ సీపీ శ్రీనివాస్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రవికి బెట్టింగ్, గేమింగ్ యాప్స్ ద్వారా డబ్బులు వచ్చేవని అన్నారు. యాడ్ బుల్ కంపెనీ రవికి చెందినదేనని తెలిపారు. యాడ్స్ ద్వారా వచ్చిన డబ్బుల్ని యాడ్ బుల్ కంపెనీకి మళ్లించారని చెప్పారు. ఇమంది రవి ఇప్పటి వరకు 20 కోట్ల రూపాయల వరకు సంపాదించాడని వెల్లడించారు. సీపీ శ్రీనివాస్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. 'ఐబొమ్మ, బప్పం సైట్లను రవి స్నేహితుడు నిఖిల్ డిజైన్ చేశాడు. ఐబొమ్మ రవి ఓవర్ కాన్ఫిడెన్స్‌తోనే దొరికాడు. రవి భార్య మాకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. మరికొన్ని పైరసీ వెబ్‌సైట్లు నడుస్తూనే ఉన్నాయి. మూవీరూల్జ్, తమిళ్‌ఎంవీ లాంటి పైరసీ సైట్లు ఇంకా నడుస్తున్నాయి. పైరసీ సైట్ల నిర్వాహకులను పట్టుకునే పనిలోనే ఉన్నాం. ఐబొమ్మ పాపులర్ అయ్యాక.. దానిపేరును చాలామంది వాడుకుంటున్నారు. సినిమా సమీక్షలకు కూడా ఐబొమ్మ సైట్ పేరు వాడుకుంటున్నారు. భవిష్యత్‌లో వెబ్-3 టెక్నాలజీ కూడా రాబోతుంది. వెబ్-3 టెక్నాలజీతో పైరసీ చేస్తే పట్టుకోవడం కష్టం' అని అన్నారు. కాగా, నిన్న(సోమవారం) సాయంత్రంతో ఐబొమ్మ రవి కస్టడీ ముగిసింది. చివరి రోజు కస్టడీలో అధికారులు 3 గంటల పాటు అతడ్ని విచారించారు. విచారణలో రవి నుంచి పోలీసులు ఎలాంటి సమాధానాలు రాబట్టలేకపోయారని తెలుస్తోంది.



# రాజ్యాంగ మూల ప్రతి రూప కర్త బి. ఎన్.రావు

## - నవంబర్ 26...భారత రాజ్యాంగ ఆమోదిత దినం సందర్భంగా



బెనెగల్ నరసింహా రావు భారత దేశంలో దాదాపు తెర మరుగైన వ్యక్తి, కనుమరుగైన పేరు. బి.ఎన్.రావుగా నాడు సుపరిచితులయిన ఆయన భారత రాజ్యాంగం రూపొందించిన అసలు వ్యక్తి అని తెలిస్తే ఆశ్చర్యం కలుగక మానదు. రాజ్యాంగ ముసాయిదా కమిటీ అధ్యక్షులుగా బాబా సాహెబ్ ఎన్నుకోబడిన సందర్భంలో ఆయన అన్న మాటలు... "షెడ్యూల్ కులాల ప్రయోజనాలను కాపాడు కోవడం అనే ఒకే ఒక్క తలంపుతో వచ్చిన నాకు రాజ్యాంగ అసెంబ్లీలో ఇటువంటి మరింత బాధ్యతా యుతమైన అధికారం చేపట్టమని నాకు అప్పగించారు. రాజ్యాంగ అసెంబ్లీ నన్ను డ్రాఫ్టింగ్ కమిటీకి సభ్యుడిగా నన్ను ఎన్నుకున్నప్పుడు నేను చాలా ఆశ్చర్య పోయాను. అలాగే అంతకు మించి నేను ముసాయిదా కమిటీకి ఛైర్మన్ గా ఎన్నుకో బడినప్పుడు మరింత ఆశ్చర్య పడ్డాను. ఎందుకంటే అప్పటికే డ్రాఫ్టింగ్ కమిటీలో నాకన్నా మెరుగైన, మరింత సమర్థవంతులైన వారుండటం. అలాగే... "నాకు ఇచ్చిన క్రెడిట్ నిజంగా నాకు చెందినది కాదు. ఇది కొంతవరకు రాజ్యాంగ అసెంబ్లీకి రాజ్యాంగ సలహాదారు సర్ బిఎన్ రావుకు చెందినది, వారు ముసాయిదా కమిటీ పరిశీలన కోసం రాజ్యాంగం యొక్క కఠినమైన ముసాయిదాను సిద్ధం చేశారు". అని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 25 నవంబర్ 1949 న రాజ్యాంగ అసెంబ్లీలో తన ముగింపు ప్రసంగంలో పేర్కొనడాన్ని బట్టి నరసింహా రావు ప్రతిభ, గొప్పతనం స్పష్టం అవుతున్నది. రాజ్యాంగ అసెంబ్లీ అధ్యక్షుడు డా. బాబు రాజేంద్ర ప్రసాద్ కూడా రాజ్యాంగ సంతకం రోజున....భారత రాజ్యాంగానికి "ప్రణాళికను దృశ్యమానం చేసి, పునాది వేసిన వ్యక్తి" అని బి.ఎన్.రావు కృషిని కీర్తిస్తూ చేసిన ప్రస్తావన రావు ప్రతిభను తేటతెల్లం చేస్తున్నది. 1887 ఫిబ్రవరి 26న సంప్రదా య బ్రాహ్మణ మేధావుల కుటుంబంలో మంగళూరులో జన్మించి, సివిల్ సర్వీసెస్, న్యాయ శాస్త్ర పారంగ తునిగా పేరెన్నిక గని, బ్రిటిష్ ఇండియా లో న్యాయ మూర్తిగా పని చేసి, అపార అనుభవం గడించి, 1947 లో బర్మా మరియు 1950 లో భారతదేశం యొక్క రాజ్యాంగాలను రూపొందిం చడంలో ప్రధాన పాత్ర పోషించారు. నరసింహా రావు (26 ఫిబ్రవరి 1887 – 30 నవంబర్ 1953) 1950 నుండి 1952 వరకు ఐక్యరాజ్య సమితి భద్రతా మండలికి అధ్యక్షునిగా ఉన్నారు. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి (1950%–%52) లో భారత ప్రతినిధిగా, అధ్యక్షుడి గా పని చేశారు. కొంతకాలం (1944–45) జమ్మూ కాశ్మీర్ రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. ఫిబ్రవరి 1952 నుండి మరణం చే వరకు, హేగ్‌లోని అంతర్జా తీయ న్యాయస్థాన న్యాయ మూర్తిగా పనిచేశారు. తూర్పు బెంగాల్ లోని అనేక జిల్లాల్లో న్యాయమూర్తిగా పనిచేశారు. 1925 లో, అస్సాం ప్రభుత్వం ప్రావిన్షియల్ కౌన్సిల్ కార్యదర్శిగా సుమారు ఎనిమిది సంవత్సరాలు ఈ పదవిలో పనిచేశారు. ఈ విధులతో పాటు, సైమన్ కమిషన్‌కు ఆర్థిక సహాయం కోసం మెమోరా డాను రూపొందించడం విషయంలో అస్సాం ప్రభు త్వానికి సహకరించారు. వాటర్ కమిషన్ అధ్యక్షుడిగా పనిచేశారు. కలకత్తా హైకోర్టులో న్యాయమూర్తిగా పనిచేశారు. జమ్మూ కాశ్మీర్ రాచరిక ప్రధాన మంత్రిగా ఉంటూ,1945 లో అప్పటి కాశ్మీర్ మహారాజాతో విభేదాలను అనుసరించి ఆయన ఈ పదవికి రాజీనామా చేశారు. సంస్కరణల కార్యాలయంలో ఉండటానికి మరియు రాజ్యాంగ మరియు సమాఖ్య సమస్యలపై పనిచేయడానికి ఇష్టపడగా, గవర్నర్ జనరల్ కార్యాలయంలో కార్యదర్శిగా నియమించ బడ్డారు. రాజ్యాంగ సంస్కరణలపై పనిచేశారు. రావు 1946 లో రాజ్యాంగ అసెంబ్లీకి రాజ్యాంగ సలహా దారుగా నియుక్తులు అయి నారు. రాజ్యాంగ ముసాయిదా రాజ్యాంగంపై చర్చలో నిమ గ్నమై ఉండగా, హైదరాబాద్ నిజాం మరియు భారత ప్రభుత్వాల మధ్య జరిగిన వివాదంలో ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి జోక్యం చేసుకో కుండా గలదా అనే ప్రశ్నపై సంక్షిప్త సమాచారం సిద్ధం చేయడానికి రావు పనిచేశారు. 1946 లో భారత రాజ్యాంగాన్ని రూపొందిం చడంలో రాజ్యాంగ సభకు రాజ్యాంగ సలహా దారుగా బిఎన్ రావు నియ మించ బడ్డారు. ఫిబ్రవరి 1948 లో దాని ప్రారంభ ముసాయి దాను సిద్ధం చేశారు. ఇట్టి ముసాయిదాను 26 నవంబర్ 1949 న భారత రాజ్యాంగ సభ చర్చించింది, సవరించింది మరియు చివరకు స్వీకరించింది. భారత రాజ్యాంగాన్ని రూపొందించడంలో తన పరిశోధనలో భాగంగా, 1946 లో, ఆయన యుఎస్, కెనడా, ఐర్లాండ్ మరియు యునైటెడ్ కింగ్‌డమ్‌లలో పర్యటించారు, అక్కడ రాజ్యాంగ చట్టంపై న్యాయ మూర్తులు, పండితులు మరియు అధికారులతో వ్యక్తిగత సంప్రదింపులు జరిపారు. ఇతరులలో, అమెరికన్ సుప్రీంకోర్టు జస్టిస్ ఫెలిక్స్ ఫ్రాంక్‌ఫర్టర్‌ను కలిశారు. రాజ్యాంగ సలహా దారుగా అయన తయారు చేసిన ముసాయిదా అక్టోబర్ 1947 లో సమర్పించ బడింది. ఇతర దేశాల రాజ్యాంగాలపై తనకు గల విస్తృత పరిజ్ఞానంతో, అలాగే మన దేశంలోని పరిస్థితులపై తనకు గల అపార అధికార నైపుణ్యం తో పాటు తన స్వంత పరిపాలనా అనుభవము రంగరించి తన బాధ్యతను సక్రమంగా నెర వేర్చారు రావు. ఈ ముసాయి దాతో పాటు, రాజ్యాంగ అసెంబ్లీ ఏర్పాటు చేసిన వివిధ ఇతర కమిటీలు ప్రతిపాదించిన నివే దికలు పరిగణనలోకి తీసుకో బడ్డాయి. బిఆర్ అంబేద్కర్ అధ్యక్షతన 1947 ఆగస్టు 29 న ముసాయిదా కమిటీని ఏర్పాటు చేసిన రాజ్యాంగ అసెంబ్లీ తీర్మానం, "రాజ్యాంగ సలహాదారుగా రావు తయారు చేసిన రాజ్యాంగం ముసాయిదాను పరిశీలించ డానికి, అప్పటికే అసెంబ్లీలో తీసుకున్న నిర్ణయాలను అమలులోకి తెచ్చేందుకు, దానికి సంబంధించిన అన్ని విషయాలను చేర్చడానికి లేదా మార్పులకు చర్యలు చేపట్టడం జరిగింది. ముసాయిదా కమిటీ మొదటి ముసాయిదాను 1948 ఫిబ్రవరిలో ప్రచురించింది. ముసాయిదాపై చర్చించడానికి, సవరణలను ప్రతిపాదించ డానికి భారత ప్రజలకు ఎనిమిది నెలల సమయం ఇవ్వ బడింది. ప్రజల వ్యాఖ్యలు, విమర్శలు మరియు సలహాల వెలుగులో, బిఆర్ అంబేద్కర్ 4 నవంబర్ 1948 న (మొదటి పఠనం) తర్వాత రెండవ పఠనం నిబంధన పరిశీలనకు ఒక సంవత్సరం పట్టింది. మూడు చిత్తుప్రతులు మరియు మూడు రీడింగుల తరువాత, రాజ్యాంగం 26 నవంబర్ 1949 న ఆమోదించినట్లు ప్రకటించ బడింది. ఇక బి.ఎన్. రావే స్వయంగా రాజ్యాంగపు మొదటి విడతగా 243 ఆర్టికల్స్ (వర్గాలు) వ్రాసి రాజ్యాంగ రచనా కమిటీకి అందజేశారు. ఆ కమిటీ సభ్యులు కలసి రావు ప్రాథమికంగా రూపొందించిన 243 ఆర్టికల్స్ ను 315 గా రూపొందించారు. చివరకు 2473 సవరణల తరువాత ప్రస్తుత రాజ్యాంగం యొక్క చివరి రూపం మొత్తం 395 నిబంధనలతో సంతరించుకుని తుది రూపు దాల్చింది. రాజ్యాంగ సలహాదారుగా బి.ఎన్.రావు తయారు చేసిన అసలు ప్రతి (ఒరిజినల్ డ్రాఫ్టింగ్) ఆధారం గానే రాజ్యాంగ రచనా కమిటీ రాజ్యాంగాన్ని తయారు చేసిందని, మార్పులు, చేర్పులు, సవరణలతో రెండవ పఠన దశలో అసెంబ్లీచే ఆమోదింప బడిందని స్పష్టం అవుతున్నది.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# సినీ కార్మిక పక్షపాతి ప్రభాకర్ రెడ్డి

## నవంబర్ 26... సినీ నటుడు మందాడి ప్రభాకర రెడ్డి వర్ధంతి



తెలుగు చిత్ర సీమలో క్యారెక్టర్ ఆర్టిస్టుగా పేరొందారు ప్రభాకర్ రెడ్డి. మూడున్నర దశాబ్దాల కు పైగా చిత్ర రంగంలో ఉంటూ, అగ్ర హీరోలతో నటించి, 450కి పైగా సినిమాలలో విలన్ తో పాటు విభిన్న పాత్రలు పోషించిన తెలుగు సినిమా నటుడు ప్రభాకర రెడ్డి గా ప్రసిద్ధులైన డాక్టర్ మందాడి ప్రభాకర రెడ్డి (అక్టోబర్ 8, 1935 – నవంబర్ 26, 1997) సినీ కార్మికుల బ్రతుకు వెతలు సంపూర్ణంగా అవగాహన కలిగి ఉన్న క్రమంలో నిత్యం కార్మికుల కష్టాల గురించే ఆలోచించే వారు. అందుకే ఆయన కార్మిక పక్షపాతిగా గుర్తింపు పొందారు. ఒకప్పుడు మద్రాస్‌లోనే ఉండే తెలుగు సినీ పరిశ్రమను 90వ దశక ఆరంభంలో దాన్ని హైదరాబాద్‌కు తెచ్చేందుకు ఎన్టీఆర్, ఏఎన్నార్ సహా చాలా మంది ఎంతో కృషి చేసారు. అందులో ప్రభాకర్ రెడ్డి పాత్ర చాలా ముఖ్య మైనది. సినీ కార్మికులను సొంత మనుషుల్లా చూసుకునే వారు. ఎందరికో తన ఇంట్లోనే ఆశ్రయం ఇచ్చేవారు. పరిశ్రమ హైదరాబాద్‌కు వచ్చాక ఆయన సినీ కార్మికుల సంక్షేమం కోసం ఆంధ్రప్రదేశ్ సినీ కార్మికుల సమాఖ్యను ఏర్పాటు చేసి దానికి అధ్యక్షుడిగా పనిచేశారు. సినిమాలనే నమ్ముకొని జీవనం సాగిస్తున్న సినీ కార్మికులకు గూడు కల్పించాలన్న ఆలోచనతో ఒక కాలనీ ఏర్పాటు చేయడంపై తీవ్ర కృషి సల్పారు. చిత్ర పరిశ్రమ మద్రాస్ నుంచి హైదరాబాద్ వచ్చినప్పుడు అప్పటి హీరోలతో పాటు సినిమా ఇండస్ట్రీలో స్థిరపడిన చాలా మంది హైదరా బాద్‌లో స్థలాలు కొనుగోలు చేశారు. ప్రభాకర్ రెడ్డి కూడా గచ్చిబౌలి సమీపాన స్థలం కొన్నట్లు చెపుతారు. ప్రభాకర రెడ్డి మాత్రం పేద సినీ కళాకారుల కోసం తాను కొనుగోలు చేసిన ( నేటి 10 కోట్ల విలువైన) స్థలాన్ని ఉచితంగా ఇచ్చినట్లు, అందులోనే కళాకారుల ఇళ్ళ నిర్మాణాలు జరిగినట్లు, అందుకే దానికి ప్రభాకర్ రెడ్డి స్మారకార్థం చిత్రపురి కాలనీ అంటారని ఇటీవల విస్తృత ప్రచారం జరిగింది. ఈ విషయంలో భిన్న కథనాలు, ప్రచారాలు ఉన్నా, కాలనీ నిర్మాణానికి కార్మిక నేతగా ఆయన చేసిన కృషి మాత్రం మరిచి పోలేనిది. చిత్రపురి కాలనీలో ఇళ్ల స్థలాలు పొందిన సినీ కార్మికులంతా ఇళ్లను నిర్మించుకొని ఇంటి అద్దెల బాధను తప్పించు కున్నారు. సంపాదించే డబ్బులతో కుటుం బాలను పోషించు కుంటున్నారు. తమ కోసం ఇంత చేసిన ప్రభాకర్ రెడ్డిని వారు ఎప్పటికీ మరిచి పోరనేది వాస్తవం. ఇక ప్రభాకర్ రెడ్డి స్వతహాగా వైద్యుడు అయినా నటన పై గల అనురక్తితో చాలా తెలుగు చిత్రాలలో నటించాడు. కొన్ని హిందీ, తమిళ చిత్రాలలో కూడా నటించాడు. ఎక్కువగా ప్రతి నాయక పాత్రలలో నటించాడు. 37 ఏళ్ల కెరీర్‌లో దాదాపు 500 సినిమాల్లో నటించడం సామాన్య మైన విషయం ఏమీ కాదు. అయన రచయిత, నటుడు, దర్శకుడు, నిర్మాత కూడా. ఎన్టీఆర్, ఏఎన్నార్ సహా చిరంజీవి వరకు కూడా చాలా మంది సినిమాల్లో విలన్‌గానే కాకుండా అనేక పాత్రల్లో నటించాడు ప్రభాకర రెడ్డి. ప్రభాకరరెడ్డి, సూర్యాపేట జిల్లా, తుంగతుర్తిలో లక్ష్మారెడ్డి, కౌసల్య దంపతులకు 1935, అక్టోబర్ 8 న జన్మించాడు. తుంగతుర్తిలో ప్రాథమిక విద్యాభ్యాసం తర్వాత హైదరాబాదులోని సిటీ కాలేజీలో ఇంటర్మీడియట్ చదివాడు. 1955 నుండి1960 వరకు ఉస్మానియా వైద్య కళాశాలలో వైద్యవిద్యను అభ్యసించాడు. 1960లో గుత్తా రామినీడు దర్శకత్వం వహించిన చివరకు మిగిలేది సినిమాతో చిత్రరంగ ప్రవేశం చేశాడు. ఆ సినిమాలో ఒక మానసిక వైద్యుని పాత్ర పోషించాడు. ఈయన సినీ ప్రస్థానంలో మొత్తం 472 సినిమాల్లో నటించాడు. మంచి విజయాలను సాధించిన పండంటి కాపురం, పచ్చని సంసారం, ధర్మాత్ముడు, గృహప్రవేశం, గాంధీ పుట్టిన దేశం, కార్తీకదీపం, నాకు స్వతంత్రం వచ్చింది వంటి సినిమాలతో పాటు మొత్తం 21 తెలుగు సినిమాలకు కథలను అందించాడు. ప్రభాకర రెడ్డి 1997, నవంబరు 26వ తేదీన తన 62వ యేట హైదరాబాదులో మరణించాడు. 1981 – నంది ఉత్తమ నటుడు – పల్లె పిలిచింది చిత్రం లోని నటనకుబీ 1980 – నంది ఉత్తమ నటుడు – యువతరం కదిలింది చిత్రంలోని నటనకుబీ 1990లో చిన్నకోడలు సినిమాలో ఉత్తమ సహాయ నటుడిగా నంది పురస్కారం అందుకున్నాడు. ఉత్తమ కథా రచయితగా గృహప్రవేశం, గాంధీ పుట్టిన దేశం సినిమాలకు నంది పురస్కారాలను అందుకున్నాడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**


# నవ్వుల పూలంగి రేలంగి - నవంబర్ 26... హాస్య చక్రవర్తి రేలంగి వర్ధంతి



కమెడియన్‌గా, విలన్‌గా, క్యారెక్టర్ నటుడిగా, తన ప్రతిభను అన్ని కోణాల్లో ఆవిష్కరించిన హాస్య చక్రవర్తి రేలంగి. తెలుగు సినీ హాస్య నటుల్లో తొలి పద్మశ్రీ పురస్కారం అందుకున్న కామెడీ కింగ్. తెలుగు సినీ హాస్య సామ్రాజ్యాన్ని దాదాపు రెండు దశాబ్దాలు ఏకఛత్రాధి పత్యంగా ఏలిన హాస్యపు రారాజు రేలంగి. తెలుగు ప్రజల ఆదరాన్ని చూరగొన్నారు. 'మా రేలంగోడు' అని అభిమానంగా పిలిపించు కున్నారు. చెప్పులు లేకుండా నడచిన పాండీ బజారులో ఏనుగు అంబారీమీద ఊరేగాడు. పుట్టి పెరిగిన నేలమీద ఆయన గజారోహణం చేయించు కున్నారు. అసాధ్యాలను సాధ్యాలుగా మలుచు కున్నారు. అగ్రశ్రేణి హీరో రామారావు చేత బావా' ' అని ప్రేమతో, ఆదరంగా పిలిపించు కున్నారు. నటీనటుల చేత, జర్నలిస్టుల చేత సత్కారాలు పొందారు. దేశాధ్యక్షుని చేతి మీదుగా పద్మశ్రీ పురస్కారం అందుకొని తొలి హాస్యనటుడిగా చరిత్ర పుటల కెక్కారు... పుట్టిన నేలతల్లిని మరవకుండా చివరి దశలో అక్కడే తనువు చాలిం చారు. అంతటి గొప్ప పాత తరం నటుడైన రేలంగి వెంకట రామయ్య ( 13 ఆగస్టు 1910 – 26 నవంబర్ 1975) వర్ధంతి సందర్భంగా ఆయన జీవన ప్రస్థానంలో ప్రత్యేకతల గురించి తెలిపే చిరు ప్రయత్నం ఇది. రేలంగి తొలిరోజుల్లో తనపాటలు తనే పాడు కునేవారు.

'పాతాళ భైరవి'లో 'వినవే బాలా నా ప్రేమ గోలా', 'తాళలేనే నే తాళలేనే అమ్మలారా ఓయమ్మలారా', పాటలుబీ విప్ర నారాయణ సినిమాలో 'ఆడది అంటే లయంలయం ఆ నీడంటేనే భయం భయం' పాటబీ మిస్సమ్మ సినిమాలో 'ధర్మం చెయ్ బాబూ కాణీ ధర్మం చెయ్ బాబూ', ' సీతారాం సీతారాం, సీతారాం జై సీతారాం'బీ ఎత్తుకు పైఎత్తు చిత్రంలో 'ఎవడను కున్నావు' పాటలు వాటిలో కొన్ని మాత్రమే. సినిమాలన్నిటి లోనూ వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూ, పాత్రోచితంగా సంభాషణలు నొక్కి వక్కాణించడం హాస్యనటుడిగా ఒక్క రేలంగికే సాధ్యమైంది. అందుకే హీరోతో సమాన ప్రాధా న్యంగా ఉండేలా రచయితలు రేలంగి పాత్రలను తీర్చిదిద్దారు. ఒక హీరో మరియు హీరోయిన్‌కు లభించే జీతం వలె రేలంగి వెంకట రామయ్యకు భారీ మొత్తాన్ని అందించారు. జెమినీ వారు నిర్మించిన 'బాల నాగమ్మ' (1942) చిత్రంలో తలారి రాముడు పాత్ర పోషించిన రేలంగి మళ్ళీ పదిహేడు సంవత్సరాల తరువాత శ్రీవేంకట రామణా వారు నిర్మించిన 'బాల నాగమ్మ' (1959) చిత్రంలో అదే పాత్రను పోషించడం విశేషం. అలాగే 'గొల్లభామ' (1947) చిత్రంలో ధరించిన విదూషకుడి పాత్రనే ఇరవై ఏళ్ల తరవాత 'భామా విజయం' (1967) చిత్రంలో తిరిగి పోషించారు. రేలంగి పోషించిన ఏ పాత్రైనా కథలో ప్రధాన భాగంగా ఉండేదే కానీ, అతికించినట్లు వుండేది కాదు. 'చెంచులక్ష్మి' చిత్రంలో నారదునిగా 'నీలగగన ఘన శ్యామా దేవా' అనే హరినామ కీర్తన చేస్తూ నటిస్తుంటే ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. రేలంగి కోసం 'సరదా సరదా సిగిరెట్టు ఇది దొరల్ తాగు బల్ సిగిరెట్టు' (సిరి సంపదలు), అయ్యయ్యో చేతిలో డబ్బులు పోయెనే (కులగోత్రాలు), హరి గోవింద గోవింద (వెలుగు నీడలు), ఇంగ్లీషులోన మ్యారేజి (ఆరాధన), గనగజా తనయం సహృదయం (వాగ్దానం), చెక్కిలి మీద చెయ్యి జేర్చి చిన్నదానా (మాంగల్యబలం), ఆ దేవుడు మనిషిగ పుట్టాలిరా (అంతస్తులు), నీసోకు చూడకుండ నవనీతమ్మో'%శ్రీ% (తోడికోడళ్ళు), భలే చాన్సులే బలే చాన్సులే (ఇల్లరికం) వంటి ఎన్నో సరదా పాటలు ఆరోజుల్లో సినిమాల్లో పెడితే ప్రేక్షకులు ఎంతబాగా ఆదరించారో చెప్పాల్సిన పనే లేదు. రేలంగి నటించిన చివరి సినిమా ఎన్టీఆర్ నటించిన 'నిప్పులాంటి మనిషి. 1970లో భారత ప్రభుత్వం రేలంగికి 'పద్మశ్రీ' అవార్డు ఇచ్చి సత్కరిం చింది. పద్మ పురస్కారం అందు కున్న తొలి హాస్య నటుడు రేలంగి కావడం విశేషం. శ్రీవేంకటేశ్వర విశ్వ విద్యాలయానికి రేలంగి సెనేట్ సభ్యుడుగా వ్యవహరించారు. ఆంధ్ర నాటక కళాపరిషత్తు, హైదరాబాదు వారు 1955లో రేలంగికి ఘనసత్కారం చేశారు. తనవద్ద పనిచేసిన డ్రైవరుకు వృద్ధాప్యం వలన కళ్లు కనుపించక పోతే, అతనికి ఒక ఇల్లు కట్టించి నెలనెలా పించను వచ్చేలా కొంత పెద్ద మొత్తాన్ని బ్యాంకులో వేసి ఆదుకున్న మానవతా మూర్తి ఆయన. రేలంగి వృద్ధిలోకి వచ్చాక కష్టాలను, కష్టాలలో ఆదుకున్న మిత్రులను మరచి పోలేదు. తను తిండితిప్పలు లేకుండా అవస్థ పడిన వాడు కనుక, తను భోజనం చేసేటప్పుడు కనీసం పాతిక మందికి భోజనం పెట్టే సదాచారాన్ని పాటించారు. నాటి అగ్ర కథా నాయకులు రామారావు, నాగేశ్వరరావు కన్నా ముందే చిత్రసీమలో అడుగు పెట్టినవాడు కావడంతో ఇద్దరూ రేలంగిని ఎంతగానో గౌరవించేవారు. వర విక్రయం సినిమాలో భానుమతి నటించ డానికి కారకులు రేలంగి. అలాగే అంజలీదేవి 'గొల్లభామ'లో నటించడానికి ఆమెను పుల్లయ్యకు పరిచయం చేసిన వ్యక్తి రేలంగి. రేలంగి కాస్టింగ్ ఏజంటుగా పనిచేస్తుండడంతో కృష్ణవేణి, పుష్పవల్లి, హైమవతి, భానుమతి, అంజలీదేవి వంటి నటీమణుల్ని సినిమాల్లో పరిచయం చేసే గొప్ప అవకాశం రేలంగికి దక్కింది. 1910 వ సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ లోని రావులపాలెంలో జన్మించి, 65 వ ఏట 1975 సంవత్సరంలో మరణించిన రేలంగి తెలుగు సినిమా మనగలిగినంత కాలం హృదయాలలో చిరస్థాయిగా నిలిచి పోతారు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

# సుబ్రహ్మణ్య ఆరాధనకు ఉద్దిష్టమైనది సుబ్రహ్మణ్య షష్ఠి



మార్గశిర శుద్ధ షష్టిని సుబ్రహ్మణ్య షష్టి అంటారు. దీనినే చంపా షష్ఠి, ప్రవార షష్ఠి, సుబ్బరాయుడు షష్టి, తమిళు లు దీనిని స్కంద షష్టి అని అంటారు. మార్గశిర శుద్ధ షష్ఠినాడు దేవసేనతో సుబ్రహ్మణ్య స్వామికి వివాహము జరిపించిన దిన నేపథ్యాన్ని "శ్రీ సుబ్రహ్మణ్య షష్ఠి" గా వ్యవహరిస్తారు. శివుని కుమారుడైన సుబ్రహ్మణ్య స్వామి కి..షణ్ముఖుడు, స్కందుడు, కార్తికేయుడు, వేలాయుధుడు, శరవణభవుడు, గాంగేయుడు, గుహుడు, సేనాపతి, స్వామి నాధుడు, సుబ్రహ్మణ్యుడు, మురుగన్, అనే పేర్లు ఉన్నాయి . పూర్వం మూడులోకాలను భయ భ్రాంతులచే పీడిస్తున్న "తారకాసుర" అనే రాక్షస సంహారం కోసం దేవతలు బ్రహ్మదేవుని శరణు వేడారు. బ్రహ్మ ఈశ్వర తేజాంశ సంభవు ని వల్లనే తారకుడికి మరణం ఉంటుందని అని తెలపగా శివుని దేవతలు ఒప్పించి, హిమవంతుని పుత్రిక అయిన పార్వతీదేవితో వివాహం జరిపించారు. ఒకనాడు పార్వతీ పరమేశ్వరులు ఏకాంత ప్రణయానందగా ఉన్న సమయంలో అగ్నిదేవుడు పావురం రూపంలో వారి ఏకాంత మందిరంలోకి వెళ్ళగా, గమనించిన పరమ శివుడు తన దివ్య తేజస్సును ఆ అగ్నిహోత్రునిలోకి ప్రవేశ పెడతాడు. దానిని భరించలేక ఆ దివ్య తేజమును గంగానదిలో విడచి పెడతాడు. ఆ తేజము నదిలో స్నానమాడుచున్న షట్‌కృత్తికల దేవతల గర్భాన ప్రవేశిస్తుంది. ఆ రుద్ర తేజమును వారు భరించలేక పొదలలో విసర్జిస్తారు. ఆరుముఖాల తేజస్సుతో ఒక దివ్యమైన బాలుడుగా ఉద్భవిస్తాడు. ఈ విషయం తెలుసుకున్న పార్వతీ పరమేశ్వరులు రుద్రాంశ సంభూతునిగా ఆ షణ్ముఖుని అక్కున చేర్చుకుని కైలాసం తీసుకుని వెళతారు. ఆ బాలుడు గంగాగర్భంలో తేజో రూపంలో ఉన్నందుకు గాంగే యుడని, షట్ కృత్తికలు వానిని పెంచి పెద్దచేసిన కారణం వల్ల మరియు ఆరుముఖాలు కలవాడు అగుటవల్ల షణ్ముఖు డని, కార్తీకేయుడని, అతడు గౌరీశంకరుల పుత్రుడగుటచే కుమారస్వామి అని, సుబ్రహ్మణ్య స్వామి అని పేర్లతో పిలువ బడ్డాడు. కారణజన్ముడైన ఈ బాలున్ని పార్వతి పరమేశ్వరులు దేవతలు కోరిక మేరకు కుమార స్వామిగా చేసి, దేవతల సర్వసైన్యాధ్యక్షునిగా నియ మించి పరమేశ్వరుడు "శూలం" మొదలైన ఆయుధాలను ఇవ్వగా, ఆ జగన్మాత పార్వతి కుమారుని దీవించి "శక్తి" అను ఆయుధాలను ఇచ్చి సర్వ శక్తివంతుడిని చేయగా నెమలి వాహనారూఢుడై ఆరు ముఖాలు పన్నెండు చేతులతో ఉగ్రరూపం దాల్చి ఆరు చేతుల తో ధనస్సులను మరో ఆరు చేతులతో బాణాలు ధరించి రాక్షస సేనను ఒకేసారి సంహరించాలని తలచి "సర్పరూపం" దాల్చి రాక్షసు లను, భీకర యుద్ధములో తారకాసురుని సంహరించి విజయుడైనాడు. సర్వశక్తి స్వరూపుడైన ఈ స్వామికి దేవేంద్రుడు దేవసేనతో వివాహము జరిపించిన ఈ రోజును "శ్రీ సుబ్రహ్మణ్య షష్ఠి" గా పిలుచు కుంటున్నాము, "శ్రీవల్లి దేవసేనా సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి" వారికి భక్తులు కళ్యాణో త్సవములు, సహస్రనామ పూజలు అత్యంత వైభవంగా జరుపుతూ ఉంటారు. ఈ స్వామి ఆరాధనవల్ల నేత్రరోగాలు, చర్మవ్యాధులు తగ్గుతాయని పెళ్లికాని వారికి వివాహం జరిగి సత్ సంతాన సౌభాగ్యం కలిగి ఆయురారోగ్య ఐశ్వర్యములతో వర్ధిల్లు తారని భక్తుల విశ్వాసం. అలా సంతానం కలిగిన వారు శ్రీ స్వామివారి సహస్ర నామాలలో ఇష్టమైన పేరును వారి బిడ్డలకు పెట్టుకుంటారు. సుబ్రహ్మణ్యానికి పాము పూజకు సంబంధం ఉంది. మూలాధారము నుండి సహస్రారము వఱకు వెన్నెముక (బ్రహ్మదండి) మధ్యనుండి సర్పాకారముగ వ్యాపించి యుండు కుండలినీ శక్తి అన బడు సుషుమ్నానాడియే సుబ్రహ్మణ్యేశ్వరుడు. అజ్ఞాన దశ యందు మనస్సు ప్రపంచా భిముఖమై యుండుటం చేసి వృత్తులన్నియు సుషుమ్నా మార్గమున అధోముఖ వ్యాప్తి కలిగి యుండునపుడు కుండలి నీ (సర్పము = సుబ్రహ్మణ్య ము) పుచ్ఛము సహస్రార మందును, శిరస్సు మూలాధార మందును గలిగి యుండును. సమాధినిష్ఠ, (జ్ఞానావస్థ) యందు పుచ్ఛము మూలాధార మందును, శిరస్సు సహస్రార మందును కలిగి యుండును. అపుడు సర్పాకారుడగు సుబ్రహ్మణ్యుడు తన పడగ సహస్రార కర్ణిక యందుండు శివునిపై యుండును. ఈ కారణము వలన శివుఁడు నాగాభరణుడు అయినాడు. శివున కాభరణమగుట చేత సర్పరూపియగు సుబ్రహ్మణ్యు నకు పూజ్యత కలిగింది. జాతకంలో కుజ దోషం, కాలసర్ప దోషంచే సకాలంలో వివాహం కానివారు వల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్య స్వామి కళ్యాణాలను షష్ఠినాడు చేయటం కనిపిస్తుంది. నాగ ప్రతిష్ట చేసిన వారికి సంతానం కలుగుతుం దనే నమ్మకం భక్తులలో ఉంది. తమిళ నాడు ప్రాంతాలలో ఈ రోజున కావడి మొక్కును తీర్చటం ఆనవాయితీగా కనిపిస్తుంది. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# రెండేళ్లు పూర్తవుతున్నా నూతన అక్రిడిటేషన్లు జారీ చేయని ప్రభుత్వం: టీ యూ డబ్ల్యూ జె

చురకలు ప్రతినిధిహైదరాబాద్, నవంబర్, 25తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టులకు నూతన అక్రిడిటేషన్లు జారీ చేసే విషయంలో ప్రభుత్వం, మీడియా అకాడమీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్ లు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి రెండేళ్లు పూర్తవుతున్నా ఇప్పటివరకు అక్రెడిటేషన్‌లకు సంబంధించిన మార్గదర్శకాలు, జీవో జారీ చేయకపో వడం బాధాకరమని వారు పేర్కొన్నారు.మార్గదర్శకాల రూపకల్పన పేరుతో కమిటీలు వేసుకుంటూ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని, ఈ విధంగా ముందుకు సాగితే మరో రెండు సంవత్సరాలు అయినా కొత్త అక్రెడిటేషన్‌లు జారీ అవుతాయా అనే అనుమానం జర్నలిస్టుల్లో నెలకొందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం జారీ చేసిన కార్డులను మూడు నెలలకు ఒకసారి గత సంవత్సర కాలంగా పొడిగిస్తూ స్టిక్కర్లు అంటించు కుని తిరగడం జర్నలిస్టుల పరిస్థితి ఏ స్థాయికి చేరిందో స్పష్టమవుతోం దన్నారు.గత ప్రభుత్వ హయాంలో 23 వేల అక్రెడిటేషన్ కార్డులు జారీ చేయగా, ప్రస్తుతం వాటి సంఖ్యను తగ్గించడానికి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా కాలయాపన చేస్తోందన్న అనుమానం జర్నలిస్టుల్లో నెలకొన్నదని వారు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో పంచేసే ప్రతి వర్కింగ్ జర్నలిస్టుకు అక్రెడిటేషన్ ఉండాలని అప్పుడు ఇస్తే ఇప్పుడు వాటిని ఏ విధంగా కోతపెట్టాలనే ఆలోచన చేస్తుండటం వల్లే ఈ ఆలస్యం జరుగుతుందనే చర్చ జర్నలిస్టుల్లో నెలకొందని వారు ఆరోపిం చారు. స్థానిక సంస్థల ఎన్నికలు నోటిఫికేషన్ రానుండటం, ఒకదాని తర్వాత ఒకటి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కార్డుల జారీ ప్రక్రియపై ఎలాంటి స్పష్టత లేకపోవడం విచారకరమని ఆందోళన వ్యక్తం చేశారు.మరో నెల రోజులు గడిస్తే మరో స్టిక్కర్ వేసుకోవాల్సిన దుస్థితి జర్నలిస్టులకు వస్తుందన్నారు.చిన్న పత్రికల జర్నలిస్టులు కూడా తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఎంపానెల్మెంట్, అప్‌గ్రేడే షన్‌లపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రెండు అంశాలపై తక్షణమే సమాచార శాఖ మంత్రి, మీడియా అకాడమీ ఛైర్మన్, కమిషనర్ స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే పరిష్కార చర్యలు చేపట్టకపో తే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు దిగాల్సి వస్తుందని వారు హెచ్చరించారు.


చురకలు

## సంపాదకీయం

# విశాఖ స్టీల్ ప్లాంట్ పై పొలిటికల్ హీట్.. సడన్ గా ఏం జరిగింది?

ఏపీ రాజకీయాల్లో తాజాగా రేగిన విశాఖ స్టీల్ ప్లాంటుపై రాజకీయ దుమారం తీవ్రరూపం దాల్చుతోంది. ఈ విషయంలో అధికార, ప్రతిపక్షాలు పోటాపోటీ ఆరోపణలు, ప్రత్యారోపణలు, విమర్శలు ప్రతి విమర్శలతో దుమ్ము రేపుతున్నారు. ఇక ఇరుపార్టీలకు మద్దతుగా మెయిన్ స్ట్రీమ్ మీడియాతోపాటు యూటూబ్ చానళ్లలో ప్రత్యేక కథనాలు వస్తున్నాయి. దీంతో స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ అంశం పెను తుఫాను మాదరిగా రాష్ట్ర రాజకీయాలను కుదిపేస్తోందని అంటున్నారు. ఇరుపక్షాల వాదనలతో కార్మికులు తీవ్ర గందరగోళాన్ని ఎదుర్కొంటున్నారు. ప్లాంటును పరిరక్షించాల్సిన నేతలు ఇలా దుమ్మెత్తిపోసుకోవడంతో ఏం జరుగుతుందో అర్థం కావడం లేదని జుట్టు పీక్కుంటున్నారు. ఇటీవల నిర్వహించిన సీఐఐ సమ్మిట్ లో స్టీల్ ప్లాంటు ఉద్యోగుల పనితీరుపై ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలతో వైసీపీ విమర్శలకు పదును పెట్టింది. స్టీల్ ప్లాంటును వైట్ ఎలిఫెంటుగా మార్చేశారంటూ సీఎం చేసిన కామెంట్స్ ను అవకాశంగా తీసుకున్న వైసీపీ.. ప్లాంటును ప్రైవేటీకరణకు దారులు వేస్తున్నారని మండిపడుతూ విమర్శలు చేస్తోంది. అంతేకాకుండా తన వాదనను నిజమని నిరూపించుకునేలా సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం చేస్తోంది. ఇదే సమయంలో కొందరు యూట్యూబర్లు స్టీల్ ఇష్యూపై ప్రత్యేకంగా వీడియోలు చేస్తూ దుమారం రేపుతున్నారు. మరోవైపు సీఎం వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని, కార్మికులు కష్టపడి పనిచేయకపోతే, ఎంత పెద్ద సంస్థ అయినా తెల్ల ఏనుగులా మారిపోతుందన్న ఆలోచనతోనే సీఎం ఉదహరించారని అంటున్నారు. సీఎంగా చంద్రబాబు అధికారంలోకి వచ్చాకే ప్లాంట్ రక్షణ కోసం దాదాపు రూ.15 వేల కోట్లు సమకూర్చారని అంటున్నారు. అంతేకాకుండా ప్లాంట్ ప్రైవేటీకరణకు తాము వ్యతిరేకమంటూ విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. అయితే తటస్థ జర్నలిస్టులుగా గుర్తింపు పొందిన కొందరు ఈ విషయంలో సీఎం చంద్రబాబును తప్పుపట్టేలా వీడియోలు చేయడంతో వివాదం మరింత ముదురుతున్నట్లు కనిపిస్తోందంటున్నారు. అయితే చంద్రబాబు వ్యాఖ్యల తర్వాత టీడీపీ ఈ విషయంలో కాస్త డిఫెన్సులో పడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ప్లాంటును రక్షించాలంటూ కార్మికులు సుమారు 900 రోజులు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. అప్పట్లో వైసీపీ ప్రభుత్వం తిరుగులేని అధికారం చెలాయించినా ప్లాంటు కోసం ఏమీ చేయలేకపోయిందనే విమర్శలు వినిపించేవని పరిశీలకులు గుర్తు చేస్తున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులు తన నిరసనలను ఉపసంహరించుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద మొత్తంలో ఆర్థిక సాయం చేయడంతో ప్లాంటు రెండో ఫర్నీసు కూడా పనిచేయడం ప్రారంభమైంది. ఈ విషయాన్ని ప్రచారం చేసుకోవడంలో వెనకబడిన అధికార కూటమి.. వైసీపీ విమర్శల తర్వాత ఎక్కువగా ఆత్మరక్షణలో పడిందని అంటున్నారు. దీంతో నష్టనివారణ చేయడంపై ఫోకస్ చేసిన కూటమి పెద్దలు వైసీపీని ఎదుర్కోవడంపై మల్లగుల్లాలు పడుతున్నారని వ్యాఖ్యానిస్తున్నారు. ఈ ఎపిసోడ్ ద్వారా వైసీపీ చాన్స్ దొరికితే ఎలా వెంటాడుతుందనేది అధికార కూటమి అర్థం చేసుకోవాలని ఆ పార్టీ సానుభూతిపరులు సూచిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్, మంత్రి లోకేశ్ మాట్లాడేటప్పుడు ఆచితూచి వ్యవహరించాలని ఈ వివాదం హెచ్చరిస్తోందని అంటున్నారు.

# ప్రతి పౌరునికి సమ న్యాయం జరగాలి - నవంబర్ 26... భారత రాజ్యాంగ ఆమోదిత దినం




నవంబర్ 26 ప్రత్యేకతను సంతరించుకుంది. దీనిని జాతీయ "న్యాయ దినోత్సవం"గా జరుపు కుంటున్నారు. భారత రాజ్యాంగ ఆమోదిత దినంగా జరుపుకునే ఈ దినాన్ని రాజ్యాంగ దినోత్సవమని, సంవిధాన్ దివస్ అని కూడా పిలుస్తారు. పొట్టకూటికోసం, వ్యాపారం పేరుతో, మన దేశంలో అడుగు పెట్టిన శ్వేత జాతీయులు, చివరకు మన దేశాన్ని, రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యంలో భాగంగా చేసుకొన్నారు. సుదీర్ఘకాలం పరాయి పాలనలో మగ్గిన దేశం భారతదేశం. ఎందరో స్వాతంత్ర్య సమర యోధుల త్యాగ ఫలితాలతో 1947 ఆగస్టు 15న స్వతంత్ర భారత మాత స్వేచ్ఛా వాయువులు పీల్చ గలిగింది. స్వయం పాలనాధి కారాన్ని దక్కించుకున్న దేశంలోని అన్ని మతాలు, తెగలు, నిమ్న దళితులు, గిరిజనులు, వెనుక బడిన కులాల తదితర వర్గాలకు సైతం న్యాయం జరిగేలా, వారి హక్కులకు భంగం వాటిల్లకుండా ఉండేందుకు, సర్వసత్తాక సౌర్వ భౌమాధికారాన్ని దక్కించు కొనేందుకు వీలుగా రాజ్యాంగాన్ని రూపొందించాల్సిన బాధ్యత అప్పటి ప్రభుత్వంపై పడింది. రాజ్యాంగం అంటే దేశానికి, ప్రజలకు, ప్రభుత్వానికి కరదీపిక లాంటిది. ఆ దీపస్తంభపు వెలు గుల్లో సర్వసత్తాక సౌర్వభౌమా ధికార దేశంగా ప్రగతి వైపు అడుగులు వేయాలి. అందుకనే రాజ్యాంగానికి ఆధునిక ప్రజా స్వామ్య చరిత్రలో అంతటి విశిష్టమైన స్థానముంది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మన దేశం కంటే ముందు అనేకదేశాలు రాజ్యాంగాలను రచించాయి. అయితే భారత రాజ్యాంగ రచన ఒక సంక్లిష్టం. దేశంలో అనేక మతాలు, తెగలు, ఆదీవాసీలు, దళితులు, అణగారిన, పీడనకు గురైన వర్గాలు... తదితరులు ఎందరో ఉన్నారు. సదరు వర్గాల ఆకాంక్షలకు అనుగుణంగా రాజ్యాంగ రచన నిస్సందేహంగా ఒక పెద్ద సవాలే. ఇందుకు భారత తొలి రాష్ట్రపతి బాబు రాజేంద్ర ప్రసాద్ నేతృత్వంలో డా.బాబా సాహెబ్ అంబేద్కర్ అధ్యక్షతన డ్రాఫ్టింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. రాజ్యాంగాన్ని తయారు చేసు కోవడానికి దేశంలోని సుప్రసిద్ధ నాయకులు, అనుభవజ్ఞులు, విద్యావేత్తలు, న్యాయ కోవిదులు, వివిధ రంగాల ప్రముఖులతో రాజ్యాంగ నిర్మాణ సభను నిర్వహించు కున్నారు. రాజ్యాంగ రూపకర్త అంబేద్కర్ భిన్నత్వ సమ్మేళితమైన దేశానికి రాజ్యాంగాన్ని రూపొందించడంలో ప్రముఖ పాత్రలో ఎంతగానో శ్రమించారు. ప్రభుత్వ విధివిధానాలు, శాసనసభల రూపకల్పనతో పాటు కోట్లాది మంది పీడిత ప్రజల ఆశయాలను ప్రతిబింబించేలా రాజ్యాంగాన్ని లిఖించారు. కులాలు, విభిన్న మతాలు, రకరకాల కట్టు బొట్టు ఆచార వ్యవహారాల సంఘటిత భారతావనికి స్వరూపాలనా రూపకల్పనను రాజ్యాంగ బద్ధం చేశారు. రాజ్యాంగ మంటే కేవలం ప్రభుత్వ విధివిధానాలు, శాసనసభల రూపకల్పనే కాదు... కోట్లాది పీడిత ప్రజల ఆశయాలను ప్రతిబింబించాలన్నది బాబా సాహెబ్ ఆశయం. ఆయన కృషి ఫలితంగానే ప్రపంచంలోనే కొత్తదైన రాజ్యాంగం రూపు దిద్దుకుంది. అందుకనే ప్రపంచంలోని అనేక దేశాల రాజ్యాంగాల కంటే భారత రాజ్యాంగం ఉన్నత విలువలు కలిగిందంటూ మన్ననలు పొందింది. అంబేద్కర్ చైర్మన్‌గా, జవహర్‌లాల్ నెహ్రూ, మౌలానా అబుల్ కలాం ఆజాద్, సర్దార్ పటేల్, ఆచార్య జె.బి.కృపలానీ, డా.రాజేంద్ర ప్రసాద్, సరోజినీ నాయుడు, రాజాజీ, వల్లభ్ పంత్, బి.ఆర్. అంబేద్కర్, టంగుటూరి ప్రకాశం పంతులు, పట్టాభి సీతారామయ్య మొదలైన వారు ఈ సభలో సభ్యులు. 2 సంవత్సరాల, 11 నెలల, 18 రోజులు కష్టించి, రాజ్యాంగ సభ మొదటి సమావేశం 1946, డిసెంబర్ 9తో ప్రారంభించి 11 సార్లు, 165 రోజుల పాటు సమావేశాలు జరగగా, ఇందులో 114 రోజులు రాజ్యాంగం రాత ప్రతిపై వెచ్చించింది. రాజ్యాంగ రాత ప్రతిని తయారుచేసే క్రమంలో రాజ్యాంగ సభ ముందుకు 7,635 సవరణ ప్రతిపాదనలు వచ్చాయి. వీటిలో 2,473 ప్రతిపాదనలను పరిశీలించి, చర్చించి, పరిష్కరించింది. ఏడు దశాబ్దాల కిందట 26నవంబర్ 1949నాడు డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన సర్దార్ వల్లభాయ్ పటేల్ ప్రతిపాదించి ప్రవేశ పెట్టారు. అందమైన చేతిరాతతో హిందీ, ఇంగ్లీషు ప్రతులను, 24 జనవరి 1950న 284 మంది సభ్యుల సంతకాలతో ఆమోదించారు. రెండు రోజుల తర్వాత 26 జనవరి 1950నుంచి మన రాజ్యాంగం అమలులోకి వచ్చింది. రాజ్యాంగాన్ని సభలో ప్రవేశపెట్టే ముందు అప్పటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్... మహాత్మాగాంధీకి నివాళులు అర్పించి ప్రసంగించారు. రాజ్యాంగాన్ని ఆమోదించిన తర్వాత జాతీయ గీతం 'జనగణమన'ను స్వాతంత్ర్య సమర యోధురాలు పూర్ణిమా బెనర్జీ ఆలపించారు. 1949 నవంబర్ 26న రాజ్యాంగానికి ఆమోదముద్ర పడినా... రాజ్యాంగ దినోత్సవం నిర్వహించ లేదు. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ రాజ్యాంగం ఏర్పడిన 66ఏళ్ల తర్వాత తొలిసారిగా రాజ్యాంగ ఆమోదిత దినోత్సవాన్ని నవంబర్ 26, 2015న జరుపుకుంది. ప్రతీ ఏటా నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవం జరుపు కోవాలని భారత ప్రభుత్వం 2015 నవంబర్ 19న గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. అలా 26న రాజ్యాంగసభ రాజ్యాంగాన్ని ఆమోదించిన రోజు కనుకనే ఏటా ఈ రోజును రాజ్యాంగ దినోత్సవంగా నిర్వహిస్తున్నాం. రాజ్యాంగ మౌలిక లక్ష్యం... సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని అందరరికీ అంచించడం. ఈ లక్ష్యము ప్రజల హక్కులకు రూపాన్ని ఇచ్చింది. ప్రజాస్వామ్య సంప్రదాయాలను పరిరక్షించేందుకు స్వతంత్ర ప్రతిపత్తి గల, సమర్ధ వంతమైన న్యాయాన్ని ఇవ్వగల వ్యవస్థ రూప కల్పనే రాజ్యాంగం. చట్టము ముందు సమాన పరిగణన, వ్యక్తిగత స్వేచ్ఛ వంటి అంశాల అధ్యయనము ద్వారా బారతీయ న్యాయవ్యవస్థ పాత్రను బలోపేతము చేయడం జరిగింది. రాజ్యాంగ అమలు ద్వారా పౌర హక్కుల అవగా హనను వివిధ దశల్లో విస్తృత పరిచారు. ప్రాథమిక హక్కులకు పెద్దపీట వేశారు. వీటన్నింటికీ రక్షణ న్యాయవవస్థ కాబట్టి రాజ్యాంగ ముసాయిదా సంతకాల రోజును జాతీయ న్యాయ దినోత్సవాన్ని జరపడానికి ఎంచుకున్నారు. ప్రభుత్వాలు చట్టాలు ప్రజా వ్యతిరేకముగా ఉన్నా, రాజ్యాంగాన్ని అతిక్రమించేవిగా ఉన్నా, అవి చెల్లవని చెప్పే అధికారము రాజ్యాంగ ధర్మాసనాలకు ఉన్నది .. సుప్రీం కోర్టు ఇచ్చే తీర్పులకు కూడా చట్ట హోదా ఉంటుంది. అయితే కోర్టులలో కేసుల నమోదు రేటు రాను రాను పెరుగుతున్నది. న్యాయమూర్తుల కొరత ఉన్నందున కేసుల పరిష్కారము సత్వరము జరుగక, చాలా కాల వ్యవధి పడుతున్నది. ఒక్క అమాయకుడికి కూడా అన్యాయము జరగ కూడదన్న సూత్రము న్యాయ వ్యవస్థకు పునాది. అందుకే న్యాయము అందడంలో జాప్యము కారణంగా చాలా మంది కోర్టుల్ని ఆశ్రయించడానికి సందేహిస్తున్నా రనేది వాస్తవం. అయితే న్యాయ వాద వృత్తిలో ఉన్న వారంతా చట్టబద్ధముగా సమస్యలను పరిష్కరించు కోవాల్సిందిగా ప్రజల్ని చైతన్య పరచాల్సిన అవసరము ఉన్నది. ఈ మేరకు ప్రజల్లో విశ్వాసము పెంపొందించ గలగాలి. భాదితుల హక్కులను కాపాడటం. తీవ్రమైన నేరాలను నివారించడం, ప్రపంచంలోని శాంతి, భద్రతలకు భంగం వాటిల్లకుండా చేయడానికి ప్రతి ఒక్కరి భాగస్వామ్యయుత కృషి జరగాలి. అప్పుడే న్యాయ పరిరక్షణ సాకారం అవుతుంది. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్ – 9440595494**


# చేనేతకు చేయూత అవసరం - నవంబర్ 26... చేనేత పితామహుడు ప్రగడ కోటయ్య వర్ధంతి సందర్భంగా

భారత స్వాతంత్ర్యోద్యమంలో ప్రధాన భూమిక పోషించి, స్వాతంత్ర్య సమపార్జనకు ఒక సాధనంగా నిలిచింది చేనేత. గాంధీజీ కూడా రాట్నంపై నూలు వడకడానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. అంతటి ప్రాధాన్యత కలిగిన చేనేత రంగానికి ఒకరోజు ఉండాలన్న ఉద్దేశ్యంతో జాతీయ చేనేత దినోత్సవంను ఏర్పాటు చేయడం జరిగింది. తెలంగాణ రాష్ట్రానికి చెందిన యర్రమాద వెంకన్న నేత చేనేత దినోత్సవానికి సరైన తేదీ కోసం అధ్యయనం చేశారు. భారత స్వాతంత్ర్య ఉద్యమం జరుగుతున్న సమయంలో విదేశీ వస్త్రాలను బహిష్కరించాలన్న లక్ష్యంతో స్వదేశీ ఉద్యమం వచ్చింది. మొదటిసారిగా 1905లో బెంగాల్ రాష్ట్ర రాజధాని కలకత్తాలోని టౌన్‌హాల్‌లో 1905 ఆగస్టు 7న భారీ సమావేశం నిర్వహించి విదేశీ వస్త్రాలను బహిష్కరించడంతో పాటూ దేశీయోత్పత్తుల పునరుద్ధరణకు పిలుపునిచ్చారు. భారతీయ చేనేతకు వేల సంవత్సరాల చరిత్ర ఉంది, ప్రపంచంలో అతి కొద్ది దేశాలకు మాత్రమే ఈ ఘనత ఉంది. పురాతన కాలంనుంచి భారతీయ చేనేత వస్త్రాలు ప్రపంచమంతా ఎగుమతులు చేయబడేవి. భారతదేశంలో అతి ప్రాచీన పరిశ్రమ ఇది. ఒకప్పుడు దేశానికి పేరు, డబ్బు తెచ్చిన, వందల ఏళ్ల క్రితం నుంచీ విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించిన ఘనత ఈ పరిశ్రమకు ఉంది. శాతవాహనుల కాలంలో ఇక్కడి వస్త్రాలు యూరప్‌కి ఎగుమతి అయిన ఆధారా లున్నాయి. రెండువేల సంవత్సరాల క్రితం %-%హంస' డిజైన్లతో ఉన్న భారతీయ వస్త్రాలు ఈజిప్టు కైరో నగరంలో లభ్యమయాయి. కాలక్రమేణా బ్రిటిష్ పాలనలో, ఆ తరువాత పారిశ్రామికీకరణలో ఈ రంగం భారీగా దెబ్బతిన్నది. అగ్గిపెట్టెలో పట్టే మస్లిన్ చీరలను నేసిన ఘనచరిత్ర ఉన్న దేశం మనది. తరతరాలుగా చేనేత కుటుంబాలలో వారసత్వ కళగా ఇది కొనసాగుతోంది. కొన్ని కుటుంబ సభ్యులంతా కలిసి మగ్గాల మీద బట్ట నేస్తుండడం మనకు కనిపిస్తుంది. ప్రముఖ చేనేత కేంద్రాలలోని గ్రామాలలో, మొత్తంగా నేతపనిలో నిమగ్నమై ఉంటారు. ఉపాధి విషయంలో వ్యవసాయం తరువాత చేనేతది రెండవ స్థానం, కుటీర పరిశ్రమల కింద కోట్లాది మందికి ఉపాధి కల్పిస్తున్నది చేనేత పరిశ్రమ. ప్రత్యక్షంగా, పరోక్షంగా 70లక్షల మందికి పైగా ఈ పరిశ్రమ ఉపాధి కల్పిస్తోంది, వీరు మగ్గాల మీద నేసిన వస్త్రాలు, దేశం మొత్తం వస్త్రాల ఉత్పత్తిలో 20% పైగా ఉంటాయి. ప్రపంచ చేనేత వస్త్రాలలో 90% పైగా భారత దేశంలో నేయబడతాయి. భారత దేశంలో దాదాపు 150 చేనేత కేంద్రాలు ఉన్నాయని అంచనా. నూలు, కాటన్, సిల్క్, పట్టు, ఇతర సహజంగా ఉపలబ్ధమయ్యే నార, పీచులతో అద్భుతమైన వస్త్రాలు తయారు చేస్తారు చేనేత కళాకారులు. 2008 నుండి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారికంగా జరుపుతుంది. 2008, ఆగస్టు 7న హైదరాబాదు లోని రవీంద్రభారతిలో జరిగిన చేనేత దినోత్సవ వేడుకలకు నాటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి హాజరైనారు. 2012, ఏప్రిల్ 6న రవీంద్ర భారతిలో వెంకన్న సారధ్యంలో చేనేత దినోత్సవ చరిత్ర, ఆవశ్యకతను వివరిస్తూ స్వదేశీయం సంగీత నృత్య రూపకం ప్రదర్శించారు. 2012, ఆగస్టు 7న దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట నుండి రాజ్ ఘాట్ వరకు చేనేత వాక్ చేసి జాతీయ స్థాయిలో ఈ దినోత్సవంపై ఆసక్తిని కలిగించారు. 2014లో అదే రాజ్ ఘాట్ లో చేనేత దినోత్సవ ర్యాలీకి ముఖ్య అతిథిగా వచ్చిన అప్పటి కేంద్ర జౌళీ శాఖ మంత్రి సంతోష్ కుమార్ గంగ్వార్ ప్రధానితో చర్చించి చేనేత దినోత్సవాన్ని అధికారికం చేస్తామని మాటిచ్చారు. అన్ని రాష్ట్ర ప్రభుత్వాల, కేంద్ర ప్రాంత ప్రభుత్వాల అంగీకారంతో 2015, జూలై 29న భారత ప్రభుత్వం ఆగస్టు 7ను జాతీయ చేనేత దినోత్సవంగా అధికారిక గెజిట్ విడుదల చేసింది. 2015,ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని భారత ప్రధాని నరేంద్ర మోడీ చెన్నైలో అధికారికంగా ప్రారంభించారు. చేనేత పరిశ్రమ నేడు కుంటుపడింది. అనేక లోటుపాట్ల కారణంగా చేనేత కుటుంబాలకి గిట్టుబాటు ధర లభించడం లేదు. ముడి సరుకు అందుబాటులో లేకపోవడం %-% దారం, నూలు, చెట్ల పూల రంగులబీ కొనుగోలు చేయడానికి ఎంతో దూరాలు వెళ్ళాల్సిరావడంబీ ముడి సరుకు ధరలు పెరుగుదల- కాటన్/నూలు, సిల్క్, జనప ధరలు పెరగడంబీ ఎరువులు పురుగు మందులు, రసాయనాల ధరలు పెరగడం వల్ల కాటన్ ధరలు విపరీతంగా పెరిగాయి. చేనేత రంగంలో మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు లేకపోవడంబీ ఎన్నో ప్రాంతాల్లో పరిశ్రమ కనీసావ సరాలైన స్థలం, నీళ్ళు, విద్యుత్తు కూడా అందుబాటులో ఉండవు. రంగులు డిజైన్లు క్షణక్షణం మారుతుంటాయి. కొత్త డిజైన్ల కొరత పరిశ్రమను దెబ్బతీస్తోంది. ఇది చేనేత కళాకారులు చేయలేక కాదు, డబ్బు పెట్టేవాళ్ళు %-%రిస్క్' లేకుండా వ్యాపారం చేయాలను కోవడం కారణం. మార్కెట్ల వ్యవస్థ సదుపాయాలు లేకపోవడం. చేనేత పరిశ్రమ ఉత్పత్తులకు %-%పేటెంట్' లేకపోవడం వల్ల రక్షణ లేదు, అన్ని సంప్రదాయ డిజైన్లు అనుకరించి నకళ్ళు చేస్తున్నారు. చేనేత సహకార సంస్థలు రాజకీయ జోక్యం వల్ల, అవినీతి వల్ల నష్టాల పాలయాయి. కేంద్ర రాష్ట్ర బడ్జెట్లలలో సరైన నిధుల కేటాయింపులు లేకపోవడం, చేనేత డిజైన్లు నకలు/ కాపీ చేసి, పవర్లూమ్లులు అవే చేనేత అని చెప్పుకుని చెలామణి అయిపోతున్నాయి. తెలంగాణలో చేనేత రంగంలోని 40 వేల కుటుంబాలకు సంక్షేమ కార్యక్రమాలు అమల వుతున్నాయి. పోచంపల్లి, ఆలేరు, కనుకుల, శాయంపేట, కమలా పూర్, ఆర్మూర్, వెల్టూర్, వేములవాడలో బ్లాక్ లెవల్ క్లస్టర్లు ఏర్పాటు అయ్యాయి. పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్కు అభివృద్ధికి రూ.15 కోట్లు కేటాయించారు. లాక్ డౌన్ మరింత ప్రమాదంలోకి తోసింది. చేనేత, మరనేత రంగాలు ఇప్పుడు ఇదే ఇబ్బందుల్లో ఉన్నాయి. లాక్ డౌన్ వల్ల బట్టల వ్యాపారం పూర్తిగా ఆగిపోయింది. దీని ప్రభావం నేత కార్మికులపై తీవ్రంగా ఉంది.



ప్రస్తుతం నేత కార్మికులుగా... ఒకరు చేతితో మగ్గంపై నేతనేసే వారు, చేనేత కార్మికులు. రెండోవారు, కరెంటు మెషీన్ల మీద నేతనేసేవారు మరనేత కార్మికులు. లాక్ డౌన్ ఇప్పుడు ఇద్దర్నీ ఇబ్బంది పెడుతోంది. ప్రభుత్వాలు చేనేత రంగానికి తగు ప్రోత్సాహం అందించడంతో పాటు, ప్రతి భారతీయుడు, తాము కొనే వస్త్రాలలో, దుప్పట్లు, తువాళ్ళు, కర్టెన్లు మొదలైన నిత్యం వాడే వస్తువుల్లో, కనీసం 15-20% చేనేత తయారీలు వాడగలిగితే, మన ప్రాచీన సాంస్కృతిక సంపద, వారసత్వం మన గలుగుతుంది. చేనేత మీద ఆధారపడ్డ లక్షలాది కుటుంబాలు మనుగడ సాగించ గలుగుతాయి. రెండున్నర దశాబ్దాలు చట్టసభలలో సభ్యులుగా ఉండి, చేనేతనే తన ధ్యాసగా శ్వాసగా జీవించి, చేనేత కార్మికుల స్థితి గతుల మెరుగుదలకు ఎన్నో పోరాటాలు చేసిన చేనేత పితామహుడు ప్రగడ కోటయ్య వర్ధంతి సందర్భంగా చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరాన్ని గుర్తు చేసు కోవాలి. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్ – 9440595494**

# చేనేత పితామహుడు ప్రగడ కోటయ్య - నవంబర్ 26... ప్రగడ కోటయ్య వర్ధంతి



సనాతన సాంప్రదాయాలకు, ప్రాచీన సంస్కృతికి అనాదిగా ఆలవాలమైన భారత దేశంతో చేనేత విడదీయలేని బంధం అనుబంధం, సంబంధం కలిగి ఉంది. భారతీయత సాంస్కృతిక కళలలో ముఖ్యమైనదై, వారసత్వానికి ప్రతీక అయిన చేనేత కళ దేశానికి గర్వకారణం. భారత స్వాతంత్ర్యోద్యమంలో ప్రధాన భూమిక పోషించి, స్వాతంత్ర్య సమపార్జనకు ఒక సాధనంగా నిలిచింది చేనేత. గాంధీజీ కూడా రాట్నంపై నూలు వడకడానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. అంతటి ప్రాధాన్యత కలిగిన చేనేతనే ఊపిరిగా జీవించి, చేనేత కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడి, వ్యవసాయ రంగం తర్వాత చేనేతకు గుర్తింపు తెచ్చిన చిత్తశుద్ధి గల జాతీయ నేత ప్రగడ కోటయ్య. ఆయన భారత స్వాతంత్ర్య సమరయోధుడు, ఉత్తమ పార్లమెంటేరియన్. చేనేత ఉద్యమానికి నాయకుడు . జాతీయ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషిస్తునే, చేనేత పరిశ్రమ రక్షణ కోసం పోరాడిన యోధుడు ప్రగడ కోటయ్య. ఎన్.జి.రంగా అడుగు "జాడలలో నడిచి మహాత్మా గాంధీ ఆశీస్సులతో జాతీయ చేనేత కాంగ్రెస్ స్థాపించి ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. చేనేత కార్మికులకు ప్రయోజనం కలిగించేందుకు సహకార సంఘాలు ఒక మార్గంగా సూచించారు. మగ్గంతో బట్టలు నేసే కుటుంబంలో పుట్టి పెరిగిన కోటయ్య దేశవ్యాప్త చేనేత కార్మికుల ప్రయోజనాలే లక్ష్యంగా కొన ఊపిరి వరకు నిరంతరం శ్రమించారు. చేనేతరంగంతో పాటు రైతులు, జిన్నింగ్, స్పిన్నింగ్, కాంపోజిట్ మిల్లులపై ఆమూలాగ్రం అధ్యయనం చేసిన పరిశోధనా విద్యార్థి కోటయ్య . గుంటూరు జిల్లా నిడుబ్రోలులో ప్రగడ వీర భద్రుడు, కోటమ్మ దంపతులకు 1915 జూలై 26న కోటయ్య జన్మించారు. 1931లో ఎస్ఎస్ఎల్సీ స్కూలు ఫైనల్ ఉత్తీర్ణత సాధించి, కొంత కాలం బాపట్ల తాలూకా బోర్డులో ఉపాధ్యాయుడుగా పని చేశారు. మద్రాస్ టెక్స్టైల్స్ ఇన్స్టిట్యూట్ లో చదివి అక్కడ సూపర్వైజర్గా పనిచేసారు. 1935లో ఏర్పడిన మద్రాసు రాష్ట్ర చేనేత పారిశ్రామికుల సహకార సంఘంలో ప్రొడక్షన్ ఇన్చార్జిగా ఉద్యోగంలో చేరి సర్కారు జిల్లాల్లో ప్రాథమిక చేనేత సహకార సంఘాలు ఏర్పాటు చేసేందుకు విశేషంగా కృషి చేసారు. 1939లో జరిగిన మద్రాసు రాష్ట్ర కేంద్ర చేనేత సహకార సంఘం ఎన్నికల్లో డైరెక్టర్లుగా చేనేత నాయకులు ఎన్నికయ్యేలా కోటయ్య పథకం రచించి కృతకృత్యులయ్యారు. 1941లో బ్రిటిష్ ప్రభుత్వం దేశవ్యాప్తంగా చేనేతరంగం స్థితిగతులను అధ్యయనం చేసేందుకు థామస్ కమిటీని నియమించగా, కమిటీని కోటయ్య గుంటూరు జిల్లాకు ఆహ్వానించారు. వంద పేజీల మెమొరాండాన్ని ఆ కమిటీకి అందజేశారు. 1942లో చెన్న రాష్ట్ర చేనేత పారిశ్రామిక సంఘాన్ని చైతన్య వంతంగా చేసేందుకు దామెర్ల రమాకాంతరావు అధ్యక్షులుగా, కోటయ్య ప్రధాన కార్యదర్శిగా కృషి చేశారు. నూలు కొరతను అధిగమిం చేందుకు నూలు ధరల స్థిరీకరణ కోసం చేనేత రక్షణ యాత్రలు నడిపారు. చేనేత పారిశ్రామికులకు చాలినంత నూలు సరఫరా చేయాలని, నూలు ధరలు అదుపులో పెట్టాలని, నూలు ఎగుమతులు ఆపాలని నినదిస్తూ కోటయ్య ఆందోళనలు చేపట్టారు. అన్ని జిల్లాల్లో ఆకలియాత్రలు, సత్యాగ్రహాలు పెద్దఎత్తున చేపట్టారు. మద్రాసు నగరంలో 1950 ఏప్రిల్ 16 నుంచి జూన్ 30 వరకు 75 రోజుల పాటు కోటయ్య సత్యాగ్రహం నడిపారు. దాదాపు పది వేల మంది చేనేత కార్మికులు ఈ సత్యాగ్రహంలో పాల్గొన్నారు. 75 రోజుల అనంతరం కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి హరేకృష్ణ మెహతాబ్ మద్రాసు వచ్చారు. చేనేత కాంగ్రెస్ నాయకులతో చర్చలు జరిపారు. మంత్రి ఇచ్చిన హామీలతో సత్యాగ్రహాన్ని విరమించారు. 1952 మద్రాసు శాసనసభ ఎన్నికల్లో కిసాన్ మద్దూర్ ప్రజాపార్టీ అభ్యర్థిగా కోటయ్య చీరాల నియోజ చేనేత వర్గాల ప్రయోజనాల కోసం రేపల్లెలో సత్యా గహం చేపట్టారు. ఫలితంగా కోటయ్య జైలు శిక్ష అనుభవించాల్సివచ్చింది. రెండున్నర దశాబ్దాలు చట్టసభల్లో సభ్యుడిగా ఉన్న కోటయ్య చేనేతే తన శ్వాస ధ్యాస అన్నట్లుగా జీవించారు. చట్టసభల్లో, బయట వేదికలపై చేనేత వస్త్ర రంగం గురించి ప్రపసంగిస్తుంటే ప్రతి ఒక్కరూ ఆసక్తిగా వినేవారు. కోటయ్య డిమాండ్లు, ప్రతి పాదనలకు భారతదేశ వ్యాప్తంగా ఉన్న చేనేత పారిశ్రామిక వర్గానికి చెందినది అయినందున ప్రతి సభ్యుడూ మద్దతు పలుకుతూ వచ్చారు. చేనేత కార్మికవర్గ ప్రయోజనాల కోసం నిరంతరం అప్రమత్తతతో ఉంటూ వచ్చారు. చేనేతకు సంబంధించి ప్రభుత్వం ఏ నిర్ణయం చేయాలన్నా కోటయ్యను సంప్రదించే చేసేది. 1952లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ప్రకాశం పంతులు స్థాపించిన కృషీకార్ లోక్ పార్టీ ద్వారా శాసన సభ్యునిగా అఖండ విజయం సాధించి, సాధారణ ఎన్నికలలో చీరాల నుంచి శాసన సభ్యునిగా, 1957 నుంచి 1972 వరకు ఎమ్మెల్యేగా, 1974 నుంచి 1980 వరకు ఎమ్మెల్సీగా ఉన్నారు. అనంతరం 1990 నుంచి 1995లో మరణించేంత వరకు రాజ్యసభ సభ్యునిగా ఉన్నారు. 1974 నుంచి 1978 వరకు పీసీసీ ప్రధాన కార్యదర్శిగా పని చేసారు. 1945లో ఏర్పడిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ వీవర్స్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. నిరంతరం ప్రజాజీవితం గడిపిన కోటయ్య అనారోగ్యం కారణంగా 1995 నవంబర్ 26న మరణించారు. 70వ జన్మదినం సందర్భంగా చీరాలలో జరిగిన సభలో ఆనాటి ఉత్తరప్రదేశ్ గవర్నర్ బెజవాడ గోపాలరెడ్డి, కోటయ్య గారికి 'ప్రజాబంధు' బిరుదు నిచ్చి సత్కరించారు. కోటయ్య మరణాంతరం రాష్ట్ర ప్రభుత్వం వెంకటగిరిలోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ సంస్థకు ప్రగడ కోటయ్య పేరు పెట్టడం జరిగింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్ – 9440595494**

# దాచుకోవడం ట్రేడ్.. దోచుకోవడం ట్రెండ్

హైదరాబాద్: బహుళ అంతస్తుల్లో వ్యాపార కేంద్రాలను నడిపిస్తూ.. ఆ మేర ట్రేడ్ లైసెన్సు ఫీజు చెల్లించేందుకు మాత్రం పలు ప్రైవేటు సంస్థలు కక్కుర్తి పడుతున్నాయి. లైసెన్సు ఫీజు నుంచి తప్పించుకునేందుకు.. తప్పుడు వివరాలతో ధ్రువీకరణపత్రాలు తీసుకుంటున్నాయి. కొందరైతే.. వాస్తవ విస్తీర్ణంలో పది శాతం విస్తీర్ణాన్ని కూడా రికార్డుల్లో చూపట్లేదు. క్షేత్రస్థాయిలో పన్ను మదింపు చేపట్టే బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లకు లంచాలు ఇచ్చి.. జీహెచ్ఎంసీకి టోపీ పెడుతున్నారు. బల్దియా ఆదాయానికి గండి కొడుతున్నారు.

**ఇటీవల లక్ష కేంద్రాలు వెలుగులోకి..**

విద్యుత్తుశాఖ తరపున నగరంలో వ్యాపార కేటగిరీ కింద 10లక్షల విద్యుత్తు కనెక్షన్లు జారీ అయ్యాయి. జీహెచ్ఎంసీ వద్ద ట్రేడ్ లైసెన్సు తీసుకున్న వ్యాపారాలు మాత్రం 1.2 లక్షలే. రెవెన్యూ విభాగం అదనపు కమిషనర్ ఇటీవల విద్యుత్తుశాఖ జారీ చేసిన కమర్షియల్ కనెక్షన్లను, ఆయా ఇంటి నెంబర్ల వివరాలను సరిపోల్చగా.. ట్రేడ్ లైసెన్సు తీసుకోకుండా నడుస్తోన్న సుమారు లక్ష కేంద్రాలు లెక్క తేలాయి. వాటిని మరోసారి తనిఖీ చేసే ప్రక్రియ పురోగతిలో ఉంది.

**70శాతం లైసెన్సుల్లో తప్పిదాలు..**

గ్రేటర్ హైదరాబాద్‌లో దాదాపు 2లక్షల వ్యాపార కేంద్రాలున్నాయి.




వాటి నుంచి గత ఆర్థిక సంవత్సరంలో వసూలైన ట్రేడ్ లైసెన్సు రుసుము రూ.95 కోట్లు మాత్రమే. వాస్తవ విస్తీర్ణాన్ని దాచి పెట్టి.. నామమాత్రపు విస్తీర్ణంతో జారీ అయిన లైసెన్సులు 70శాతం ఉంటాయని, అందువల్లే ఆదాయం రావట్లేదని సమాచారం. ఇటీవల అదనపు కమిషనర్ అనురాగ్ జయంతి.. ట్రేడ్ లైసెన్సులపై తనిఖీలు చేపట్టారు. విస్తీర్ణాలు లెక్కగట్టి ట్రేడ్ లైసెన్సులను సవరించాలని అధికారులను ఆదేశించారు.

**రూ.100 కోట్లు లక్ష్యం..**

ఈ సంవత్సరం ఇప్పటికే రూ.115 కోట్ల ట్రేడ్ లైసెన్సు ఫీజు వసూలైంది. గతేడాదితో పోలిస్తే ఆదాయం రూ.20కోట్లు పెరిగింది. తనిఖీలు కొనసాగుతున్నాయని, ఈ ఏడాది చివరికి మరో రూ.80 కోట్ల మేర ఆదాయాన్ని పెంచుకుంటామని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. నగరవ్యాప్తంగా 110 షాపింగ్ మాల్స్‌లో తనిఖీలు చేశామని, అందులో 15 మాల్స్ ఉల్లంఘనలకు పాల్పడినట్లు గుర్తించామని, వాటికి నోటీసులు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు.

# స్వచ్ఛత నేతిచందం

భద్రాచలం : నిత్యం వేలమంది భక్తుల రాకపోకలతో సందడిగా ఉండే భద్రాచలం పట్టణాన్ని అడ్డాగా చేసుకుని కొందరు అక్రమ వ్యాపారాన్ని విస్తరించే ప్రయత్నాలు సాగిస్తున్నారు. రకరకాల పద్ధతుల్లో వినియోగదారులను నిలువునా మోసం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలకు చెందిన నలుగురు వ్యక్తుల వద్ద రూ.52 వేల విలువైన 65 కిలోల కల్తీ నెయ్యిని పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. కొన్ని రకాల క్రిములతోపాటు డాల్డా వంటివి వాడి దీన్ని తయారు చేస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. ఈ ఘటన స్థానికంగా కలకలం సృష్టించింది. ఆధ్యాత్మిక క్షేత్రమైన భద్రగిరిలో ఆహార పదార్థాల నాణ్యతపై తనిఖీలు నామమాత్రంగా సాగుతుండటంతో అక్రమ వ్యాపారం జోరుగా సాగుతుందన్న ఆరోపణలున్నాయి.

**ప్రైవేటు లడ్డూలపై కన్నేయాలి..**

గతంలో రామాలయ పరిసరాల్లో ప్రైవేటు వ్యక్తులు భారీ స్థాయిలో లడ్డూలను విక్రయించిన సందర్భాలు ప్రత్యక్షంగా వెలుగుచూశాయి. ప్రధానంగా యాత్రీకులు ఎక్కువగా ఉండే శ్రీరామ నవమి వంటి వేడుకల సమయాల్లో వీటి విక్రయాలకు రెక్కలొస్తుంటాయి. దీనికి ఆలయంతో ఎలాంటి సంబంధం లేనప్పటికీ ఆలయ పరిసరాల్లో భక్తుల సంచారం ఉన్నచోట విక్రయించటం వల్ల గిరాకీ బాగుంటుంది. కొత్తగా వచ్చే వారికి ఏమాత్రం అనుమానం రాకుండా లడ్డూ ధరలను



తగ్గించరు. రామాలయం సిబ్బంది గతంలో రెండు మూడుసార్లు నకిలీ లడ్డూలను స్వాధీనం చేసుకున్నారు. ముక్కోటి ఏకాదశి మహోత్సవాలకు ఏర్పాట్ల దీనిపై నిఘాను పెంచాలి.

**నెయ్యి ప్యాకెట్లను పోలి..**

కొందరు పూజలకు తక్కువ ధరగల చిన్న నెయ్యి ప్యాకెట్లను ఉపయోగిస్తుంటారు. ఇదే అదనుగా హైదరాబాద్ కేంద్రంగా నూనె పసుపుతో చిన్న ప్యాకెట్లను తయారు చేసి భద్రాచలం వంటి చోట్లకు తరలించి విక్రయిస్తున్నారు.

ఇది పసుపు రంగులో ఉండడంతో ఆవు నెయ్యి అన్న భ్రమ కల్పించి సొమ్ము చేసుకుంటున్నారు. అర కిలో, కిలో డబ్బాల్లో భద్రపర్చుతున్నారు. సహజ సిద్ధమైనదని నమ్మిస్తూ ఇంటింటికీ తిరిగి విక్రయిస్తున్నట్లు సమాచారం. తమకు పాడి పరిశ్రమ ఉందని ఇది స్వచ్ఛమైన నెయ్యి అని చెబుతూ నాణ్యత లేనిది అంటగడుతున్నారు.

భద్రాచలం చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన కొందరు రామాలయం పరిసరాలలో మజ్జిగ విక్రయాలు చేస్తుంటారు. ఇది వారికి ఉపాది కల్పించే మార్గమైనప్పటికీ నాణ్యతపై దృష్టి సారించాలి.

# పరీక్షల్లో పాస్.. వసతుల్లో ఫెయిల్!



కొత్తగూడెం: కొత్తగూడెంలోని జిల్లా సర్వజన ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన టీ-హబ్‌లో మౌలిక వసతులు కరవయ్యాయి. నిత్యం వందల సంఖ్యలో వచ్చే నమూనాలకు పరీక్షలు నిర్వహిస్తూ.. ఆరోగ్య సేవల్లో మెరుగైన పనితీరు కనబరుస్తున్నా సదుపాయాల లేమి శాపంగా మారింది. జిల్లా ప్రధాన ఆసుపత్రిలో 57 రకాల రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించేలా 2021లో టీ-హబ్‌ను ఏర్పాటు చేశారు. 2023లో మరో 77 పరీక్షలను చేర్చారు. ప్రస్తుతం టీ-హబ్‌లో 134 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు.

**ఇవీ ఇబ్బందులు**ఏజెన్సీ జిల్లా అయిన భద్రాద్రిలో రూ.వేలు వెచ్చించి ప్రైవేటుగా రోగ నిర్ధారణ పరీక్షలు చేయించుకోలేరు.

ఏ మాత్రం సాంకేతిక ఇబ్బంది తలెత్తినా రోజుల తరబడి పరీక్షలు నిలిచిపోతుండటంతో ఇబ్బంది పడుతున్నారు. తక్షణం శాశ్వత భవన నిర్మాణ పనులు ప్రారంభించడంతోపాటు బయోమెడికల్ ఇంజినీర్ నియామకం, ప్రత్యేక నీటి సౌకర్యం వంటి సదుపాయాలు సమకూర్చాలి.రూట్ల వారీగా ప్రత్యేక వాహనాల్లో నమూనాలు తరలించి, పరీక్షల అనంతరం ఫలితాలను ఫోన్లకు మెసేజ్ చేస్తున్నారు.

**సమస్యలివి..**వందల సంఖ్యలో రసాయన పరీక్షలు, రక్త నమూనాల విశ్లేషణకు ప్రత్యేక నీటి సదుపాయం అవసరం. ప్రత్యేకించి నీటి సౌకర్యం లేకపోవటంతో ఆసుపత్రికి కేటాయించిన వాటినే వాడుకోవాల్సి వస్తోంది.

రక్త నమూనాలను ఒకేచోట సేకరించేందుకు చేపట్టిన శాశ్వత నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. కీలక రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే టీ-హబ్ నేటికీ తాత్కాలిక రేకుల షెడ్డులోనే నడుస్తోంది. పరికరాల భద్రత, సురక్షితమైన పని వాతావరణం, వసతుల కల్పనలో సమస్యలు ఎదురవుతున్నాయి.

హబ్‌లో అత్యాధునిక, అత్యంత ఖరీదైన పరికరాలుంటాయి. వీటిని సక్రమంగా నిర్వహించడానికి, ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయడానికి బయో మెడికల్ ఇంజినీర్ తప్పనిసరి. ఇంజినీర్ పోస్టు ఖాళీగా ఉండటంతో పరికరాలు పాడైతే వెంటనే మరమ్మతులు చేయలేక, పరీక్షలు నిలిచిపోతున్నాయి.

టీ-హబ్‌కి నిత్యం వచ్చే నమూనాలు: 700 నుంచి 800

'టీ-హబ్‌లో మరిన్ని మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరముంది. వాటి ఏర్పాటుకు కావాల్సిన నిధులను అంచనా వేసి ఉన్నతాధికారులకు అందించాం.' నిజాముద్దీన్, టీ-హబ్ నిర్వాహకుడు

# చెలిమితో బలిమి



రాజపేట : విద్యార్థులకు చదువుతో పాటు వారి మనస్తత్వం, ప్రవర్తన, కమ్యూనికేషన్ నైపుణ్యాలు మెరుగు పడేలా పీఎంశ్రీ పాఠశాలల్లో నూతనంగా 'చెలిమి' అనే నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. విద్యార్థుల్లో భావోద్వేగ స్థిరత్వం, ఆత్మవిశ్వాసం, మంచి ఆలోచనలు పెంపొందించేందుకు కేంద్ర సర్కారు 'సోషియో ఎమోషనల్ వెల్ బీయింగ్ ప్రోగ్రాం' పేరిట ప్రత్యేక కార్యక్రమం చేపట్టనుంది. కార్యక్రమ అమలుకు ప్రతి పీఎంశ్రీ పాఠశాలకు ఒక నోడల్ ఉపాధ్యాయుడిని ఎంపిక చేసి రాష్ట్ర స్థాయిలో ఆయా అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ అనంతరం సదరు ఉపాధ్యాయుడు ఇతర ఉపాధ్యాయులకు కూడా మార్గదర్శనం చేయాల్సి ఉంటుంది.

**రెండు విడతలుగా తర్ఫీదు** ఉమ్మడి నల్గొండ జిల్లాలో మొత్తం 99 పీఎంశ్రీ పాఠశాలలున్నాయి. నల్గొండ జిల్లా ఉపాధ్యాయులకు ఈ నెల 24-26 వరకు ఉండగా, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల వారికి డిసెంబరు 15-17 వరకు ఉంది. మూడు జిల్లాలకు సంబంధించి రెండు విడతలుగా జరగనున్న శిక్షణకు ఒక్కో ఉపాధ్యాయుడు చొప్పున మొత్తం 99 ఉపాధ్యాయులు నోడల్ అధికారిగా శిక్షణకు వెళ్లనున్నారు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని టీజీఐఆర్‌డీ కార్యాలయంలో ఒక్కో విడతలో మూడు రోజులపాటు ఉంటుంది.

**శిక్షణలో అంశాలు ఇవీ..**

ప్రధానంగా విద్యార్థుల్లోని భావోద్వేగాలను అర్థం చేసుకోవడం.. అంటే విద్యార్థుల కోపం, భయం, బాధ వంటి భావాలను ఉపాధ్యాయులు గుర్తించి సానుకూల వాతావరణం కల్పించడం చేయాల్సి ఉంటుంది. నిత్యం ఎదురయ్యే సమస్యలకు భయపడకుండా వాటిని ఎదుర్కొనే ధైర్యం పెంపొందించడం, పరిష్కార మార్గాలను చూడటం చేయాలి. ఒక్క తరగతి గది మాత్రమే కాకుండా ఇంట్లో, సమాజంలో గౌరవంగా మసులుకునేలా వివరించాలి. క్రమశిక్షణతో పాటు చదువు, ఆటపాటల్లో రాణించేలా చూడాలి. ముఖ్యంగా సహచర విద్యార్థులను అర్థం చేసుకోవడం, సమూహంగా కలిసి పనిచేయడం అలవాటుగా మార్చాలి. ప్రతికూల పరిస్థితుల్లో కూడా సానుకూల దృక్పథం అలవడేలా ఉపాధ్యాయులు చూడాల్సి ఉంటుంది.

# బాదేస్తుంటే.. బాధేస్తోంది..!



ఆత్మకూర్ : నూతనకల్ మండలం పాతర్లపహాడ్‌కు చెందిన లబ్ధిదారులు వీరు. గుండ్లసింగారం పాలేరు యేరు మూడు కి.మీ. దూరమే ఉంటుంది. ఇసుక బుక్ చేసుకుంటే ట్రిప్పునకు రూ.6వేలు చెల్లించాల్సి వస్తోంది. దీంతో ఎడ్లబండికి మరమ్మతు చేయించి కుమారుడు, అల్లుడు సహాయంతో తిప్పలు పడుతూనే ఇసుక తీసుకెళుతున్నారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరవడంతో సొంతింటి కల నెరవేరిందని సంతోషించారు. అది కొన్నాళ్లకే ఆవిరైంది. పథకం రాగానే వ్యాపారులు ఇళ్ల నిర్మాణ సామగ్రి ధరలను రెండింతలు పెంచేశారు. అయినా ఇసుక, ఇటుక ప్రియమే అవుతున్నాయి. ధరల మోత పథకం రాకముందు, ప్రస్తుతం అన్న రీతిన ఉన్నాయి. దీంతో కట్టడాలు నిలిచిపోతున్నాయి.

**నియంత్రణ కమిటీలు నిస్తేజం**

పేదలకు రూ.5 లక్షలతో పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వడానికి ప్రభుత్వం సంకల్పించి ఇళ్ల పథకాన్ని 2024 మార్చిలో తీసుకొచ్చింది. వీటికోసం ఎదురుచూస్తున్నట్లుగా..ముగ్గు పోయడం నుంచి గృహ ప్రవేశాల వరకు ధరల బాదుడే. దీంతో ఇంటి నిర్మాణ సామగ్రి ధరలు అమాంతం పెరిగిపోయాయి. మండలాల్లో ఏర్పాటు చేసిన ధరల నియంత్రణ కమిటీలు కళ్లప్పగించి చూస్తున్నాయి.

వాగులు, యేర్లు నిండుగా ప్రవహిస్తుండడంతో ఇసుక దొరకడం కష్టంగా మారింది. అందుబాటులో ఉన్న ఇసుకకు విపరీత డిమాండ్ ఏర్పడింది. ఒక ట్రిప్పు ఇసుకను రూ.10వేల చొప్పున కొనుగోలు చేయకతప్పలేదు. ఇక ఇటుకబట్టీ యజమానులు ట్రాక్టరు ట్రిప్పునకు రూ.19వేల వరకు పెంచేయడంతో లబ్ధిదారులు బెంబేలెత్తిపోతున్నారు.

**రెండింతలు పెరిగాయి: మొలుగూరి అనిల్, గుంజలూరు(చివ్వెంల)**

పేదలకు నీడ కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం రూ.5లక్షలతో ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రవేశపెట్టింది. ఇదే అదునుగా వ్యాపారులు నిర్మాణ సామగ్రి ధరలను అమాంతం రెండింతలు పెంచారు. ఇది సామాన్యులకు భారంగా మారింది. ముఖ్యంగా ఇటుక, ఇసుక కొరత తీవ్రంగా ఉంది. ట్రిప్పు ఇసుక రూ.10వేలు, ఎర్ర ఇటుక రూ.19వేల చొప్పున వెచ్చించాల్సి వచ్చింది.

**ధరలను నియంత్రణకు కమిటీ: సిద్ధార్థ, పీడీ, గృహనిర్మాణశాఖ, సూర్యాపేట**

తహసీల్దార్ అధ్యక్షతన ప్రతి మండలంలో ధరల నియంత్రణ (మానటరింగ్) కమిటీని ఏర్పాటు చేశాం. ఈ కమిటీ ఇంటి నిర్మాణ సామగ్రిని సరఫరా చేసే వారికి నోటీసులు అందించి ధరలను నియంత్రిస్తుంది.

# అసహనం.. అతి ప్రమాదం

నాంపల్లి : 'పదునైన ఆయుధం కంటే.. క్షణకాలంలో వచ్చే కోపమే అత్యంత ప్రమాదకరం' అన్నారు రామకృష్ణ పరమహంస. మనిషిలో నిరాశ, నిస్పృహ, అసహనం పెరిగిపోతున్నాయి. ప్రతి చిన్న విషయానికి కోపగించుకోవడం, గొడవలు పడటం సర్వసాధారణమవుతోంది. ఆలోచిస్తే.. కొంత సంయమనం పాటిస్తే.. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందనే విషయాన్ని గమనించొచ్చు. దీన్ని మర్చిపోయి భావోద్వేగాలు అదుపు చేయలేక లేనిపోని సమస్యలు కొనితెచ్చుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో విద్యార్థులు, ఉద్యోగులు, యువత దీని కారణంగా మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నారు.

**అన్ని అనర్థాలకు కారణం..**

అసహనం పొడచూపిన వెంటనే దాన్ని గుర్తించండి. ఆ పరిస్థితికి కారణాలు ఒక్కసారి ప్రశాంతంగా ఆలోచించండి. సమస్యకు అసలైన పరిష్కార మార్గం తప్పక దొరుకుతుంది. సహనం కోల్పోతే అందరి ముందు పరువు పోగొట్టుకోవడం తప్ప ప్రత్యేకంగా ఒనగూరేది ఏమీ



ఉండదు. అసహనం అనారోగ్యాలకూ కారణమవుతుంది. శరీరం తీవ్రమైన ఒత్తిడికి గురవుతుంది. కోపం అధిక రక్తపోటు(బీపీ), మధుమేహం వంటి రోగాలు శరీరంలోకి చేరడానికి అవకాశం కల్పిస్తుంది. కొన్ని సందర్భాల్లో విచక్షణ కోల్పోయి ప్రవర్తించాల్సి రావడంతో జీవితాలు తలకిందులయ్యే ప్రమాదం కూడా లేకపోలేదు.

**జీవన విధానంలో మార్పు..**

దీన్ని అధిగమించేందుకు జీవన విధానాన్ని మార్చుకోవాలి. శ్వాస సంబంధిత వ్యాయామం, యోగా, ధ్యానం చేయడం వల్ల స్వీయ నియంత్రణ పొందొచ్చు. అలాగే శ్రమకు తగిన విశ్రాంతి తీసుకోవాలి. ఇలా చేయడంతో ఒత్తిడి దూరం అవుతుంది. ఎలాంటి విపత్కర పరిస్థితిలోనూ అసహనం మన దరి చేరదు.

**ప్రణాళికతో ప్రశాంతత: భవానిసాగర్, మండల వైద్యాధికారి, నాంపల్లి**

విద్యార్థులు, యువత ఒత్తిడితో కూడిన భారీ లక్ష్యాలకు బదులు, దానిని చిన్న భాగాలుగా నిర్దేశించుకొని వేగంగా సాధించేలా ప్రణాళిక చేసుకోవాలి. లక్ష్య సాధనతో ప్రశాంతత లభిస్తుంది. శారీరక, మానసిక ఆరోగ్యానికి వ్యాయామం చక్కని ఔషధం.

# దేవుడికి మంచిరోజులొచ్చాయ్..!

సూర్యాపేట: సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లిలోని 365వ జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న యోగానంద లక్ష్మినరసింహాస్వామి ఆలయానికి చెందిన భూమి అంటూ దేవదాయశాఖ ఏర్పాటు చేసింది. మొత్తం 780 ఎకరాలు ఉండగా రెండొందల ఎకరాలకు పైగా ఆక్రమణకు గురైంది. కొంత స్థలంలో ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించారు. కాగా ఆ భూములను కౌలుకు తీసుకున్న వ్యక్తులే దశాబ్దాల కిందట ఇళ్ల నిర్మాణాలు చేసుకున్నారు. రాజకీయ నేత ఒత్తిళ్లతో అధికారులు చర్యలు తీసుకోలేని పరిస్థితి. బోర్డులు పెట్టినా ఆక్రమణలు ఆగడం లేదు. ప్రస్తుతం 440 ఎకరాల్లో కౌలుదారులు సాగు చేసుకుంటున్నారు.

ఈనాడు, సూర్యాపేట: ఉమ్మడి నల్గొండ జిల్లాలోని వందలాది ఎకరాల దేవాదాయ భూములు కబ్జా కోరల్లో చిక్కుకున్నాయి. ఇన్నాళ్లు ఎంతో విలువైన ఈ ఆస్తులను కాపాడే నాథుడు లేక అక్రమార్కుల చేతుల్లోకి చేరుతున్నాయి. సంబంధిత అధికారులు కొన్నిచోట్ల క్షేత్రస్థాయి పర్యవేక్షణకు వెళ్లినా చర్యలు తీసుకోలేని దుస్థితి. రాజకీయ నేతల ఒత్తిళ్లు.. పలుకుబడి కలిగిన వ్యక్తుల బెదిరింపులతో ఇక అటువైపు వెళ్లలేని పరిస్థితి. దీంతో అవి క్రమంగా కనుమరుగు అవుతున్నాయి. ఇకపై ఆక్రమణలకు అడ్డుకట్టపడనుంది. వీటికి పరిష్కారం చూపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి, నిపుణులతో కూడిన కమిటీ ఏర్పాటుపై దృష్టిసారించింది. ఫలితంగా కబ్జా చెర వీడి, న్యాయస్థానాల్లో ఆయా స్థలవివాదాలకు పరిష్కారం లభించనుంది.

**నిత్య పూజలకు**

సర్కారు ఏర్పాటు చేయబోయే ప్రత్యేక కార్యదళం, నిపుణుల కమిటీతో ఇకపై దేవుడికి అన్ని మంచి రోజులే. ఒకవైపు మాన్యం భూముల ఆక్రమణలు, కౌలు సరిగా రాక ఆలయాల అభివృద్ధి జరగక, ధూపదీప నైవేద్యాలకు దాతలపై ఆధారపడుతున్న పరిస్థితులకు అడ్డుతొలగనుంది.



వాటి సంరక్షణతో వచ్చే ఆదాయంతో దేవాలయాల అభివృద్ధి, నిత్యార్చనలకు ఇక ఢోకా ఉండదని జిల్లా ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

**ఇదీ పరిస్థితి..**

దేవాదాయ, ధర్మాదాయ శాఖ రికార్డుల ప్రకారం ఉమ్మడి జిల్లాలోని 501కి పైగా ఆలయాల పేరిట రూ.కోట్లు విలువ చేసే 15,712 ఎకరాల మాన్యం భూములు ఉన్నాయి. ఇందులో సుమారు 3,974 ఎకరాలు ఆక్రమణలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కొన్ని చోట్ల వాటిని కౌలుకు తీసుకున్న వ్యక్తులే తమ పేరిట పట్టాలు చేయించుకున్నట్లు విమర్శలున్నాయి. మరికొన్ని చోట్ల వాటిని ఆక్రమించుకుని నివాస స్థలాలుగా మార్చుకున్నారు. ఇంకొన్ని ప్రాంతాల్లో భూ రికార్డులను తారుమారు చేసి తమ పేరిట రాయించుకున్న ఘటనలు ఉన్నాయి. తమ పూర్వీకులు ఆలయాలకు భూమి ఇవ్వలేదని తమకు వారసత్వంగా సంక్రమించిన స్థిరాస్తి తమకే చెందుతుందని కొందరు కోర్టును ఆశ్రయించారు.

**కాపాడటానికి అవకాశం: భాస్కర్, దేవాదాయశాఖ సహాయ కమిషనర్, ఉమ్మడి నల్గొండ**ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్న ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌కు సంబంధించి జీవో వస్తే ఆక్రమణలో, వివాదాల్లో ఉన్న భూ సమస్యలకు తొందరగా పరిష్కారం లభిస్తుంది. రెవెన్యూ, పోలీస్‌శాఖ సహకారంతో వాటిని స్వాధీనం చేసుకునే వీలుంటుంది. వారి సమన్వయంతోనే రికార్డుల ఆధారంగా భూములకు హద్దులను నిర్ణయించి, బోర్డులు ఏర్పాటు చేసి ఆక్రమణలు జరగకుండా కాపాడడానికి అవకాశం ఉంటుంది.

# రోడ్డే యమపాశం.. ఏన్నాళ్లీ శాపం!

ఎల్లారెడ్డిపేట : కామారెడ్డి- కరీంనగర్ రాష్ట్రీయ ప్రధాన రహదారి-11లో ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. బోయినపల్లి మండలం నర్సింగాపూర్ స్టేజీ నుంచి గంభీరావుపేట మండలం పెద్దమ్మ స్టేజీ వరకు దాదాపుగా 72 కిలోమీటర్ల మేర ఈ ఆర్అండ్‌బీ నాలుగు వరుసల రహదారి విస్తరించి ఉంది. ఎక్కడో ఓ చోట మరణాలు, క్షతగాత్రులుగా మారడం పరిపాటిగా మారుతుండటం ఆందోళన కలిగిస్తోంది. బోయినపల్లి మండలంలోని వెంకట్రావుపల్లి- కొదురుపాక చౌరస్తా, వారధి ప్రాంతాలు ప్రమాదానికి నెలవుగా మారాయి. బ్రిడ్జిపై అతివేగంతో వాహనాలు వెళ్తుండటం.. వీధి దీపాలు లేక రాత్రిపూట ఇబ్బందిగా మారుతోంది. మరోవైపు అనుపురం-ఆరేపల్లి మధ్యలో 8 కిలోమీటర్ల మేర రోడ్డు రెండు వరుసలకే పరిమితమైంది. విస్తరణకు ప్రతిపాదనలు పంపించినప్పటికీ నిధులు మంజూరు కావడం లేదు.

.ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ వద్ద రగుడు బైపాస్‌కు మళ్లే చోట వాహనాలు ప్రమాదానికి గురవుతున్నాయి. రగుడు బైపాస్ నుంచి వస్తూ కామారెడ్డి- కరీంనగర్ ప్రధాన రహదారికి మళ్లే సమయంలో ఓ కారు అదుపుతప్పింది. ఎదురుగా ఉండే ఇంట్లోకి దూసుకెళ్లగా



గోడ, తలుపులు కూలిపోయాయి. ఆ సమయంలో ఎవరూ లేకపోవడం వల్ల ప్రాణాపాయం తప్పినట్లయింది.

3. ఎల్లారెడ్డిపేట నుంచి రాచర్ల గొల్లపల్లి బస్టాండు వరకు ఉన్న నాలుగు వరుసల రోడ్డు, యూటర్న్‌ల వద్ద ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. 4.4 కిలోమీటర్లు, 22 యూటర్న్(మలుపు)లు ఉండే ఈ రోడ్డులో 2020 నుంచి ఇప్పటి వరకు 14 మంది మృత్యుఒడికి చేరగా 28 మంది గాయపడటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

4. గంభీరావుపేట మండలం గోరింటాల నుంచి పెద్దమ్మ స్టేజీ వరకు ఘాట్‌రోడ్డును తలపిస్తోంది. అందులోనూ మూడునాలుగు మలుపులున్నాయి. వాహనాల వేగం నియంత్రణ కావడం లేదు. కార్లు, లారీలు, ఆర్టీసీ బస్సులు ఢీకొనడం వల్ల పలువురు ద్విచక్రవాహనదారులు మృతిచెందడం ఆందోళన కలిగిస్తోంది.

జిల్లాలో 2025 జనవరి నుంచి ఇప్పటి వరకు..

మొత్తం రోడ్డు ప్రమాదాలు : 256

క్షతగాత్రులు : 291

మరణాలు : 67

## ఆశ పుట్టించి.. అక్రమాలు సృష్టించి

హైదరాబాద్: హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల పరిధిలో సంతాన సాఫల్య కేంద్రాల గుట్టురట్టు అవుతోంది. సృష్టి కేంద్రం దందా బయట పడిన తర్వాత వీటిపై వైద్య ఆరోగ్యశాఖ నిఘా పెట్టిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో మొత్తం 50 కేంద్రాలకు నోటీసులు ఇవ్వగా...వాటిలో అధిక శాతం గ్రేటర్‌లోనివే కావడం గమనార్హం. సంతానం కోసం వచ్చే దంపతుల బలహీనతను ఆసరా చేసుకొని ధనార్జనే ధ్యేయంగా కేంద్రాలు నడుపుతున్నారు. ఇప్పటి వరకు 12 కేంద్రాలను మూసేయగా...వాటిలో సగానికిపైగా ఇక్కడే ఉన్నాయి.

**ప్రధానంగా గుర్తించిన లోపాలు...**

ఒక డాక్టర్ పేరుతో అనుమతి పొంది.. ఇతరులు కేంద్రాలను నడుపుతున్నారు వైద్య సేవల ధరల పట్టిక...వైద్యుల జాబితాను



ప్రదర్శించడం లేదుకేంద్రాలకు అనుమతి గడువు తీరినా ...పునరుద్ధరించుకోక పోవడం

లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం

ఒక కేంద్రానికి అనుమతి తీసుకొని అదే పేరుతో ఇతర ప్రాంతాల్లో నడపడం. అమలుకు నోచని మార్గదర్శకాలు

ఈ కేంద్రాల్లో తరచూ అక్రమాలు బయట పడుతున్నా నామమాత్రంగా చర్యలు మినహా.. నిరంతర నిఘా ఉండటం లేదనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. అనుమతులు, నిర్వహణకు స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నా అమలు కావడం లేదు. నెలవారీ మామూళ్లు తీసుకుని.. కొందరు అధికారులు చూసీచూడనట్లు ఉండటం, మరోవైపు రాజకీయ పైరవీలూ ఇందుకు కారణంగా తెలుస్తోంది.

## రూ.4,700 కోట్లతో మురుగునీటి వ్యవస్థ

హైదరాబాద్: రాజధానిని మురుగు రహిత నగరంగా మార్చడంతో పాటు మూసీలో డ్రైనేజీ కలవకుండా జలమండలి భారీ ప్రాజెక్టుకు శ్రీకారం చుడుతోంది. ఒక చుక్క మురుగు కూడా నదిలో కలవకుండా రూ.4700 కోట్లతో ప్రాజెక్టును ప్రతిపాదించింది. దీంతోపాటు నగరంలోని పలు ప్రాంతాల్లో మురుగునీటి వ్యవస్థను అనుసంధానం చేయనున్నారు. జలమండలిలో విలీనమైన కొత్త ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ కేవలం 20 శాతం మాత్రమే ఉంది. ఉన్నవాటిలోనూ అత్యధికం ఓపెన్ నాలాలు కాగా మురుగు సమీపంలోని చెరువుల్లోకి చేరేలా ఉంది. ఈ నేపథ్యంలో సీవరేజీ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయనున్నారు. నార్సింగి, బాపూఘాట్, హైదర్‌షాకోట్, అత్తాపూర్, అంబర్‌పేట, నాగోల్, నల్లచెరువు, పీర్జాదిగూడ, కొర్రెముల, గౌరెల్లి వరకు మూసీకి ఉత్తర, దక్షిణం వైపు సీవరేజీ నెట్‌వర్క్ ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే నగరంలో మురుగు శుద్ధికి ఎస్టీపీల నిర్మాణం చేపడుతోంది. ఈ ప్రాజెక్ట్ కోసం ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) రుణం కోసం జలమండలి ప్రయత్నిస్తోంది. పూర్తి వ్యయంలో 70 శాతం అంటే రూ.3,290 కోట్లను రుణం తీసుకోవడానికి ప్రతిపాదించగా మిగిలిన 30 శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వ వాటాగా జలమండలి పేర్కొంది.

అభివృద్ధి చేసే మురుగునీటి వ్యవస్థ: 1,837 కి.మీ.

ప్రాజెక్ట్ వ్యయం అంచనా: రూ.4,700 (రూ.కోట్లలో)

ఏడీబీ రుణం (70 శాతం) : రూ.3,290

రాష్ట్ర ప్రభుత్వ వాటా (30శాతం): రూ.1,410

# మా రిజర్వేషన్ ఏమవుతుందో?



కరీంనగర్: మా ఊరి సర్పంచి రిజర్వేషన్ ఏది ఖరారవుతుందోననే ఉత్కంఠ గ్రామాల్లో నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ ఎన్నికల దిశగా ఏర్పాట్లు చేస్తుండటంతో పాత రిజర్వేషన్ల విధానానికి యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఈ నెలాఖరు లోపు షెడ్యూల్ వెలువడుతుందనే ప్రచారం వినిపిస్తున్న తరుణంలో అధికారులు కూడా 2019 పంచాయతీ ఎన్నికల్లో అమలు చేసిన రిజర్వేషన్ ప్రకారమే 50 శాతాన్ని మించకుండా ప్రక్రియను కొనసాగించనున్నారు. ఇటీవల నిర్వహించిన దృశ్య సమీక్షల్లోనూ రాష్ట్ర ఎన్నికల సంఘం కలెక్టర్లకు ఈ విషయంలో స్పష్టత ఇచ్చింది. అయితే బీసీ డెడికేటెడ్ కమిషన్ నివేదిక ఆధారంగా రిజర్వేషన్లను ఖరారు చేయాలని చెప్పడంతో ఈ సారి సంఖ్యలో నాలుగు జిల్లాల్లో మార్పు కనిపించనుంది. దీంతో పోటీ చేయాలనుకున్న ఆశావహులంతా అధికారిక ప్రకటన కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు.

1210 సర్పంచి స్థానాల్లో 1160 స్థానాల కోసం 2011 జనాభా ప్రకారం కేటాయించారు. 50 పంచాయతీల్లో పూర్తిగా ఎస్టీ జనాభా ఉండటంతో వారికే రిజర్వేషన్ ఖరారు చేశారు. అప్పట్లో బీసీలకు 24 శాతం, 48 శాతం అన్ రిజర్వ్‌డ్ (యూఆర్) స్థానాలుగా నిర్ణయించారు. సిరిసిల్ల (25), జగిత్యాల (21), పెద్దపల్లి (3), కరీంనగర్ జిల్లాలో ఒకటి గిరిజన పంచాయతీలు.

**ఈ సారి మార్పు..**

ఉమ్మడి జిల్లాలో పంచాయతీలు 16 పెరిగాయి. ప్రస్తుతం 1226 చోట్ల ఎన్నికలుంటాయి. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల విషయంలో ఒకటి రెండు స్థానాల్లో మహిళల రిజర్వేషన్లు మారుతాయి. ఈ నెల 24 నాటికి రిజర్వేషన్లు ఖరారు చేసే దిశగా జిల్లాల యంత్రాంగం కసరత్తు చేస్తోంది. గత నెలలో ప్రకటించిన రిజర్వేషన్లలో బీసీ స్థానాల్లో చాలా వరకు అన్ రిజర్వ్‌డ్ అవనున్నాయి.

# సమీకృత మార్కెట్ పనులపై విజిలెన్స్



కరీంనగర్ : కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని కిసాన్‌నగర్ సమీకృత మార్కెట్ అభివృద్ధి పనులపై విజిలెన్స్ విచారణకు సిఫారసు చేయడంతోపాటు బిల్లును నిలిపి వేశారు. కొలతల పుస్తకం(ఎంబీ) మాయంపై కొద్ది నెలలుగా ఫిర్యాదులు రావడంతో బల్దియా కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ విచారణకు ఆదేశించారు. దీనిపై నగరపాలికలోని ఎస్ఈకి విచారణ బాధ్యతలు అప్పగించగా ఎట్టకేలకు ఎస్ఈ రాజ్‌కుమార్ ఈ నెల 11న నివేదిక ఇచ్చారు. మూడు నెలల కిందట ఏఈ గఫూర్‌ను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. కాగా సమీకృత మార్కెట్ కొలతల పుస్తకం మాయంతోపాటు అక్రమాలు జరిగాయనిలో వరుస కథనాలు వచ్చాయి.

**దొరకని ఎంబీ పుస్తకం!**

కిసాన్‌నగర్‌లోని వ్యవసాయ మార్కెట్‌లో రూ.5.80 కోట్లతో అంచనాలు తయారు చేసి మూడేళ్ల కిందట సమీకృత మార్కెట్ నిర్మించేందుకు పనులు ప్రారంభించారు. అంచనాలకు మించి బిల్లులు రికార్డు చేసి నిధుల దుర్వినియోగంతోపాటు అక్రమాలు జరిగాయని మాజీ కార్పొరేటర్లు బండారి వేణు, మెండి చంద్రశేఖర్ కమిషనర్, కలెక్టర్‌కు, రాష్ట్రస్థాయి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇదంతా బయటకు రాకుండా ఉండేందుకు ఎంబీ మాయం చేయడం చర్చనీయాంశంగా మారింది. పనుల సమయంలో అడ్డగోలుగా రాక్ కటింగ్ చేశారని, నాలుగు ఇంచుల సీసీని ఒక ఫీట్‌గా చూపించారని, స్టీల్ డిజైన్‌లో 12 మి.మీ.వాడి దాన్ని 16 మి.మీగా నమోదు చేశారని ఆ ఫిర్యాదులో వివరించారు. ఈ నేపథ్యంలో పూర్తి స్థాయిలో సమాచారం తెలుసుకునేలా విజిలెన్స్ విచారణకు కమిషనర్ ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం.

**అంతర్గత విచారణలో తీసుకున్న నిర్ణయాలు**

మొదటి దశలో పనులు నమోదు చేసిన ఎంబీ నం.152/ఎంసీకే/2021-22 కనిపించకుండా పోయిందని గుర్తించడం.


లతల పుస్తకం ఎక్కడుందో కనుక్కోవడానికి పూర్తి స్థాయి విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవడం.

కొలతల పుస్తకంలో వివరాలు ధ్రువీకరించే వరకు ఆ పనికి సంబంధించిన రూ.87,78,242 బిల్లు తాత్కాలికంగా నిలిపివేయడం.

భవిష్యత్తులో ఎంబీలు, రికార్డులు, బిల్లులువంటి విలువైన దస్త్రాలు సురక్షితంగా ఉండేలా సూచనలు.

ఈ పనిపై పూర్తి విచారణ చేసేందుకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు సిఫారసు చేయడం.

# 'ఆక్ర'ముంచేస్తున్నారు!



సిరిసిల్ల : తాగు, సాగునీటి సరఫరాలో మధ్యమానేరు ప్రధాన జలాశయం. వినియోగంలోకి వచ్చి ఎనిమిదేళ్లే అవుతున్నా.. అప్పుడే చుట్టూ ఆక్రమణల పర్వం మొదలైంది. ఇప్పటికే చాలాచోట్ల బఫర్‌జోన్ దాటి ఎఫ్‌టీఎల్‌లోకి వచ్చారు. ఈ నెల 13న జలాశయం పూర్తి సామర్థ్యం 27.55 టీఎంసీలకు చేరడంతో ఎఫ్‌టీఎల్‌లోని పంట పొలాలు పూర్తిగా నీట మునిగాయి. 2017 నుంచి నీటిని నిల్వచేయడం ప్రారంభమైంది. 2022లో ఒకసారి, ఈ ఏడాది మరోసారి రెండుసార్లు మాత్రమే ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో నీటిని నింపారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల హద్దులు ఏర్పాటు చేయక ఆక్రమణలు పెరిగిపోయినా నీటిపారుదల, రెవెన్యూ అధికారులెవరూ పట్టించుకోవడం లేదు.

ఎఫ్‌టీఎల్‌లో ఆక్రమణలను జలాశయం ఈఈ జగన్ దృష్టికి 'ఈనాడు' తీసుకెళ్లింది. "ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల పరిధిలో పంటలు సాగు చేయవద్దు. త్వరలోనే రెవెన్యూ అధికారులతో కలిసి హద్దులు నిర్ణయిస్తాం. గ్రామాల్లో జలాశయం ఎంతవరకు ఉందనే సూచికలు కూడా ఏర్పాటు చేస్తా"మని వెల్లడించారు.

రాజన్నపేట శివారులో గ్రానైట్ క్వారీలోకి నీరు రాకుండా జలాశయం లోనే మట్టితో అడ్డుకట్ట వేశారు. దీనికి రాళ్లతో తెట్టును నిర్మించారు. దీని ప్రభావంతో సమీపంలోని వరదవెల్లి, రత్నంపేట, రెడ్డిపురం గ్రామాలకు చెందిన వ్యవసాయ భూములు ముంపునకు గురవుతాయని అటువైపు వారు అడ్డుకట్టలు కట్టారు.

**ఇదీ సంగతి**

జలాశయం నిర్మాణానికి 12 గ్రామాల పరిధిలో ప్రైవేటు, ప్రభుత్వ, అసైన్డ్ భూములను సేకరించారు. పనులు పూర్తయ్యాక ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల హద్దులు నిర్ణయించాలి. నిబంధనల ప్రకారం జలాశయం ఎఫ్‌టీఎల్‌పై వంద మీటర్ల మేరకు బఫర్‌జోన్ ఉంటుంది. పొలాలు, క్వారీలేవీ ఉన్నా పరిధి దాటి లోపలికి రాకూడదు. చదును చేయడం, వ్యర్థాలతో నింపడం వట్టివి చేస్తే ఆక్రమణల కింద చర్యలు తీసుకునే అవకాశాలుంటాయి.

ఇల్లంతకుంట మండలం వల్లంపట్లలో జలాశయం కుడివైపు 2021లో అదనపు అదనపు టీఎంసీ పనులు ప్రారంభమయ్యాయి. కాల్వతవ్వకాలకే భూసేకరణ జరిగింది. తవ్విన మట్టిని పక్కన పోసేందుకు పక్కనున్న రైతులు భూములు ఇవ్వలేదు. దీంతో లక్షలాది క్యూబిక్ మీటర్ల మట్టిని జలాశయంలో నింపి చదును చేశారు. ఇక్కడే క్యాంపు కార్యాలయం నిర్మించారు. దీనిపై అధికారుల పర్యవేక్షణ కరవైంది. ఇదే అదనుగా చుట్టూ తరచూ ఆక్రమణలు జరుగుతున్నాయి. జలాశయం వెనుకజలాల ప్రాంతాలైన తంగళ్లపల్లి, వేములవాడ గ్రామీణం, బోయినపల్లి మండలాల్లో చీర్లవంచ, చింత్‌ఠాణా, అనుపురం, సంకెపల్లిలో ఎఫ్‌టీఎల్‌లో చదునుచేసి పంటలు సాగు చేస్తున్నారు.

# మెరుగైన వైద్యం.. బీమా పథకం

గోదావరిఖని : ఒప్పంద కార్మికులకు మెరుగైన వైద్య సేవలతో పాటు బీమా సౌకర్యం ఉన్న ఈఎస్ఐ సేవలను అమలు చేసేందుకు చర్యలు తీసుకొంటున్నారు. ఈ విషయమై సింగరేణి అధికారులతో పాటు గుత్తేదారులకు అవగాహన కల్పిస్తున్నారు. రామగుండం రీజియన్‌లోని ఆర్జీ-1, 2, 3 డివిజన్లలో పనిచేసే కాంట్రాక్టు కార్మికులను సభ్యులుగా చేర్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

**16 వేల మంది కార్మికులు**

రామగుండం రీజియన్‌లో 16 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. మైనింగేతర విభాగాల్లో పనిచేసే ఒప్పంద కార్మికులకు ఇది వర్తించనుంది. సివిల్, అటవీ, భద్రత, అన్వేషణ, పారిశుద్ధ్య విభాగాల్లో పనిచేసే ఒప్పంద కార్మికులకు ఈఎస్ఐ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టింది. ఏదైనా ప్రమాదానికి గురైన సమయంలో బీమా సౌకర్యంతో పాటు వైద్య సేవలు అందనున్నాయి.



కార్మికులతో పాటు వారి కుటుంబ సభ్యులకు వైద్య సేవలు వర్తింపజేస్తారు. రూ.21 వేల లోపు వేతనాలు పొందే ప్రతి కార్మికునికి ఈఎస్ఐని వర్తింపజేసేందుకు చర్యలు తీసుకొంటున్నారు. పదిమంది కంటే ఎక్కువ మంది పనిచేసే గుత్తేదారు నుంచి ఈఎస్ఐ సభ్యులను చేర్చుకొంటారు. అంత కంటే తక్కువ మంది పనిచేస్తే వర్తింపజేయరు.

**నమోదు ప్రక్రియపై దృష్టి**

కాంట్రాక్టు కార్మికులకు ఈఎస్ఐ సేవలు వర్తింపజేసేందుకు వివరాలు నమోదు చేసే ప్రక్రియపై దృష్టి సారించారు. ప్రస్తుతం గుత్తేదారుకు సంబంధించిన 3.75 శాతాన్ని యాజమాన్యం భరించేందుకు ముందుకు వచ్చింది. దీంతో ఒప్పంద కార్మికుల వివరాలు ఎలాంటి ఇబ్బంది లేకుండా నమోదు చేసే అవకాశం ఏర్పడింది. కార్మికునికి ఐడీతో పాటు ఆధార్ నంబరు, సీఎస్సీ చెల్లింపులు, రెండు పాసుపోర్టు సైజు ఫొటోలు, సెల్‌ఫోన్ నంబరు, ఈమెయిల్ ఐడీ, వ్యక్తిగత, కుటుంబ సభ్యుల ఆధార్‌కార్డులు నమోదు చేయాల్సి ఉంది. వేతన వివరాలు కూడా అందులో నమోదు చేయాలి. వీటిని పూర్తి చేసేందుకు యాజమాన్యం చర్యలు చేపట్టింది.

# రిజర్వేషన్ల కసరత్తు

ఖమ్మం : గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు దశల్లో నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించిన నేపథ్యంలో ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల అధికార యంత్రాంగం ఆ ఏర్పాట్లలో నిమగ్నమైంది. అందులో భాగంగా సర్పంచి, వార్డు సభ్యుల రిజర్వేషన్ల ఖరారుకు శుక్రవారం జిల్లా అధికారులు కసరత్తు చేశారు. ఖమ్మం జడ్పీ కార్యాలయంలో, భద్రాద్రి జిల్లాకేంద్రంలో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం వరకు కుస్తీపట్టారు. సర్పంచుల రిజర్వేషన్లను ఆర్డీవో, వార్డుల రిజర్వేషన్లను ఎంపీడీఓలు ఖరారు చేయాల్సి ఉంటుంది.

**ఆ రెండు రిజర్వేషన్లపై..** ప్రస్తుత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గతంలో మాదిరిగా 50 శాతం రిజర్వేషన్లతో ఎన్నికలు జరిగే అవకాశం ఉండటంతో ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ లెక్కన 50శాతం స్థానాలు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పోను మిగిలిన 50 శాతం జనరల్ కేటగిరీ స్థానాలుంటాయి. అన్నిట్లో సగం స్థానాలను మహిళలకు రిజర్వ్ చేయాల్సి ఉంది. ఎస్టీ, ఎస్టీ రిజర్వేషన్లను 2011 జనాభా ప్రాతిపదికన ఖరారు చేయాలి. గత నెల అక్టోబరులో నోటిఫికేషన్ ఇవ్వడానికి సన్నద్ధమైన తరుణంలోనే సెప్టెంబరు నెలాఖరులో ఈ రిజర్వేషన్లను ఖరారు చేశారు. గిరిజన గ్రామాలను ఎస్టీలకు రిజర్వ్ చేశారు. వాటిల్లో ఎలాంటి మార్పులు లేనట్లు తెలుస్తోంది. ఎన్నికల సంఘం ఆదేశాలు, సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వే(ఎస్ఈఈఈపీసీ) 2024 ప్రకారం డెడికేటెడ్ కమిషన్ ఇచ్చే నివేదిక ఆధారంగా బీసీ, జనరల్ రిజర్వేషన్లపై శుక్రవారం కసరత్తు జరిపినట్లు సమాచారం.

**నేడు తేలనున్న లెక్క**

ఖమ్మం జిల్లాలోని 571 పంచాయతీలు, 5,214 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించాలి. ఖమ్మం, కల్లూరు రెవెన్యూ డివిజన్ కార్యాలయం పరిధిలోని సర్పంచి స్థానాలకు ఆయా ఆర్డీవోలు రిజర్వేషన్లు కేటాయించగా.. వీటిని డీఆర్డీవో, అదనపు డీఆర్డీవో, డీఎల్‌పీవో, కల్లూరు ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ పర్యవేక్షించినట్లు తెలిసింది. వార్డు స్థానాలకు ఎంపీడీవోలు రిజర్వేషన్లు కేటాయించగా.. జడ్పీ సీఈవో, డిప్యూటీ సీఈవో, డీపీవో, డీఎల్పీవోలు పర్యవేక్షించినట్లు సమాచారం. శనివారం రాజకీయ నాయకుల సమక్షంలో డ్రా పద్ధతిలో మహిళలకు ఆయా స్థానాలను రిజర్వ్ చేయనున్నారు. అదే రోజు మిగిలిన రిజర్వేషన్లను ప్రక్రియనూ పూర్తి చేసి ఆయా ప్రతులపై సంతకాలు చేసి డీపీవోకు అందిస్తారు. వీటిని కలెక్టర్ పునఃపరిశీలించి ఎన్నికల షెడ్యూల్ బట్టి అధికారికంగా గెజిట్ విడుదల చేస్తారు.

**భద్రాద్రిలో 15 పంచాయతీల్లోనే..**

భద్రాద్రి జిల్లాలో 471 గ్రామ పంచాయతీలున్నాయి. వీటిల్లో 456 గిరిజన గ్రామాలే. ఇందులో సర్పంచి, వార్డు సభ్యుల స్థానాలను ఎస్టీలకు రిజర్వ్ చేస్తారు. మిగిలిన 15 పంచాయతీలను ఎస్టీ, ఎస్సీ, బీసీ, జనరల్‌కు రిజర్వ్ చేయాల్సి ఉంది. వీటిల్లో ఎస్సీ, ఎస్టీలకు కేటాయించినవి పోను మిగిలిన కేటాయింపునకు జిల్లా అధికారులు డెడికేటెడ్ కమిషన్ నివేదిక ఆధారంగా కసరత్తు చేస్తున్నారు.

# చెత్త గుట్టలు.. నోట్ల కట్టలు

ఖమ్మం : ఖమ్మం నగరపాలక సిబ్బందికి ప్రజాధనం అంటే లెక్కే ఉండటం లేదు. తమ కళ్లముందే రోజుకు రూ.వేలు చెత్త పాలవుతున్నా చేష్టలుడిగి చూస్తున్నారంటే ఆశ్చర్యపోక తప్పదు. దీని వెనక మతలబు ఏంటా అన్న అనుమానం రాకా మానదు. డంపింగ్ యార్డులో ఇష్టారీతిగా చెత్త వేయటం ఓ లోపమైతే, వేస్తున్నా పట్టించుకోకపోవటం మరో సమస్య. ఈ రెండు తప్పిదాల ఫలితంగా నెల రోజుల వ్యవధిలో యాంత్రిక పని పేరుతో రూ.లక్షలు వృథా చేశారంటే నమ్మితీరాల్సిందే.. విషయం ఏంటంటే ఈ లోపాలన్నీ ఒకదాని వెంట మరోటి దడికట్టినట్టు, పద్ధతి ప్రకారం సాగుతున్నా ఉన్నతాధికారులకు అనుమానం రావటం లేదు.

తప్పు మీద తప్పు..సిబ్బంది నిర్లక్ష్యంతో పోగైన చెత్తను తొలగించటానికి నెల రోజుల క్రితం మరో మహత్కార్యానికి బల్దియా అధికారులు శ్రీకారం చుట్టారు. గంటకు రూ.2వేలు ఇస్తూ చైన్ యంత్రం సాయంతో చెత్తను రోడ్డుకు ఇరువైపులా పోయిస్తున్నారు. యంత్రం చెత్తను తొలగించి దారి చూయించగానే వెనకనుంచి వచ్చే వాహనాలు మళ్లీ పోసి పోతున్నాయి. రెగ్యులర్, పొరుగు సేవల సిబ్బంది వచ్చే ప్రతి వాహనాన్ని లోపలిదాకా పంపించాల్సి ఉన్నా పట్టించుకోవటం లేదు. అనుమానాలకు తావిస్తూ.. గంటకు రూ.2 వేలు చెల్లించి తీసుకొచ్చిన యంత్రం రోజుకు ఐదు నుంచి ఆరు గంటలు పనిచేసి నిష్క్రమిస్తోంది. నెల రోజులుగా రోజుకు రూ.10-16 వేల వరకు నగరపాలక సంస్థ చెల్లిస్తోంది. ఆ వాహనం వాహనాలు లోపలకు వెళ్లే దారి ఏర్పాటు చేసుకోకుండా ఒకే ప్రాంతంలో చెత్తను సర్దుబాటు చేయడమూ అనుమానాలకు తావిస్తోంది. యార్డు చివరి ప్రాంతంలో ఖాళీ స్థలం ఉన్నా వాహనాలు దారి లేదన్న సాకుతో ప్రారంభంలోనే చెత్త పోయడం, దాన్ని డబ్బులతో తొలగించటం అన్నీ క్రమపద్ధతిలో సాగటంపైనా గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇదీ విషయంఖమ్మం నగరంలో నిత్యం 180 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుంది. ఇందులో 160 టన్నుల మెట్రిక్ టన్నులు దానవాయిగూడెంలోని డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. చెత్త ట్రాక్టర్లు, వ్యాన్లు రోడ్డుకు అడ్డంగా చెత్త పోయెుద్దు. అవి లోనికి ప్రవేశించగానే ముగ్గురు పర్యవేక్షక సిబ్బంది వాటి నంబర్లు రాసుకుని చెత్తను ఎక్కడ పోయాలో మార్గనిర్దేశం చేయాలి. కానీ అవేం పట్టించుకోకపోవటంతో వాహనాలు ఇష్టారీతిగా రోడ్డుకు అడ్డంగా పోసివెళ్తున్నాయి.

చురకలు

బుధవారం 26 నవంబర్ 2025

## వరిని కాపాడుకుందామిలా!


మెదక్ : ప్రస్తుత యాసంగిలో ఉమ్మడి మెదక్ జిల్లాలో వరి 8,11,103 ఎకరాల్లో, వికారాబాద్ జిల్లాలో 1,31,000 ఎకరాల్లో సాగవుతోంది. మొంథా తుపానుతో వరి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ సందర్భంగా రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ టి.రాజేశ్వర్‌రెడ్డి, సిద్దిపేట జిల్లా వ్యవసాయ అధికారిణి స్వరూపరాణి పలు సూచనలు చేశారు. రోజంతా కలియ నేర్పుతూ రాత్రిపూట టార్పాలిన్ కవర్లు కప్పాలి. ఎండలో ఆరబోసి తేమ 17 శాతానికి రాగానే కొనుగోలు కేంద్రాలకు



తరలించాలి.తేమ అధికంగా ఉంటే అనుకూల వాతావరణంలో ఆరబోయాలి.వర్షం పడుతుంటే వరి కోతలు కోయవద్దు. నూర్పిడి చేసిన ధాన్యాన్ని తడి బస్తాల్లో నింపొద్దు.గాలి, వెలుతురు వచ్చే ఎత్తయిన ప్రదేశంలో టార్పాలిన్ కవర్లు పరిచి ఆరబోయాలి.పొలాన్ని పూర్తిగా ఆరబెట్టుకోవాలి. లేదంటే నూర్పిడి సమయంలో ఇబ్బంది ఎదురవుతుంది.కోతకు సిద్ధంగా ఉంటే లీటరు నీటిలో ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలి.ప్రస్తుతం కొన్ని చోట్ల పైరు గింజపట్టే దశలో ఉంది. మరికొన్ని చోట్ల కోతకు సిద్ధంగా ఉంది. అధిక వర్షాల బారి నుంచి రక్షించుకునేందుకు దుబ్బులను పైకి ఎత్తి కట్టుకోవాలి. ధాన్యం తడిసి రంగుమారకుండా ఉండేందుకు పూర్తిగా పట్టాలతో కప్పి ఉంచాలి.

## పౌరుల భద్రత.. బల్దియా బాధ్యత

హైదరాబాద్: ప్రతి సహాయ ఇంజినీరు రోజూ డివిజన్‌లో పర్యటించాలంటూ ఇంజినీర్లకు జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ కొత్త బాధ్యత అప్పగించారు. రోడ్లపై గుంతలు, మ్యాన్‌హోళ్ల మూతలు పగిలి పోవడం, కాలిబాటలపై అడ్డంకులు, ఇతరత్రా సమస్యలను స్వయంగా గుర్తించి.. ఆన్‌లైన్‌లో రికార్డు చేయాలని ఆదేశించారు. ఆ మేరకు బల్దియా ఐటీ విభాగం 'పబ్లిక్ సేఫ్టీ' పేరుతో మొబైల్‌యాప్‌ను నెలక్రితం అందుబాటులోకి తీసుకొచ్చింది. నగరవాసుల భద్రతే లక్ష్యంగా.. ఇంజినీర్లు రోజూ డివిజన్లలో తిరుగుతూ సమస్యలను గుర్తించడం, వాటిని 24గంటల్లో పరిష్కరించడం ప్రారంభమైంది. దశలవారీగా.. యాప్‌ను మరిన్ని సమస్యల పరిష్కారానికి ఉపయోగిస్తామని జీహెచ్ఎంసీ స్పష్టం చేస్తోంది.




**మొబైల్ యాప్ ప్రత్యేకత..**

ప్రతి డివిజన్‌లో ఓ సహాయ ఇంజినీరు బాధ్యులుగా ఉంటారు. రోడ్లపై గుంతలు, పగిలిన మ్యాన్‌హోల్ మూతలు, కాలిబాటలపై అడ్డంకులు, ఇతరత్రా సమస్యలను గుర్తించి ఫొటోలను అప్‌లోడ్ చేయాలి ఇంజినీర్లు అప్‌లోడ్ చేసే ఫొటోలు, సమస్యలను ఐటీ విభాగం అదనపు కమిషనర్ అనురాగ్ జయంతి, ఉన్నతాధికారులు డ్యాష్‌బోర్డులో నిత్యం పరిశీలిస్తుంటారు. గూగుల్ పటంపై ఆయా సమస్యలు ఎరుపు రంగులో కనిపిస్తుంటాయి. పరిష్కారం చూపాక.. ఇంజినీర్లు మళ్లీ ఫొటోను అప్‌లోడ్ చేయగా.. ఆకుపచ్చరంగులోకి మారుతుంది. జీఐఎస్ మ్యాపింగ్ సాంకేతికతతో పనిచేసే పబ్లిక్ సేఫ్టీ యాప్ సేవలను మరింత విస్తరిస్తామని అనురాగ్ జయంతి తెలిపారు.

ఇప్పటివరకు.. గుర్తించినవి
బారికేడ్లు లేకపోవడం 14
ఓపెన్ మ్యాన్‌హోళ్లు 263
ఇతర..75
ధ్వంసమైన మ్యాన్‌హోళ్లు 23
మూతలేని ఎలక్ట్రికల్ జంక్షన్ బాక్సులు 10
మొత్తం.. 1,818
పరిష్కరించినవి 907

## పల్లెల్లో.. కాలుష్యం మరకలు

నల్గొండ: ప్రమాదకర వ్యర్థాలను పారబోస్తూ.. పచ్చటి పల్లె సీమలను కాలుష్యమయంగా మారుస్తున్నాయి పరిశ్రమలు.. హైదరాబాద్ పారిశ్రామిక వాడల నుంచి తీసుకొచ్చి జిల్లాలోని మూరుమూల గ్రామాల్లో పోస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నా.. అధికారుల నిఘా కొరవడింది.

మోటకొండూరు, వలిగొండ, అడ్డగూడూరు, బీబీనగర్, చౌటుప్పల్, పోచంపల్లి, భువనగిరి మండలాల్లోని పలు గ్రామాల్లో కాలుష్య వ్యర్థాలను ఇష్టానుసారంగా వేస్తున్నారు. కొందరు రాత్రి పూట రసాయన వ్యర్థాల ద్రావణాలను ట్యాంకర్ల ద్వారా తెచ్చి బీబీనగర్, భువనగిరి చెరువులు, చౌటుప్పల్ మండలాల్లో పలు గ్రామాల్లో పారబోసిన ఘటనలు గతంలో జరిగాయి.

గతంలో మోటకొండూరు మండలంలో వ్యర్థాల రసాయనాల డ్రమ్ములను గుర్తించి ప్రజలు ఫిర్యాదు చేయడంతో యాదగిరిగుట్ట పోలీసులు విచారణ జరిపి పట్టుకున్నారు.

భువనగిరి పట్టణ శివారులోని పరిశ్రమను లీజుకు తీసుకుని నడిపిస్తున్న ఓ ఫార్మా కంపెనీలోనూ ప్రమాదకర వ్యర్థాల నిల్వలను గుర్తించిన పట్టణ పోలీసులు ఆగస్టు 30న పీసీబీ అధికారుల దృష్టికి తెచ్చారు. విచారణ జరిపిన పీసీబీ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా ప్రమాదకర వ్యర్థాలు, రసాయనాలను నిల్వ చేసినందుకు ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని సదరు ఫార్మా యాజమాన్యానికి షోకాజ్ నోటీస్‌లు జారీ చేశారు.

పర్యావరణానికి హాని చేకూర్చే వ్యర్థాలు, రసాయనాలను బహిరంగ ప్రాంతాల్లో నిల్వచేయడం, పారబోసినందుకు ఎందుకు చర్యలు తీసుకోవద్దో సమాధానం ఇవ్వాలని షోకాజ్ నోటీసులో పేర్కొన్నారు. వలిగొండ–తొర్రూరు రహదారిలో, సదరు ఫార్మా కంపెనీలో ఉన్న వ్యర్థాలు ఒక్కటిగా గుర్తించారు. ఆ కంపెనీని రెండు రోజుల క్రితం సీజ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన పీసీబీ విద్యుత్తు సరఫరా నిలిపివేయాలని సంబంధిత అధికారులను కోరారు.

తాజాగా ఆగస్టు నెలలో వలిగొండ– తొర్రూరు రహదారిలో ఎనిమిది ప్రాంతాల్లో ఈ వ్యర్థాలను ప్రజలు గుర్తించారు. ఈ విషయమై అడ్డగూడూరు పోలీసులు ఆగస్టు 15న పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. వలిగొండ మండలం అరూరు, అడ్డగూడూరు మండలం కంచనపల్లి శివారులో ప్రమాదకర వ్యర్థాలను పడేశారు.

# రూపాయి రాకెంత.. పోకెంత?



తాండూరు: జిల్లాలోని గ్రామ పంచాయతీలకు మంజూరైన నిధులు, ఆదాయం, వివిధ పనులకు చేసిన వ్యయాలపై ఉన్నతాధికారులు లెక్కలు తీసే పనిలో నిమగ్నమయ్యారు. నిర్ణీత ఫార్మాట్‌లో వివరాలను పంపించాలని ప్రభుత్వం పంచాయతీరాజ్‌శాఖను ఆదేశించింది. అన్ని పంచాయతీల కార్యదర్శులు ఆ పనుల్లో నిమగ్నమయ్యారు. 2019 ఏప్రిల్ నుంచి 2025 మార్చి చివరకు సంబంధించిన ఆదాయ, వ్యయాలు, మంజూరైన నిధుల దస్త్రాలు పరిశీలించి వివరాలను నమోదు చేస్తున్నారు.

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులే ఎక్కువ**

ఆర్థిక సంవత్సరాల వారీగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రామ పంచాయతీలకు 2011 జనాభా ప్రాతిపదికన ప్రతి మూడు నెలలకు ఒకసారి కేంద్ర ప్రభుత్వం నుంచి, రెండు నెలలకోసారి రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరవుతాయి. ఈలెక్కన ఎక్కువ జనాభా ఉన్న పంచాయతీలకు రూ.లక్షల్లో మంజూరైతే తక్కువ జనాభా ఉన్న వాటికి రూ.వేలల్లోనే విడదలయ్యాయి. పంచాయతీలకు 2024 మార్చి నుంచి పాలక వర్గాలు లేవు. ప్రత్యేకాధికారుల పాలన సాగుతోంది. దీంతో నిధుల మంజూరులో స్తబ్ధత నెలకొంది. అందుబాటులో ఉన్న సాధారణ నిధులతోనే కార్యకలాపాలు కొనసాగిస్తూ వచ్చారు. అయితే చేసిన పనులకు వెచ్చించిన నిధులెన్ని అనే వివరాలను ఆరా తీస్తున్నారు.

**అంశాల వారీగా..**

గ్రామ పంచాయతీల్లో అమలయ్యే పదిహేను అంశాల వారీగా చేసిన ఖర్చు పద్దులకు సంబంధించి లెక్కలు అడుగుతున్నారు. సంతలు (త్రైబజార్‌లు), మార్కెట్లు, కార్యాలయం నిర్వహణ, మౌలిక వసతులు, వీధి దీపాలు, పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బంది వేతనాలు, సాంకేతిక నైపుణ్యం, దళిత, గిరిజన సంక్షేమం, చిన్నారులు, మహిళల భద్రత, కుటుంబ ఆరోగ్య సంరక్షణ, తాగునీటి వనరుల నిర్వహణ, పారిశుద్ధ్యం అంశాలున్నాయి.

గ్రామ పంచాయతీల్లో సంతల నిర్వహణకు ఏడాది కోసారి త్రైబజార్ వేలం వేస్తారు. నీటి శుద్ధి ప్లాంట్లు ఉంటే వాటి నిర్వహణకు వేలం వేస్తారు. వచ్చిన ఆదాయాన్ని దేని కోసం వ్యయం చేశారు? ఎంత చేశారు? వివరాలను వెల్లడించాల్సి ఉంటుంది.

మంజూరైన నిధులను ఏ పనికి ఎంత వ్యయం చేశారు. మిగిలిన డబ్బులు ఎన్ని? చేసిన పనికి డబ్బులు సరిపోక పోతే వేరొక పద్దు నుంచి ఎంత మేరకు తీసుకుని ఖర్చు చేశారు. అనే వివరాలను వెల్లడించాల్సి ఉంది.

ఇవీ వివరాలు
మండలాలు: 20
గ్రామ పంచాయతీలు: 594
వార్డులు: 5,058

**వివరాలు పంపించాలని ఆదేశించాం**

జిల్లాలోని అన్ని పంచాయతీ కార్యదర్శులను 2019 నుంచి 2025 వరకు నిధుల మంజూరు వ్యయాలకు సంబంధించిన వివరాలను పంపించాలని కార్యదర్శులను ఆదేశించాం. ఉన్నతాధికారులు ఆదేశించిన మేరకు పద్దుల వారీగా లెక్కలు అడుగుతున్నాం.జయసుధ, జిల్లా పంచాయతీ అధికారిణి

# బాబోయ్ పాములు!



పెద్దపల్లి :గ్రామాల్లో బీడు భూములు తగ్గిపోవడం, పంట పొలాల్లో క్రిమిసంహారక ముందుల వినియోగం పెరగడంతో పాముల సంఖ్య క్రమంగా తగ్గిపోతోంది. మిగిలినవి నివాస ప్రాంతాలవైపు ఆవాసాలను ఏర్పాటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో ఇంటి ఆవరణ, గడ్డివాములు, పశువుల షెడ్ల వద్ద పాముల సంచారం పెరగగా తరచూ గ్రామీణ ప్రజలు పాముకాటుకు గురవుతున్నారు. ఇటీవల జిల్లాలోని పలు విద్యాలయాల్లో కూడా పాముల సంచారం పెరిగింది. నెల రోజుల వ్యవధిలో జిల్లాలో పాముకాటు బాధితుల సంఖ్య గణనీయంగా పెరిగింది. వీరిలో కొంత మందికి సకాలంలో వైద్యం అందకపోవడంతో మృత్యువాతపడగా మరికొందరు ఆరోగ్యం కుదుటపడేందుకు రోజుల తరబడి చికిత్స పొందారు.

**గ్రామీణ ప్రాంతాల్లో ఇబ్బందులే..**

గ్రామీణ ప్రాంతాల్లో అత్యవసర వైద్య సేవలు అంతంతమాత్రంగానే అందుతున్నాయి. రాత్రి ఆరోగ్య కేంద్రాలు, పల్లె దవాఖానాలు సక్రమంగా పని చేయకపోవడం, ఆర్ఎంపీలు అత్యవసర సేవలకు దూరంగా ఉంటుండటం ప్రమాద తీవ్రతను పెంచుతున్నాయి. ఆసుపత్రికి తీసుకొచ్చే ముందు ప్రాథమిక వైద్యం అందించకపోవడంతో పలువురు మృత్యువాతపడుతున్నారు. కాగా జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పాముకాటు మందులు అందుబాటులో ఉన్నట్లు జిల్లా వైద్యాధికారి వాణిశ్రీ తెలిపారు.

ఇటీవల ఓదెల మండలం రూప్‌నారాయణపేట గ్రామానికి చెందిన గుర్రం అక్షిత అనే డిగ్రీ విద్యార్థిని తన ఇంటి ఆవరణలో పాముకాటుకు గురయ్యారు. సుల్తానాబాద్ ఆసుపత్రిలో సరైన చికిత్స అందకపోవడంతో కరీంనగర్‌కు తీసుకెళ్లే క్రమంలో మృత్యువాత పడ్డారు.

పెద్దపల్లి మండలం పెద్దకల్వల గ్రామానికి చెందిన బత్తుల సమ్మయ్య అనే యువకుడు పంట పొలం వద్ద పాముకాటుకు గురయ్యారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం హైదరాబాద్‌కు తరలించారు. వైద్యం కోసం రూ.2 లక్షల వరకు వెచ్చించగా అతికష్టం మీద కోలుకున్నారు.

# సర్వీసు రోడ్లే శరణ్యం



గోదావరిఖని : ఉమ్మడి జిల్లాలో గుండ్లపల్లి నుంచి గోదావరిఖని కోల్‌బెల్టు వంతెన వరకు ప్రధాన పట్టణాల మీదుగా రాజీవ్ రహదారి విస్తరించింది. రెండు నగరపాలక, మూడు పురపాలక సంస్థల పరిధిలో ఈ రహదారి ఉంది. జనసాంద్రత ఎక్కువగా ఉన్న రామగుండం, పెద్దపల్లి, సుల్తానాబాద్, కరీంనగర్, అల్గునూరు ప్రాంతాల్లో సర్వీసు రహదారులు తప్పనిసరి. అల్గునూరు, రామగుండం పట్టణాల్లో కొంత వరకు మాత్రమే సర్వీసు రోడ్లు నిర్మించారు. 11 ఏళ్లుగా వాహనాలకు టోలు వసూలు చేస్తున్నా సర్వీసు రోడ్లు నిర్మించడం లేదు. రాజీవ్ రహదారి విస్తరించి ఉన్న పట్టణ ప్రాంతాల్లో ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకొంటున్నాయి.

**బైపాస్ పేరుతో పక్కన**

పెద్దపల్లి పట్టణంలో బైపాస్ రహదారి కోసం ప్రణాళికలు చేశారు. పెద్దకల్వల నుంచి బందంపల్లి వరకు పట్టణ శివారు నుంచి బైపాస్ రహదారి నిర్మించాలని మార్కింగ్ కూడా చేశారు. ఇప్పటి వరకు దానిపై ఎలాంటి కదలిక లేదు. ఇటు బైపాస్ లేక.. అటు సర్వీసు రోడ్డు లేక పెద్దపల్లి పట్టణ ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. సుల్తానాబాద్ పట్టణంలో కూడా బైపాస్ రహదారికి ఆలోచన చేసినా ఎలాంటి కార్యాచరణ చేపట్టలేదు.

జిల్లా కేంద్రమైన పెద్దపల్లితో పాటు సుల్తానాబాద్ పట్టణాల్లో ఆరు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న రాజీవ్ రహదారికి ఇరువైపులా సర్వీసు రోడ్లు లేకపోవడంతో ప్రమాదాలు పెరుగుతున్నాయి. రామగుండం ప్రాంతంలో కొన్ని చోట్ల నిర్మించి మరి కొన్ని ప్రాంతాల్లో వదిలేశారు. ఇటీవల రూ.10 కోట్లు వెచ్చించి సర్వీసు రోడ్ల పూర్తికి చర్యలు చేపట్టారు. రామగుండంలో 10 కిలోమీటర్ల మేర పనులు చేపట్టేందుకు ప్రత్యేక నిధులు కేటాయించారు.

పెద్దపల్లి పట్టణంలో సుమారు 4 కిలోమీటర్ల మేర రాజీవ్ రహదారి విస్తరించి ఉంది. పట్టణంలో ఇరువైపులా సర్వీసు రోడ్లు నిర్మించలేదు. స్థానికులు ప్రతి పనికీ రాజీవ్ రహదారిపైకి రావాల్సి వస్తోంది. భారీ వాహనాలు, పట్టణంలోని వాహనాలతో రద్దీగా ఉంటుంది. దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

సుల్తానాబాద్ పట్టణంలో రెండు కిలోమీటర్ల మేర రాజీవ్ రహదారి విస్తరించి ఉంది. పట్టణానికి ఆనుకొని ఉండటంతో రహదారిపై వెళ్లే వాహనాలకు తోడు పట్టణంలోని ప్రజలు ఇదే మార్గం మీదుగా వెళ్లాల్సి వస్తోంది. వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో ప్రమాదాలకు కేంద్రంగా మారుతోంది. ఈ ప్రాంతంలో వాహనదారులు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలున్నాయి.

### ఖాళీ స్థలం.. గజానికో వివాదం..
## అయ్యప్ప సొసైటీలో స్థలాలకు భద్రత కరవు

హైదరాబాద్:హైటెక్‌సిటీలోని ఖరీదైన అయ్యప్పసొసైటీ, సర్వే ఆఫ్ ఇండియా, విఘ్నేశ్వర సొసైటీ భూముల్లో ఆక్రమణల పర్వం కొనసాగుతోంది. అమాయకులు, విదేశాల్లో స్థిరపడ్డ యజమానులే లక్ష్యంగా ఆక్రమణదారులు నకిలీ పత్రాలు సృష్టిస్తున్నారు. ఒక్కో ఇంటి స్థలానికి ముగ్గురు, నలుగురు యజమానులను సృష్టిస్తున్నారు. అసలైన యజమాని పారిపోయేలా చేస్తున్నారు. సదరు భూములపై కోర్టు వివాదం ఉండటంతో.. జీహెచ్ఎంసీ అధికారులు, స్థానిక పోలీసులు బాధితులకు న్యాయం చేయలేకపోతున్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులను చూస్తే.. ఆక్రమణదారులకు మద్దతుగా నిలుస్తున్నారనే విమర్శలొస్తున్నాయి.

**సీజ్ చేసినా ఫలితం లేదు..**విఘ్నేశ్వర సొసైటీలో 600గజాల విస్తీర్ణంలోని 968 నెంబరు ప్లాటు, దాని పక్కనున్న స్థలాన్ని కలిపి తాజాగా ఓ వ్యక్తి 2వేల గజాల విస్తీర్ణంలో నిర్మాణ పనులు చేపట్టారు. ప్రకాశ్‌రెడ్డి అనే వ్యక్తి 968వ ప్లాటు తనదంటూ జీహెచ్ఎంసీని ఆశ్రయించారు. తన స్థలంలో చేపట్టిన పనులను అడ్డుకోవాలని కోరారు. చందానగర్ సర్కిల్ కార్యాలయం అధికారులు స్థలాన్ని సీజ్ చేసి, అక్కడ నిర్మాణ పనులను చేపట్టవద్దని ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అయినప్పటికీ నిర్మాణదారు పనులు కొనసాగిస్తున్నారు. మరో ఇద్దరు ఆ స్థలం తమదేనంటూ బల్దియాను, పోలీసులను ఆశ్రయించారు. "ప్రస్తుతం ఆ భూమి బలరామయ్య అనే వ్యక్తి ఆధీనంలో ఉంది. ఆయనే పనులు చేపట్టారు. మరో ముగ్గురు యజమానులమని



పత్రాలు చూపుతున్నారు. నిజమైన పత్రాలు ఎవరివనేది న్యాయస్థానమే నిర్ణయిస్తుంది"అని పోలీసులు చెబుతున్నారు. సీజ్ చేసినా పనులు కొనసాగుతున్నాయని సర్కిల్ ఉపకమిషనర్ శశిరేఖను వివరణ కోరగా.. నిర్మాణదారుపై మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని చేతులు దులిపేసుకున్నారు. అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాల్సింది జీహెచ్ఎంసీనే అని మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ సమాధానమిచ్చారు. ఇరు శాఖల మధ్య స్పష్టత వచ్చేలోపు.. అక్కడ నిర్మాణం పూర్తవుతుంది. కట్టిన భవనాన్ని ఎలా కూల్చుతామంటూ ఇదే యంత్రాంగం కొత్త రాగం అందుకుంటుందని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్లుగా యాజమాన్య వివాదం కొనసాగుతున్నందున.. అయ్యప్పసొసైటీ, దాని చుట్టూ ఉన్న హౌసింగ్ సొసైటీ భూముల్లో ఇళ్ల నిర్మాణానికి అనుమతి మంజూరవదు. స్థానిక నేతలు, అధికారులకు లంచాలిచ్చి.. ఎవరికి వారు ఇళ్లు నిర్మించుకుంటున్నారు.

## 'ఓసి'నీ.. ఇదా కనెక్షన్!

హైదరాబాద్: భవన నిర్మాణదారులు విద్యుత్తు కనెక్షన్లు పొందేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. యాభై, వంద గజాల్లో ఇళ్లు కట్టుకునే సామాన్యులు కాదు.. ఆకాశహర్మ్యాలు నిర్మిస్తున్న బడా సంస్థలే ఈ అక్రమాలకు పాల్పడుతున్నాయి. నకిలీ ఆక్యుపెన్సీ పత్రాలు (ఓసీ) సమర్పించి, ఇంజినీర్లతో కుమ్మక్కై అక్రమంగా కనెక్షన్లు పొందుతున్నాయి. విజిలెన్స్, విద్యుత్తు చౌర్య నిరోధక విభాగం (డీపీఈ) విచారణలో ఈ తరహా అక్రమాలు ఒక్కొటిగా వెలుగు చూస్తున్నాయి.

**10 మీటర్ల ఎత్తు దాటితే.. తప్పనిసరి**

విద్యుత్తు కనెక్షన్ పొందాలంటే జీహెచ్ఎంసీ/ హెచ్ఎండీఏ/ మున్సిపాలిటీల నుంచి అనుమతి తప్పనిసరి. నిర్మాణ సమయంలో కేటగిరి–8 కింద తాత్కాలిక కనెక్షన్ జారీ చేస్తారు. పూర్తయ్యాక గృహ, వాణిజ్య కనెక్షన్లు ఇస్తారు. 10 మీటర్ల ఎత్తు దాటిన భవనాలకు ఆయా సంస్థలు జారీ చేసే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ తప్పనిసరి. ఇది లేకుండా జారీ చేయవద్దని ఇటీవల హైకోర్టు సైతం డిస్కంను ఆదేశించింది. గతంలో ఓసీ లేకుండా జారీ చేసిన భవనాల కనెక్షన్లపై టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ఆదేశాల మేరకు డీపీఈ, విజిలెన్స్ విచారణ చేపట్టాయి.

**అక్రమంగా అంటగడుతున్నారు..**

నల్లగండ్ల సెక్షన్ శేరిలింగంపల్లిలో ఆర్‌డీబీ హైదరాబాద్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ 19 అంతస్తుల ఆకాశహర్మ్యాన్ని నిర్మించింది. 625 ఫ్లాట్లు నిర్మించారు. తొలుత 285 విద్యుత్తు కనెక్షన్లు కావాలని 2022 ఫిబ్రవరిలో దరఖాస్తు చేసింది. ఈ కనెక్షన్లు అన్ని 2024 డిసెంబరులో జారీ చేసినట్లు డిస్కం రికార్డులు చెబుతున్నాయి. ఓసీ సమర్పించకపోయినా 285 సర్వీసులను గృహ విభాగం కింద విడుదల చేశారు. 220 ఫ్లాట్లు ఖాళీగా ఉన్నాయి. ఇప్పటికే భవనంలోకి దిగిన వినియోగదారులు అందరికీ తాత్కాలిక కనెక్షన్ కేటగిరి–8 కిందకు మార్చేందుకు నోటీసులు జారీ చేశారు. కొందరు రియల్టర్లు విద్యుత్తు అధికారులు,



సిబ్బందితో కుమ్మక్కై అక్రమ కనెక్షన్లు పొంది కొనుగోలుదారులకు ఇళ్లను అమ్మేస్తున్నారు. ఆ తర్వాత కొన్న వాళ్లు నానాపాట్లు పడుతున్నారు.

ఓల్డ్ బోయిన్‌పల్లిలో అంజద్‌బేగ్ నాలుగంతస్తులకు అనుమతి తీసుకొని జీ+5 భవనం కట్టారు. 22 కరెంటు కనెక్షన్లు తీసుకున్నారు. విజిలెన్స్ విచారణలో ఫోర్జరీ ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ సమర్పించినట్లు గుర్తించారు. బోయిన్‌పల్లి ఐసీఎస్‌సీ ఏడీఈ రోషన్, బోయిన్‌పల్లి ఏఈ అఖిల్‌పై చర్యలకు విజిలెన్స్ సిఫారసు చేసింది.

ఇబ్రహీంబాగ్ సబ్‌డివిజన్, నార్సింగి సెక్షన్ పరిధిలో 2024 అక్టోబరులో ధాన్వి ఇన్‌ఫ్రా ఎల్‌టీఎం నుంచి దరఖాస్తు వచ్చింది. 65 ఫ్లాట్లు ఉన్నాయి. త్రీఫేజ్ 65 కనెక్షన్ల కోసం, ఒక కామన్ మీటర్‌కు దరఖాస్తు చేశారు. 2025 జులైలో వీటి కనెక్షన్లు మంజూరు చేశారు. విచారణ చేపట్టగా ఓసీ లేకుండా కనెక్షన్లు మంజూరైనట్లు గుర్తించారు. మూణ్నెళ్ల తర్వాత ఓసీని ఆన్‌లైన్ ద్వారా సమర్పించారు. విచారించగా నకిలీదని తేలింది.

## కాంబోడియాలో శిక్షణ.. ఇక్కడ భక్షణ

తిరుపతి : సైబర్ నేరగాళ్లు కొత్తకొత్త పంథాలు ఎంచుకుంటూ అమాయకులను మోసం చేస్తూనే ఉన్నారు. రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. కాంబోడియాలో శిక్షణ తీసుకొని.. ఇక్కడ వల విసురుతున్నారు. మ్యూల్ ఖాతాలోకి దోచిన సొమ్ము మళ్లించి తప్పించుకుంటున్నారు.

**పాటించాల్సిన జాగ్రత్తలు**

రిజిస్టర్ కాని సంస్థలో పెట్టుబడులు పెట్టకూడదు.


డిజిటల్ అరెస్టులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండవు

చరవాణులు, టెలిగ్రామ్‌లో వచ్చే లింకులు, ఏపీకే ఫైళ్లు ఓపెన్ చేయవద్దు.పొరపాటున మీ వ్యక్తిగత సమాచారంతో లింకును ఓపెన్ చేస్తే వెంటనే ఇంటర్నెట్ను ఆఫ్ చేయాలి.

లింకుల ద్వారా వస్తువులు కొనుగోలు చేయకూడదు.

**అలాంటి వారిపైనే దృష్టి**

విశ్రాంత ఉద్యోగులు, పిల్లలు విదేశాల్లో ఉన్న వారిపైనే సైబర్ నేరగాళు దృష్టి పెడుతున్నారు. కాంబోడియాలో శిక్షణ పొంది వచ్చిన వారు దేశంలోని వివిధ శాఖల నుంచి ఇలాంటి వారి వివరాలు, ఆర్థిక స్థితిని తెలుసుకొని వల విసురుతున్నారు. వారి ఖాతాల నుంచి మ్యూల్



ఖాతాలకు జమ చేసి.. అక్కడ నుంచి ఆన్‌లైన్ గేమింగ్ ఆటలో గెలిచిన వారికి ఈ డబ్బును జమ చేస్తున్నారు. ఆన్‌లైన్ గేమింగ్ డిపాజిట్ సొమ్మును సైబర్ నేరగాళ్లు చైనా నుంచి దర్జాగా తీసుకుంటున్నారు.

**ఉద్యోగం పేరుతో వల**

కాల్ సెంటర్‌లో ఉద్యోగం, మంచి జీతం అని తెలుగు యువతకు ఎరవేసి కాంబోడియా దేశానికి రప్పిస్తున్నారు. వారితోనే తెలుగు ప్రజలను బుట్టలో వేస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన కోటిబాబు ఇలాగే శిక్షణ తీసుకొని తిరిగొచ్చారు. గుర్తు తెలియని, చనిపోయిన వారి (మ్యూల్ ఖాతాలు) పేరిట కరెంటు ఖాతాలు తెరిచి.. ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా కాంబోడియాలో నేరగాళ్లకు కొట్టేసిన సొమ్మును పంపిస్తున్నారు. ప్రతీ లావాదేవీపై కమీషన్ తీసుకుంటున్నట్లు ఇటీవల తిరుపతి పోలీసుల విచారణలో వెల్లడైంది. ఆరు నెలల కిందట విశాఖకు చెందిన ఓ వ్యక్తి కాంబోడియా నుంచి విజయవాడకు వచ్చి.. తమ్ముడు, వారి స్నేహితులతో కలసి తిరుపతికి చెందిన ఓ ఉపాధ్యాయుడిని డిజిటల్ అరెస్టు పేరిట బెదిరించి రూ.కోట్లు కాజేశారు. తరువాత కీలక నిందితుడు మినహా అతడి సోదరులు అరెస్టయ్యారు.

ఫిర్యాదు చేయాల్సిన నంబర్లు

సైబర్ టోల్ ఫ్రీ: 1930

అత్యవసర నంబరు: 112

వాట్సప్: 80999 99977

2025లో నమోదైన సైబర్ నేరాలు

కేసులు: 160

ఫ్రీజ్ చేసిన సొమ్ము: రూ.2.74 కోట్లు

అరెస్టైన వారు: 39 మంది

## 'గట్టు'న మేసిన 'భూ'తాలు..

నంద్యాల : చామ కాల్వకు వరద వచ్చిన సమయంలో నంద్యాల పట్టణంలోని పలు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. సమస్య పరిష్కారానికిగాను రక్షణ గోడ నిర్మించాలని గతంలో ప్రతిపాదించారు. కాలువ ఆనుకుని భూమి సేకరించి పరిహారం చెల్లించారు. ఇది సరిపోదంటూ కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయి ంచారు. దశాబ్దాలు గడిచినా పనులు జరగలేదు. ఈ నేపథ్యంలో విలువైన భూమిని ఆక్రమించుకునేందుకు అక్రమార్కులు అడుగులు వేస్తున్నారు.

**కంప చెట్లు తొలగించి..**

514 సర్వే నంబరులో 1.34 ఎకరాలకు సంబంధించి నలుగురు రైతుల నుంచి భూమి సేకరించారు. నగదు చెల్లించే క్రమంలో కొందరు కోర్టును ఆశ్రయించడంతో రూ.2,80,926ను అప్పట్లోనే కోర్టులో జమ చేశారు. కేసు ఏళ్లుగా నడుస్తూనే ఉంది. ఈ క్రమంలో భూమి తమదంటూ కొందరు వచ్చి కంపచెట్లు తొలగించి చదును చేశారు. దీని పక్కనున్న సర్వే నంబర్లలోనూ పనులు చేపట్టగా సంబంధిత భూ యజమానులు అడ్డు చెప్పడంతో వెనుదిరిగారు.

**గతంలో ప్లాట్లు వేశామంటూ..**

514, 519, 443-ఏ 512-1బీ తదితర సర్వే నంబర్లలో భూసేకరణకు ముందే తాము ప్లాట్లు వేశామని కొందరు తెరపైకి వస్తున్నారు. స్థలాలు అమ్మినా తమకు ప్లాట్లు చూపలేదంటూ ఫిర్యాదులు వస్తున్నాయని.. యజమానులైన తాము విక్రయించిన స్థలాలు చూపుతున్నట్లు చెబుతున్నారు. ఇంత జరుగుతున్నా అటు జలవనరులు, ఇటు రెవెన్యూ శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. కొందరు రెవెన్యూ సిబ్బంది అండతోనే



ఈ వ్యవహారం నడుస్తోందన్న ఆరోపణలున్నాయి. రెవెన్యూ దస్త్రాలో భూసేకరణ భూమి అని స్పష్టంగా ఉన్నప్పటికీ పలువురు ఆక్రమణలకు తెగపడుతుండటం గమనార్హం.

ఇప్పటికే చామ కాల్వకు మరోవైపున ఉన్న భూమిని కొందరు ఆక్రమించి సాగు చేసుకుంటున్నారు. సెంటు భూమి రూ.లక్షలు పలుకుతున్న నేపథ్యంలో ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది.

**ఎకరా రూ.5 కోట్ల పైమాటే..**

నంద్యాల పట్టణ శివారులోని ప్రథమ నంది ఆలయం నుంచి కర్నూలు బైపాస్ రహదారి సమీపం వరకు చామ కాల్వకు ఇరువైపులా గతంలో రెవెన్యూ అధికారులు భూసేకరణ చేశారు.

సర్వే నంబరు 514లో 1.34 ఎకరాలు, 519లో 2.99 ఎకరాలు, 515-1లో 16 సెంట్లు, 449-1లో 3.32 ఎకరాలు, 447-1లో 0.15 సెంట్లు, 446-1ఏలో 0.42 సెంట్లు, 443-ఏలో 3.8 ఎకరాలు, 438ఎ-3లో 0.24 సెంట్లు, 436-2లో 0.17 సెంట్లు, 436-3లో 0.13 సెంట్లు, 453-2లో 0.12 సెంట్లు 457-2లో 0.21లో సెంట్లు, 512-1బీ 1.05 ఎకరాలు, 512-2బీలో 1.58 ఎకరాలు సేకరించారు. మొత్తం 12 ఎకరాలను దశాబ్దాల కిందట కాలువకు ఒకవైపు సేకరించారు. ఈ భూములు చాలా ఏళ్లుగా నిరుపయోగం ఉండటంతో అక్రమార్కులు దీనిపై కన్నేశారు. ప్రస్తుతం ఇక్కడ ఎకరా భూమి రూ.5 కోట్లకుపైగా పలుకుతోంది.

## మేనకూరు పారిశ్రామికవాడ అభివృద్ధికి ప్రణాళికలేవీ



నాయుడుపేట : మేనకూరు పంచాయతీ పరిధిలోని సెజ్‌లో కంపెనీల నుంచి ఏడాదికి రూ.50 లక్షలు వరకు పన్ను రూపంలో రాబడి వస్తోంది. ఇందులో పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది, వాటర్ వర్క్స్, వాహనాల నిర్వహణ, ఇతర సిబ్బందికి నెలకు రూ.2 లక్షలకు పైనే చెల్లిస్తున్నారు. ఈ నగదును అవసరమైన పనులకు వినియోగించాల్సి ఉంది. ఏపీఐఐసీ అధికారులు వసూలు చేసే పన్నులో 8 శాతం లైబ్రరీ సెస్సుకు కేటాయించి, మిగిలిన 92 శాతంలో సగం పంచాయతీకి, మరో సగం ఏపీఐఐసీకి చెందుతోంది. పంచాయతీ పరిధిలోని పలు కాలనీల్లో పారిశుద్ధ్యం పడకేసింది.

**ప్రభుత్వ భవనాలకు స్థలాల కొరత**

ఇక్కడ నైపుణ్య కేంద్రాలు, ఆసుపత్రులు, పోలీసుస్టేషన్ వంటి వసతుల కల్పనకు ప్రభుత్వ భూముల కొరత ఏర్పడింది. మేనకూరు నుంచి వెంకటగిరి వెళ్లే ర.భ.రహదారి పక్కన సెజ్ ప్రహరీ ఆనుకొని ఉండే 12 ఎకరాల భూములను గుత్తేదారుల అవసరాలకు కేటాయించారు. మేనకూరు పరిసర గ్రామాల్లో శ్మశాన వాటికలకు భూమి కొరత ఉంది. కాలువల గట్లు ఇతర ఖాళీ స్థలాల్లో మృతదేహాలను పూడ్చుతున్నారు. శ్మశాన వాటికలు లేకుండా ఏపీఐఐసీ అధికారులు భూములను స్వాధీనం చేసుకున్నారు.

**ఆక్రమణల సంగతేంటి**

పంచాయతీ పరిధిలోని ఎన్టీఆర్ కాలనీ పక్కన గిరిజనుల కోసం గతంలో కేటాయించిన నాలుగు ఎకరాలకు పైగా ప్రభుత్వ స్థలాలను వైకాపా హయాంలో ఆక్రమించి ఇళ్లు కట్టి అద్దెలకు ఇచ్చింది. కూటమి ప్రభుత్వం దీనిపై చర్యలు చేపట్టలేదు. రూ.కోట్లు విలువజేసే ప్రభుత్వ భూముల్లోని ఆక్రమణలను నేటికీ తొలగించలేదు. రెవెన్యూ ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సి ఉంది. ఇక్కడి కంపెనీల అభివృద్ధి పేరుతో సాగునీటి చెరువులను ధ్వంసం చేసి మట్టి, గ్రావెల్, ఇసుక తరలిస్తున్నారు. పక్కనే మామిడికాలువలో మట్టి తరలింపులు, ఆక్రమణలతో దాని స్వరూపమే మారిపోయింది. రహదారులు, నివాసాలు, ఖాళీ స్థలాల్లో చెత్త కుప్పలుగా పేరుకుంటోంది. పంచాయతీ అభివృద్ధిపై ఎంపీడీవో సురేష్‌బాబుతో మాట్లాడగా గ్రామంలోని చెత్తతో సంపద తయారీ చేస్తున్నామని, తాగునీటి, రహదారుల వసతి కల్పిస్తున్నామని చెప్పారు.

వివరాలిలా..

గ్రామ పంచాయతీ : మేనకూరు

జనాభా : 8 వేలు

ఇళ్లు : 2 వేలు

నజరా గ్రామాలు : వద్దిగుంట కండ్రిగ, కోనేటిరాజుపాళెం, ఎర్రపశెట్టికండ్రిగ, పాళెంపాడు, గిరిజన, ఎస్సీ, బీసీ కాలనీలు

రాబడి : రూ.50లక్షలు

కంపెనీలు : 50వరకూ సేకరించిన భూములు : 4200 ఎకరాలు

## పేద బిడ్డలకు.. శుద్ధ జలం



చిత్తూరు : సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లోని విద్యార్థుల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. శుద్ధజల యంత్రాలను ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే సంక్షేమ వసతి గృహాల్లో రూ.8.63 కోట్లు, సీఎం ప్రత్యేక నిధి నుంచి రూ.3 కోట్లు మొత్తం రూ.11.63 కోట్లతో వసతులు కల్పించారు. గత ఐదేళ్ల వైకాపా పాలనలో వసతిగృహాల్లో కనీసం చిన్నపాటి మరమ్మతులు చేయలేదు. నాడు-నేడు ద్వారా మరమ్మతులు చేస్తామని చెబుతూనే ఐదేళ్లు గడిపేశారు. నిర్వహణ ఖర్చులు కూడా ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులు పెట్టారు. చిత్తూరు జిల్లాలో 57 సాంఘిక సంక్షేమ వసతిగృహాలు ఉన్నాయి. విద్యార్థులకు శుద్ధజలం లేక.. క్యాన్ల ద్వారా తెచ్చుకోవాల్సిన పరిస్థితి. గతంలో అప్పుడెప్పుడో ఎంపీ నిధులతో ఇచ్చిన ఫిల్టర్లు మూలనపడ్డాయి. కుప్పం, పలమనేరు, చిత్తూరులో కొన్నింటిలో దాతలు ఇచ్చిన ఆర్వో నీటిశుద్ధి యంత్రాలు పనిచేస్తున్నాయి. కొన్నిచోట్ల బోరు నీటినే తాగి పాఠశాల, కళాశాలకు వెళ్తున్నారు. వసతిగృహ వార్డెన్ల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి శుద్ధనీరు తాగే పరిస్థితి. జిల్లాలోని ఆరు వసతిగృహాల్లో మాత్రమే శుద్ధజల యంత్రాలు ఉండగా.. 51 వసతిగృహాల్లో విద్యార్థులు ఇక్కట్లు పడాల్సి వస్తోంది.

**ఎంపికైనవి ఇవే..**

మొదటి విడతగా రాష్ట్రంలో 311 వసతి గృహాల్లో ఒక్కో యంత్రాన్ని రూ.2 లక్షలతో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో జిల్లాలో ఏడు వసతిగృహాలు ఎంపిక కాగా, వాటిలో చిత్తూరు బాలికల వసతిగృహాలు 1, 2, కొనమాసనపల్లి బాలుర వసతిగృహం, వీకోట బాలుర, చిత్తూరు బాలుర, బాలికల కళాశాల వసతిగృహాలు, పుంగనూరు బాలికల వసతిగృహాలు ఉన్నాయి.


జిల్లాలో సాంఘిక సంక్షేమ వసతిగృహాలు: 57

ప్రీమెట్రిక్: 41

పోస్టు మెట్రిక్: 16

విద్యార్థులు: 3,500 మంది

## శ్రమజీవుల కుటుంబాల్లో వెలుగులు



పుత్తూరు : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఒప్పంద, పొరుగు సేవల చిరుద్యోగుల జీవితాల్లో కూటమి ప్రభుత్వం వెలుగులు నింపింది.. గత వైకాపా ప్రభుత్వ హయాంలో చాలీచాలని వేతనాలతో కార్మికులు చాలా ఇబ్బందులు పడ్డారు. పనికి తగిన వేతనం ఇవ్వాలని పలుమార్లు రోడ్డెక్కారు.. అయినా ప్రయోజనం లేకపోయింది.. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వీరి సేవలు గుర్తించి వేతనాల పెంపుతో పాటు ఆర్థిక ప్రయోజనాలు కల్పించేలా చర్యలు చేపట్టడం గమనార్హం.

**వినతులు బుట్టదాఖలు..**

2019లో అప్పటి వైకాపా ప్రభుత్వం కార్మికులను ఆప్కాస్ పరిధిలోకి చేర్చింది. వీరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు దూరం చేసింది. పలు నిబంధనల కారణంగా ప్రభుత్వాలు అందించే ఆర్థిక ప్రయోజనాలు వీరి దూరమయ్యాయి.

ఒక్కో ఉద్యోగికి గతంలో రూ.15 వేలు జీతం ఇచ్చేవారు. ఇందులో మినహాయింపులు పోను రూ.13,074 మాత్రమే వచ్చేది. కొవిడ్ సమయంలో ప్రజారోగ్య కార్మికులకు అదనంగా రూ.6వేలు పెంచి ఇచ్చారు. తమకు వేతనాలు పెంచాలని సాంకేతిక, సాంకేతికేతర ఉద్యోగులు కోరినా నాటి ప్రభుత్వం వారి వినతులు బుట్టదాఖలు చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక సాంకేతిక ఉద్యోగులకు ఈ ఏడాది ఆగస్టు నుంచి రూ.3 వేలు, సాంకేతికేతర ఉద్యోగులకు రూ.3500 వేతనం పెంచింది. యాక్సిస్ బ్యాంకుతో ఒప్పందం చేసుకుని శూన్య ఖాతాలు ప్రారంభించింది. ఏదైనా ప్రమాదం జరిగితే ప్రయోజనాలు కలిగేలా చర్యలు తీసుకుంది. ఫలితంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 4,500 మందికి ప్రయోజనం చేకూరనుంది.

**ఇవీ ప్రయోజనాలు..**

కార్మికులు, చిరుద్యోగులు దురదృష్టవశాత్తూ చనిపోతే రూ.2 లక్షల సాయం అందుతుంది. వారి పిల్లలు చదువుకునేందుకు ఒక్కొక్కరికి రూ.4 లక్షల చొప్పున ఇద్దరికి రూ.8 లక్షలు ఇవ్వనుంది.

ప్రమాదవశాత్తూ చనిపోతే రూ.20 లక్షల పరిహారం ఇస్తుంది.

రూ.4లక్షల వరకు రుణ సాయం అందేలా చర్యలు తీసుకుంటారు.

## గుంతల దారి.. గ్రానైట్ జారి..

చీమకుర్తి: చీమకుర్తి మండలం రామతీర్థం రాజుపాలెం రహదారి మరమ్మతులకు నోచుకోక తరచూ గ్రానైట్ బండలు జారి పడుతున్నాయి. దీంతో ఎప్పుడు ఎలాంటి ప్రాణ నష్టం జరుగుతుందోనని ప్రజలు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇవిగో ఉదాహరణలు రాజుపాలెం నుంచి రామతీర్థం వైపు గ్రానైట్ రాయి లోడ్‌తో వెళ్తున్న లారీ క్యాబిన్ నుంచి ట్రాలీ వేరుపడి రాయి పక్కకు పడిపోయింది. ఈ ఘటనలో రహదారిపై ఎవరూ లేక పోవడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగక పోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. కొద్ది రోజుల కిందట ఇదే రహదారిలో ఓ లారీ నుంచి పెద్ద గ్రానైట్ బండ జారిపడింది. ఆ సమయంలోనూ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. రూ.కోట్ల నిధులు మూలుగుతున్నా..రామతీర్థం నుంచి రాజుపాలెం వరకు రహదారి అంతా గోతుల మయంగా మారడంతో గ్రానైట్ బండలు తరచూ పడి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆర్.ఎల్.పురం పంచాయతీ పరిధిలో రూ.కోట్లనిధులు మూలుగుతున్నా కనీసం మరమ్మతులు చేపట్టలేని పరిస్థితులు నెలకొన్నాయి. కనీస మరమ్మతులు చేపట్టేందుకు అధికారులు అనుమతి ఇవ్వడం లేదని పాలక వర్గం వారు చెబుతుండటం విమర్శలకు దారితీస్తోంది.

## ఆచూకీ లేకున్నా.. ఉపాధి..!

భీమవరం : ఉపాధి హామీ పథకంలో చోటు చేసుకుంటున్న అక్రమాలను సరిచేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతూనే ఉన్నాయి. పనిచేసే ప్రతి శ్రామికుడికి ఈకేవైసీ తప్పనిసరి చేయడంతో జిల్లాలోని అసలు చిట్టా బయటపడుతోంది. మృతులు, ఇతరత్రా 64 వేల మంది ఆచూకీ లేకపోవడంతో వారి కార్డులను రద్దు చేశారు. మరో 48 వేల మంది ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది.

భీమవరం గ్రామీణ ప్రాంతంలో మొత్తం రూ.10లక్షల విలువ చేసే పనులు జరగ్గా రూ.8లక్షలకు సరైన వివరాలు లేకపోవడంతో రికవరీ చేశారు. పోడూరు మండలంలో అక్రమాలు వెలుగు చూసినా సిబ్బంది పట్టించుకోవడం లేదని ఎంపీటీసీ సభ్యులు గగ్గోలు పెట్టగా సుమారు రూ.4 లక్షలు రికవరీ చేశారు.

**వైకాపా సానుభూతిపరులకు..**

నిరుపేదలకు ఏడాదిలో కనీసం వంద రోజులు పనులు చూపించడం ద్వారా ఆయా కుటుంబాలకు ఉపాధి కల్పించాలని ప్రభుత్వాలు భావిస్తున్నాయి. దీనిలో కూడా కొందరు సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో పార్టీ సానుభూతిపరులకు ఉపాధి హామీ కూలి చెల్లించారనే వాదనలు ఉన్నాయి. సామాజిక తనిఖీల్లోనూ అవి బయట పడకుండా కొంత మంది సిబ్బంది జాగ్రత్త పడ్డారు. ఇటీవల మెంటేపూడిలో చనిపోయిన వ్యక్తులు పనిచేసినట్లు హాజరు వేసి రూ.12వేలు చెల్లించినట్లు గుర్తించారు.

కొంతమంది క్షేత్ర సహాయకులు శ్రామికులు హాజరు కాకపోయినా



వచ్చినట్లు, పని జరగకపోయినా జరిగినట్లు రాసేసుకుని ప్రభుత్వ సొమ్ము జేబుల్లో నింపుకొంటున్నారు. ఆచంట, పెంటపాడు, పాలకోడేరు, గణపవరం తదితర మండలాల్లో సామాజిక తనిఖీల్లో రూ.78లక్షల వరకు పక్కదారి పట్టినట్లు గుర్తించి, రికవరీ చేస్తున్నారు. 20 మండలాల్లోనూ మూడేళ్లలో 110 మంది క్షేత్ర సహాయకులు సస్పెండ్ అయ్యారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నాం. వంద శాతం ఈకేవైసీ అయ్యేలా చూస్తాం. చేయించుకోని వారి జాబ్ కార్డులు తొలగిస్తామని డ్వామా పీడీ అప్పారావు తెలిపారు.

మొత్తం జాబ్‌కార్డులు - 1,59,256

శ్రామికులు - 2,54,005

ఆధార్ సీడింగ్ - 2,51,838

ఈకేవైసీ చేసింది - 2,03,098

తొలగించింది - 64,159

## అడిగితే..ఆరోగ్యం

భీమవరం : వ్యవస్థీకృత కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరోసా కల్పిస్తున్నా కొన్ని సంస్థలు కార్మిక రాజ్య బీమాకు దూరంగా ఉండటం, నమోదు చేసుకోకపోవడంతో పూర్తి ఫలాలు అందడం లేదు. జిల్లాలో ఈఎస్ఐ ఆసుపత్రి లేక కొందరు... నమోదు కాక మరికొందరు ఏదైనా ప్రమాదం జరిగినా, అనారోగ్యం తలెత్తినా ఆర్థికంగా కుదేలవుతున్నారు.

**ఇది పరిస్థితి:** జిల్లాలో చిన్నవి, పెద్దవి కలిపి 39వేల యూనిట్ల వరకు ఉన్నాయి. వాటిలో 1.79లక్షల మంది కార్మికులు పనిచేస్తున్నా ఆ స్థాయిలో ఈఎస్ఐలో నమోదు లేదు. నిబంధనల ప్రకారం జిల్లాలో 50వేల మంది కార్మికులు నమోదై ఉంటే ఆసుపత్రి నిర్మించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకొస్తాయి. గత అయిదేళ్లు కార్మికుల నమోదు మాట దేవుడెరుగు ప్రోత్సాహకాలు లేకపోవడంతో ఉన్న పరిశ్రమలు సైతం మూతపడ్డాయి.

**చెల్లించేందుకు విముఖత**

ఏదైనా సంస్థ, పరిశ్రమలో కనీసం పది మంది కార్మికులుండి, వారిలో నెలకు రూ.21వేల జీతం కంటే తక్కువ ఉన్న వారంతా ఈఎస్ఐ పరిధిలోకి వస్తారు. వారి పేరున ఆయా సంస్థలు ఇచ్చే వేతనంపై యజమాని వాటా 3.25శాతం, కార్మికుడి వాటా 0.75శాతం జమ చేయాలి. కానీ చాలా సంస్థలు ముందుకు రాకపోవడంతో కార్మికులు ఆర్థికంగా, వైద్యపరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**ప్రథమ చికిత్సతో సరి**

వేంద్ర, భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకుల్లో ఈఎస్ఐ డిస్పెన్సరీలు




న్నాయి. ఏళ్ల తరబడి ఆ స్థాయిలోనే ఉండిపోవడంతో ప్రాథమిక చికిత్స మినహా అత్యవసర, గుండె, ఆర్థోపెడిక్, ఇతర దీర్ఘకాలిక వ్యాధులకు రాజమహేంద్రవరం ఈఎస్ఐ ఆసుపత్రికి రిఫర్ చేస్తున్నారు.

**ఏంటి ఉపయోగం**

ఈఎస్ఐలో నమోదైన కార్మికులు అస్వస్థతకు గురైనప్పుడు, కార్మికురాలు ప్రసవించినప్పుడు, ఉద్యోగ సంబంధమైన ప్రమాదాలకు గురైనా, మరణించినా, ఇతర కారణాలతో పనికి వెళ్లలేని క్రమంలో ఆర్థిక సహాయంతోపాటు ఆయా కుటుంబాలకు వైద్య సౌకర్యం కల్పిస్తోంది.

**ఏళ్లు గడుస్తున్నా అంతే..నమోదుకు చర్యలు**

కూటమి చొరవ: కార్మికుల ఇబ్బందులను గుర్తించిన కూటమి ప్రభుత్వం అయిదు నెలలుగా ఈఎస్ఐ ద్వారా స్కీం ఫర్ ప్రమోషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎంప్లాయర్స్, ఎంప్లాయిస్ (ఈఎస్పీఆర్ఈఈ) ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తోంది. రంగాల వారీగా ఆయా యాజమాన్యాలకు అవగాహన కల్పిస్తూ ఈ ఏడాది డిసెంబరు 31లోగా నిబంధనల ప్రకారం కార్మికులను నమోదు చేయాలని సూచిస్తుంది.

# మట్టి.. కొల్లగొట్టి..

పెద్దవడుగూరు : పెద్దవడుగూరులోని కొండ ప్రాంతం, నెలగొండరాయుడి మాన్యంలో అక్రమార్కులు ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపడుతున్నారు. భారీ యంత్రాల సాయంతో మట్టి తవ్వకాలు చేపట్టి.. టిప్పర్లు, ట్రాక్టర్లలో తరలిస్తూ రూ.లక్షలు వెనకేసుకుంటున్నారు. ఇదంతా అధికార పార్టీకి చెందిన కొందరు చేస్తున్నారన్న ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి.

**ప్రభుత్వ పథకాల పేరుతో దోపిడీ**

ప్రభుత్వ పథకాలు, ఇతర పనులకు అత్యవసరమైతే తప్పా ఎక్కడ ఎలాంటి తవ్వకాలు.. మట్టి, ఇసుక తరలింపు చేయకూడదని ఆదేశాలు న్నా పట్టించుకోవడం లేదు. ధనార్జనే ధ్యేయంగా రెండు చోట్ల జేసీబీలను ఏర్పాటు చేసుకుని అనుమతుల పేరుతో ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. గ్రామంలో శివాలయం, కన్యాకపరమేశ్వరి



ఆలయాలను నూతనంగా నిర్మిస్తుండగా ఆయా పనుల కోసమని చెబుతూ ఎర్రమట్టిని వక్కడని పట్టిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నిత్యం ఎర్రమట్టి దోపిడీ కొనసాగుతున్నా దేవదాయ, రెవెన్యూ, పోలీసు యంత్రాంగం చోద్యం చూస్తోందని పలువురు విమర్శిస్తున్నారు. విలువైన మట్టిని వెంచర్లు, ఇతరత్రా ప్రైవేట్ పనులకు తరలించుకా కొండరూపు మారిపోయింది.

గ్రామ సమీపంలో నెలగొండరాయుడికి సంబంధించిన ఆలయ భూమి 21 ఎకరాలు ఉంది. అందులో ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా అక్రమార్కులు మట్టిని తవ్వి తరలిస్తున్నారు. దీంతో మాన్యం భూమిలో మట్టిపోయి గుంతలుపడ్డాయి. ఇది వరకు సదరు భూమిని కొందరు రైతులు కౌలుకు తీసుకుని పంటలు పండించేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. మట్టి తవ్వకాలకు ఎవరికీ అనుమతులు ఇవ్వలేదని, నిబంధనలు అతిక్రమించి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు ఉషారాణి, ఎస్సై ఆంజనేయులు హెచ్చరించారు.

# పైనుంచి చూస్తున్నారు!

అనకాపల్లి : కేసులను ఛేదించడానికి, ట్రాఫిక్ సమస్య తీర్చడానికి అనకాపల్లిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఎంతో ఉపయోగపడు తోంది. అనకాపల్లిలో నెహ్రూచౌక్, పెరుగు బజార్, జాతీయ రహదారి నూకాంబిక ఆర్చి వద్ద సీసీ కెమెరాల, స్పీకర్‌లతో స్మార్ట్ ట్రాఫిక్ కంట్రోల్ ఏర్పాటు చేశారు. జిల్లాలో తొలిసారిగా పెట్టిన ఈ విధానం అనకాపల్లిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఎంతో ఉపయోగపడు తోంది. ఇంతవరకు భోజన విరామం, ఇతర ప్రాంతాల్లో బందోబస్తుకు సిబ్బంది వెళ్లినప్పుడు ట్రాఫిక్ పర్యవేక్షణ ఇబ్బందిగా ఉండేది. ఇలాంటి సమయంలో పోలీసులు స్టేషన్ నుంచే పర్యవేక్షిస్తుండటంతోపాటు వాహనదారులకు స్పీకర్‌లో హెచ్చరికలు జారీ చేస్తున్నారు. నిబంధనలు పాటించని వాహనాల నంబర్లను మైక్‌లో చెబుతూ వారిని అప్రమత్తం చేస్తున్నారు. అడ్డదిడ్డంగా వాహనాలు పార్కింగ్ చేస్తే ముందుగా హెచ్చరించి.. ఖాతరు చేయకుంటే కేసులు నమోదు చేస్తున్నారు.

అనకాపల్లిలోని కొత్తూరు వద్ద ద్విచక్రవాహనంపై వెళ్తున్న ముగ్గురు వ్యక్తులను ఢీకొట్టిన వ్యాను అక్కడి నుంచి ఆపకుండా పరారైంది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు చీకట్లో ఈ ప్రమాదం జరిగినా ఇందుకు కారణమైన వ్యానును పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి రెండు గంటల్లోనే పట్టుకున్నారు.

అనకాపల్లి మీదుగా క్వారీ లారీలు వెళ్తుంటాయి. రాత్రివేళల్లో పోలీసులు ఎవరూ పహారా లేరని గుర్తించి కొందరు డ్రైవర్లు వాహనాలు మితిమీరి న లోడుతో.. అధికవేగంతో నడుపుతున్నారు. సిబ్బంది లేకపోయినా ఈ విషయం సీసీ కెమెరాలో గుర్తించి అలాంటి లారీలకు భారీ జరిమానా విధిస్తున్నారు.

కొన్ని సందర్భాల్లో రోడ్డు ప్రమాదాలు చేసిన వాహనదారులు నిలపకుండా అక్కడి నుంచి పోనిస్తున్నారు. రాత్రి సమయంలో ఢీకొట్టిన వారు తమను ఎవరూ చూడలేదనుకుని భావించి సంఘటనా స్థలం నుంచి పరారవుతున్నారు. కానీ ఈ తరహా వాహనదారులను ప్రమాదం జరిగిన గంటల వ్యవధిలోనే పట్టుకుంటున్నారు. ఇందుకు కారణం చీకటిలోనూ స్పష్టంగా కనిపించేలా సరికొత్త సీసీ కెమెరాలను అనకాపల్లిలో ఏర్పాటు చేయడమే. దీంతోపాటు వాహనాల నంబరు ప్లేట్లను సులువుగా గుర్తించగలిగేలా ఏఎన్‌పీఎం కెమెరాలను జాతీయ రహదారితోపాటు పలు కూడళ్లలో ఏర్పాటు చేశారు.

అనకాపల్లిలో జనవరి నుంచి ఇప్పటివరకు 16 గుర్తుతెలియని వాహనాలు ఢీకొట్టి పరారయ్యాయి. మొత్తం అన్ని వాహనాలను గుర్తించి నిందితులపై కేసు నమోదు చేశారు.

# అడిగినా ఇవ్వరు.. చెప్పినా వినరు

అనకాపల్లి :కొమ్మాదికి చెందిన మహిళ ఏయూ దూర విద్యా కేంద్రంలో ఎంఏ ఆంగ్లం కోర్సు పూర్తి చేశారు. మార్కులజాబితా, ఒరిజినల్ ధ్రువపత్రం కోసం రెండు వారాలుగా ఆ కేంద్రం చుట్టూ తిరుగుతున్నారు. సిబ్బంది రేపుమాపు అంటూ తిప్పి పంపేస్తున్నారు. కొన్ని కీలక నోటిఫికేషన్లు రావడంతో దరఖాస్తు చేసుకోవడానికి గడువు అయిపోతున్న నేపథ్యంలో ఆమె ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

గాజువాకకు చెందిన రమేష్ బీకాం కోర్సుకు దరఖాస్తు చేశారు. ఐడీ కార్డు, మెటీరియల్ కోసం దూర విద్యా కేంద్రానికి పలుమార్లు తిరిగారు. ఐడీ కార్డు వివరాలు మెయిల్‌కు వస్తాయన్న కనీస వివరాలపై ఎవరూ సమాచారం ఇవ్వకపోవడం గమనార్హం.

ఏయూ దూర విద్యా కేంద్రంలో పరిస్థితి ఇష్టారాజ్యంగా ఉంది. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు అందులోని విభాగాల చుట్టూ తిరగడమే సరిపోతోంది. ఎవరికి ఫిర్యాదు చేసినా పట్టించు కోవడం లేదంటున్నారు. మార్కు జాబితాలు, ఓడీల కోసం కార్యాలయంలో అడిగితే ఇంటి చిరునామా కు పంపిచేశామని చెబుతున్నారు. ఒక వేళ వెనక్కి వచ్చినవి చేతికివ్వాల్సి ఉన్నా జాప్యం చేస్తున్నారు. కొందరు విద్యార్థులు రెండు, మూడు వారాలుగా ప్రదక్షిణ చేస్తున్నారు. సరైన సమాచారం ఇవ్వడంలేదనే విమర్శలొస్తున్నాయి. చోడవరానికి చెందిన యువకుడు జర్నలిజం కోర్సులో ఈ ఏడాది చేరాడు. మెటీరియల్ సంబంధిత సమాచారం లేదు. అతని మెయిల్‌కు సగం సబ్జెక్టుల పీడీఎఫ్‌లే వచ్చాయి.

**సమాచారం ఏదీ**

యూజీ, పీజీ కోర్సుల్లో చేరిన వారికి మెటీరియల్ పంపిణీకి సంబంధించి సరైన సమాచారం ఇవ్వడం లేదు. పుస్తకాల పంపిణీ కూడా సరిగా జరగడం లేదనే ఆరోపణలున్నాయి. 'ధ్రువపత్రాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు గతంలో కంటే ఇప్పుడు సకాలంలో అందిస్తున్నాం. ఎవరికైనా జాప్యమైతే నా దృష్టికి తీసుకురావొచ్చు. వెంనే వారికి అందేలా చర్యలు తీసుకుంటా' అని ఏయూ దూర విద్యా కేంద్రం సంచాలకులు ఆచార్య డి.ఎ.నాయుడు పేర్కొన్నారు.

# దాచాలంటే కష్టం.. అమ్మాలంటే నష్టం



గోరంట్ల : శ్రీసత్యసాయి జిల్లాలో మొక్కజొన్న సాగుచేసిన రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఇతర పంటలతో పోలిస్తే తక్కువ పెట్టుబడితో గిట్టుబాటు అవుతుందన్న అభిప్రాయంతో ఖరీఫ్‌లో రైతులు జిల్లావ్యాప్తంగా విస్తారంగా సాగు చేశారు. పంటకు అనుకూల ంగా వర్షాలు కురవడంతో చాలాప్రాంతాల్లో మంచి దిగుబడులు వచ్చాయి. పంట రైతుల చేతికొచ్చి విక్రయించాల్సిన సమయంలో ధర పతనమైంది. దీంతో జిల్లాలో మొక్కసాగు చేసిన రైతుల విక్రయించలేక నిల్వ ఉంచుకోలేక సతమతమవుతున్నారు. నెలక్రితం అత్యధికంగా క్వింటా రూ.2,500 వరకు ఉండగా నేడు రూ.1,700 లకు పడిపోయింది. క్వింటాల్‌కు రూ.800లు నష్టపోవాల్సి వస్తోందని రైతులు విలపిస్తున్నారు. వాస్తవంగా లక్ష ఎకరాలకు పైగాసాగైనట్లు తెలుస్తోంది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవ డంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులంటున్నారు.

**మేఘం కనిపిస్తే భయం**

ఇళ్లలో దాచుకోవడానికి స్థలం లేని చాలామంది రైతులు కళ్లాల్లో, రోడ్లపైన ఆరబోసుకున్నారు. మేఘం కనిపిస్తే ఎక్కడ ధాన్యం తడిసిపోతుందోనని భయపడుతున్నారు. ఇంకొందరు ఇళ్ల నుంచి వాటిని బండలపైకి తీసుకెళ్లి ఆరబెట్టాలంటే అదనంగా అత్యంత ఖర్చుపెట్టుకోవాల్సి వస్తోందని కన్నీరు పెడుతున్నారు.

జిల్లా: శ్రీసత్యసాయి
మొక్కజొన్న సాగు: 76,782 ఎకరాలు
దిగుబడి: 2,14,991 మెట్రిక్ టన్నులు
విక్రయాలకు సిద్ధంగా ఉన్నది: 1,28,995 మెట్రిక్ టన్నులు
ప్రస్తుత మార్కెట్ ధర: రూ.1700 నుంచి రూ.1800
ప్రభుత్వ మద్దతు ధర: క్వింటా రూ.2400
క్వింటాల్‌పై నష్టం: రూ.800

**రూ.50వేలు నష్టపోతున్నా..**

ఫకృద్దీన్, మల్లాపల్లి, గోరంట్ల మండలం

రెండెకరాల్లో సాగుచేశాను. సుమారు 60 క్వింటాళ్ల వరకు దిగుబడులు వచ్చాయి. విక్రయించడానికి సిద్ధం చేసే సమయానికి ధర క్వింటాల్‌పై రూ.800 వరకు తగ్గింది. దీంతో రూ.50 వేల దాకా నష్టపోవాల్సి వస్తోంది. ప్రభుత్వం మద్దతు ధరకు తీసుకుంటే గిట్టుబాటు అవుతుంది.

# భూంఫట్!



తనకల్లు : గత ప్రభుత్వంలో కొందరు వైకాపా నాయకులు గుట్టుచప్పుడు కాకుండా భూములను కాజేశారు. వాటిని ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారు. పాసుపుస్తకాలు సృష్టించి దర్జాగా రుణాలు పొందారు. వందల ఎకరాలు అక్రమంగా దోచేశారు. వీరికి అప్పట్లో కొంతమంది రెవెన్యూ అధికారులు సహకారం అందించారనే ఆరోపణలు ఉన్నాయి. ఆ భూములు తమవని, న్యాయం చేయాలని అసలైన లబ్ధిదారులు కొన్నేళ్లుగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే నాథులే కరవయ్యారు. తనకల్లు మండలంలోని ఈతోడు, బిసనవారిపల్లిలో ఈ అక్రమాలు వెలుగుచూశాయి.

**ఈతోడులో 80 ఎకరాలకుపైగా..**

ఈతోడులో వైకాపాకు చెందిన 12 మంది నాయకులు దాదాపు 80 ఎకరాలకుపైగా భూములకు అక్రమంగా పాసుపుస్తకాలు పొందారు. వాటితో రుణాలు తీసుకున్నారు. దీనిపై గత ప్రభుత్వంలోనే బాధితులు కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. విచారణ మొదలవగా అధికారం అండతో అక్రమార్కులు బయటకు రాకుండా తొక్కిపెట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భూ అక్రమాలపై నిర్వహించిన గ్రామసభలో బాధితులు ఫిర్యాదు చేశారు. దీంతో కొందరు అక్రమార్కులు వారంతట వారే పాసుపుస్తకాల్లో నుంచి భూములను తొలగించినట్లు తెలిసింది. పది నెలలు గడుస్తున్నా మిగిలిన అక్రమాలపై ఎటువంటి విచారణ లేదు.

**బిసనవారిపల్లిలో 42 ఎకరాలు..**

టిసదుం పంచాయతీలోని బిసనవారిపల్లికి ఓ కుటుంబం కొన్నేళ్ల కిందట వలస వచ్చి 50 ఎకరాల భూమి కొనుగోలు చేశారు. తరువాత అందులో నుంచి 20 ఎకరాలు విక్రయించారు. 30 ఎకరాలకు వారికి హక్కు ఉంది. అయితే ఆ కుటుంబంలోని 12 మంది పేరిట 15 సర్వేనంబర్లలో దాదాపు 42 ఎకరాలకు అక్రమంగా పాసుపుస్తకాలు సృష్టించారు. ఆ భూమి తమకు పిత్రార్జితంగా వచ్చిందని, ఆన్‌లైన్‌లో ఎక్కించాలని గత కొన్నేళ్లుగా గ్రామంలోని 60 కుటుంబాలకు చెందిన రైతులు రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. గత నెల కదిరిలో జరిగిన పీజీఆర్ఎస్‌లోనూ బాధితులు కలెక్టరుకు విన్నవించారు.

**మాన్యం భూమిని వదల్లేదు**


ఈతోడు పంచాయతీలోని రాకుంటపల్లి వద్ద దొక్కలకొండ లక్ష్మీనరసింహస్వామికి మాన్యం కింద సర్వేనంబరు 221లో 12.20 ఎకరాలు ఉంది. ఆ భూమిని సైతం కొందరు ఆన్‌లైన్‌లో ఎక్కించుకు న్నారన్న విమర్శలు తీవ్రస్థాయిలో ఉన్నాయి. కొన్నేళ్ల కిందట ఈ తంతు జరిగినా మాన్యం భూమిని రక్షించడంలో అధికారుల నిర్లక్ష్య వైఖరిపై విమర్శలు వెల్లువెత్తాయి.

**విచారణ చేస్తున్నాం**

షాబుద్దీన్, తహసీల్దారు, తనకల్లు

ఈతోడు గ్రామంలో అక్రమ పాసుపుస్తకాలపై నోటీసులు ఇచ్చాం. నివేదికను ఆర్డీఓకు పంపాం. వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపడతాం బిసనవారిపల్లిలో అక్రమాలపై విచారణ జరుగుతోంది. నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటాం.

# పారిశుద్ధ్యం.. నిర్వహణ అస్తవ్యస్తం!



గుత్తి: పురపాలికల్లో పారిశుద్ధ్య కార్మికులు చెత్తసేకరణకు పడరాని పాట్లు పడుతున్నారు. వీధుల్లోకి వెళ్లడానికి చెత్త తరలింపు వాహనాల కొరత తీవ్రంగా ఉంది. కార్మికుల సంఖ్య కూడా తక్కువగా ఉండటం గమనార్హం. ఫలితంగా పారిశుద్ధ్య నిర్వహన అనుకున్నంత స్థాయిలో జరగడం లేదన్న విమర్శలున్నాయి. గుత్తి, గుంతకల్లు, తాడిపత్రి పట్టణాల్లో పరిస్థితి దారుణంగా ఉంది. స్వచ్ఛంధ్ర, స్వచ్ఛభారత్, మన పరిశుభ్రత–మన ఆరోగ్యం కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతోంది. క్షేత్రస్థాయిలో వీటి అమలు పరిస్థితి భిన్నంగా ఉంది. ప్రధానంగా గుత్తి పురపాలికలోని చెట్నేపల్లి, గుత్తిఆర్.ఎస్, సూరశింగనపల్లి, గుత్తిలో పారిశుద్ధ్యం నిర్వహణ అధ్వానంగా తయారైంది. చెత్తసేకరణకు మూడు ఆటోలు, నాలుగు ట్రాక్టర్లు, మరో రెండు భారీ వాహనాలు ఉన్నాయి. దీనికి తోడు తగినంత మంది కార్మికులు లేరు. కోట, బండగేరి, చెర్లోపల్లికాలనీ, గాంధీనగర్, చెట్నేపల్లి, సూరశింగనపల్లి, గుత్తిలోని బీసీకాలనీ, దాసరిగేరిలలో పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా ఉంది. పుష్‌కార్టులు, వీల్‌బార్‌లు 35 చొప్పున ఉన్నాయి. చెత్తకుండీలు 50 ఉన్నాయి. వీల్‌బార్లు, పుష్‌కార్టులు చాలా వరకు తుప్పుపట్టిపోయాయి. సగానికి సగం పనిచేయడం లేదు.

గుంతకల్లు పురపాలికలోనూ ఇదే పరిస్థితి. కార్మికులకు సరిపడ పరికరాలు లేక ఇబ్బంది పడుతున్నారు. తాడిపత్రిలో చెత్త కుండీలు లేవు. కుండీలులేని పట్టణంగా మార్చారు. ఇక్కడ ప్లాస్టిక్ బుట్టలు ఇచ్చారు. వీటిల్లో చెత్త వేసి వీధుల్లో వాహనాల్లో వేయాల్సి ఉంటుంది. ఈప్రక్రియ సక్రమంగా సాగడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

**త్వరలో సామగ్రి తెప్పిస్తాం..**

**జబ్బార్‌మియా, కమిషనర్, గుత్తి**

పాతబడి మూలకు చేరిన పుష్‌కార్టులు, వీల్‌బార్ల స్థానంలో కొత్తవి తెప్పిస్తాం. ఇందుకు రూ.2 లక్షలు వెచ్చించాలని నిర్ణయించాం. ఇప్పటికే టెండర్లు పూర్తి చేశాం. గుంటూరుకు చెందిన గుత్తేదారులకు సామగ్రి కోసం ఆదేశాలిచ్చాం. పారిశుద్ధ్యం పనుల విషయంలో లోపాలు లేకుండా చర్యలు తీసుకుంటాం.

# కోట్ల మనసులు దోచిన పరోపకార మంత్రం


పుట్టపర్తి : సర్వమానవ సౌభ్రాతృత్వం కోసం సత్యసాయి చూపిన పరోపకార మంత్రానికి భక్తులు ముగ్ధులయ్యారు. అందుకే ఆయన శతజయంత్యుత్సవాల్లో తామూ భాగస్వాములు కావాలని పుట్టపర్తికి తరలివస్తున్నారు. భక్తులకు జిల్లా అధికారులు, సత్యసాయి సెంట్రల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. భక్తులు సహకరిస్తే అందరికీ సులువుగా సాయి దర్శనం అవుతుందని చెబుతున్నారు.

**వైద్య శిబిరాలు**

పుట్టపర్తిలో మొత్తంగా 25 చోట్ల వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, చిత్రావతి వంతెన, ఆర్టీసీ బస్టాండ్, గోకులం కలెక్టరేట్, విమానాశ్రయం వద్ద, పంచాయతీ కార్యాలయం, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో వైద్య శిబిరాలున్నాయి. వీటితో పాటు 108 వాహనాలు 25 సిద్ధంగా ఉంచారు.

**వసతి ఎక్కడంటే..**

సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు విద్యుత్తు సబ్‌స్టేషన్, ఆర్టీసీ బస్ డిపో, ప్రశాంతి నిలయం సాయి హీరాహాల్, చైతన్యజ్యోతి మ్యూజియం, ప్రశాంతి నిలయం వెస్ట్‌నార్త్ పక్కన సుందరం ఎన్‌క్లేవ్, వెస్ట్ సౌత్ పక్కన శివం ఎన్‌క్లేవ్ ప్రాంతాల్లో తాత్కాలిక గుడారాలు, షెడ్లు నిర్మించారు.




**18 చోట్ల అగ్నిమాపక దళం**

పట్టణంలో 18 చోట్ల అగ్నిమాపక యంత్రాలను ఏర్పాటు చేశారు. చిత్రావతి నదిలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఒక స్పీడీ బోట్, ఆరుగురు గజఈత గాళ్లను నియమించారు.

**భోజన సౌకర్యం**

ఉత్సవాల ముగింపు వరకూ 6 చోట్ల ఉచిత భోజన సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ప్రశాంతి నిలయంలో సత్యసాయి మహాప్రసాద క్షేత్రం, వెస్ట్ గేట్, చైతన్యజ్యోతి మ్యూజియం, గ్రామ సేవ, చిత్రావతి రోడ్డు, బృందావన్ ఎన్‌క్లేవ్, విద్యుత్తు సబ్‌స్టేషన్, ఆర్టీసీ డిపో వెనుక ఉచిత భోజన వసతి కల్పించారు.

**సమాచారానికి 'సాయి 100' యాప్**

తొమ్మిది ప్రాంతాల్లో సమాచార సేవా కేంద్రాలను అందుబాటులో ఉంచారు. కర్ణాటకనాగేపల్లి, చిత్రావతి బ్రిడ్జి, చిత్రావతి హారతి ఘాట్, సత్యసాయి పార్కు, గణేష్ సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్, రమేశ్ విల్లాస్, పెద్ద కమ్మవారిపల్లి కూడలి, రైల్వేస్టేషన్ వద్ద సమాచార కేంద్రాలను ఏర్పాటు చేశారు. యాత్రికులు అవసరమైతే 'సాయి100' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే పూర్తి వివరాలు తెలుస్తాయి.

**యాత్రికులకు ఉచిత రవాణా**

రైల్వేస్టేషన్ నుంచి గణేశ్ సర్కిల్ మీదుగా కర్ణాటకనాగేపల్లి వరకు, అక్కడి నుంచి మళ్లీ రైల్వేస్టేషన్ దాకా యాత్రికులు ఉచితంగా ప్రయాణించేందుకు 25 బస్సులు ఏర్పాటు చేశారు.

**12 పార్కింగ్ ప్రదేశాలు..**

కదిరి, పులివెందుల, చెన్నై నుంచి వచ్చే భక్తులకు కర్ణాటకనాగేపల్లి కింగ్స్ చర్చి, టీకూడలి, సాయినగర్ క్రికెట్ గ్రౌండ్ వద్ద..

కర్ణాటక, అనంతపురం నుంచి వచ్చే భక్తులకు బ్రాహ్మణపల్లి శిల్పారామం, కమ్మవారిపల్లి రోడ్డులోని ఎస్ఎస్ఎస్ పాఠశాల, కమ్మవారిపల్లి పోతులయ్యస్వామి గుడి, సత్యసాయి సర్కిల్‌లో బాలవికాస్ పాఠశాల, పోలీస్ పరేడ్ గ్రౌండ్ ఆనంద విల్లాస్, విమానాశ్రయం రోడ్‌లో సందీప్ బెల్లీవ్యూ, వైకూడలిలో అమూల్య లేఅవుట్, సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వద్ద వాహనాల పార్కింగ్‌కు ఏర్పాటు చేశారు. వీటిపక్కనే తాత్కాలిక మరుగుదొడ్లను అందుబాటులో ఉంచారు.

# వరి రైతుల గుండె కోత

ఆళ్లగడ్డ : 'వరిరైతులకు కంటిమీద కునుకు కరవైంది..గ్రామ స్థాయిలో ఏజెంట్లంతా ఒక్కటై రైతుల గుండెకోసేంత పని చేస్తున్నారు. గతంలో ఎన్నడూలేని రీతిలో వరి కోతల ధరలు ఆకాశాన్నంటుతు న్నాయి. అధిక వర్షాలు, పంట కాల్వల్లో నీటి పరవళ్ల కారణంగా వరి కోత కోసం చైన్ మిషనే వాడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. గంటకు (చైన్ మిషన్) రూ.3,200 నుంచి రూ.3,500 వరకు కోత యంత్రాల యజమానులు తీసుకుంటున్నారు. స్థానికంగా కొందరు నెల్లూరు, తమిళనాడు, తెలంగాణ ప్రాంతాల నుంచి వందల యంత్రాలను తీసుకొస్తున్నారు. వీరంతా సిండికేట్‌గా మారి వారు చెప్పిందే ధరగా మార్చారు. ఏజెంట్ల సిండికేట్ కారణంగా రైతు ఎకరాకు సగటున రూ.2 వేల వరకు నష్టపోతున్నారు.

**గ్రామస్థాయి నేతల పెత్తనం**

వరి కోత యంత్రాలను స్థానిక ఏజెంట్లు ఇతర ప్రాంతాల్లో ఉన్న వాటి యజమానులతో ఒప్పందం కుదుర్చుకుంటారు. గంటకు రూ.200 కమీషన్ వచ్చేలా మాట్లాడుకుని ఎన్ని గంటల కోతలు జరిగితే అన్ని రూ.200 చొప్పున ఏజెంట్లు తీసుకుంటారు. కొన్ని గ్రామాల్లో ఈ ఏజెంట్లు రాజకీయ నాయకులై ఉంటారు.

**నెమ్మదిగా నడిపేలా చేస్తూ..**

గతంలో ఒక ఎకరా వరి పొలాన్ని గంట లేదా 1.25 నిమిషాల్లోనే కోసేసేవారు. ప్రస్తుతం సాంకేతికత పెరిగి, అధునాతన యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. అయినా కోత సమయం తగ్గకపోగా మరో 30, 45 నిమిషాలు పెరగడం గమనార్హం. ఏజెంట్లు తమకు కమిషన్ అధికంగా పెంచుకునేందుకు యంత్రాలను ఉద్దేశపూర్వ కంగానే నిదానంగా నడిపేలా చేసి రైతులను దోచుకుంటున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

ప్రస్తుతం సగటున ఒక గంట 45 నిమిషాల నుంచి 2 గంటల్లో ఎకరా పొలాన్ని కోస్తున్నారు. వరి కోతకే కనీసం ఎకరాకు రూ.7 వేల ఖర్చు వస్తోంది. తుపాను దెబ్బకు నేలకొరిగిన పొలాలకైతే ఎకరాలకు కనీసం మూడు గంటల సమయం పడుతోంది.

మండలానికి వందకు పైగా..

ప్రస్తుతం జిల్లాలో వెలుగోడు మొదలుకుని చాగలమర్రి వరకు ప్రతి మండలానికి తక్కువలో తక్కువగా 100 నుంచి 120 వరి కోత యంత్రాలు ఉంటాయి.

రుద్రవరం మండలంలో 60 మంది ఏజెంట్ల వద్ద 110 నుంచి 120 వరకు వరికోత యంత్రాలు ఉన్నాయి. వీరంతా ఒకే రేటు పెట్టి సిండికేట్‌గా మారినట్లు రైతులు ఆరోపిస్తున్నారు.

శిరివెళ్లలో 30 మంది ఏజెంట్లు వందకుపైగా యంత్రాలను కలిగి ఉన్నారు. వీరు తెలుగు గంగ కింద కోతకు వచ్చిన పంటను కోస్తున్నారు. ప్రస్తుతం రూ.3200 వరకు వసూలు చేస్తున్నారు.

# వీడని వరద!

కనిగిరి : మొంథా తుపాను తీరం దాటి 48 గంటలు గడిచినా జిల్లాలో దాని ప్రభావం కొనసాగుతోంది. పశ్చిమ ప్రకాశం నుంచి ప్రవహిస్తున్న పాలేరు, ముసి, గుండ్లకమ్మ నదులు తూర్పున బంగాళాఖాతంలో కలుస్తాయి. మార్గమధ్యలో మూడు నదులకు అనుసంధానంగా పలుచోట్ల వాగులున్నాయి. ఆ మూడు నదులు ఉగ్రరూపం దాల్చడంతో జిల్లా వ్యాప్తంగా వాగులు, వంకలు, చెరువులు పొంగి పొర్లుతున్నాయి. నాలుగో రోజైన కూడా పలు గ్రామాల మధ్య వంతెనలు, రహదారులపై వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. గుండ్లకమ్మ జలాశయం గేట్లు ఎత్తడంతో దిగువన ఉన్న మద్దిపాడు, నాగులుప్పలపాడు, ఒంగోలు మండలాల్లోని 12 గ్రామాల్లోకి నీరు చేరింది. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడు వద్ద ప్రధాన రహదారిపై భారీగా వరద నీరు ప్రవహిస్తుండడంతో ఒంగోలు–చీరాల మధ్య వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.



**రహదారులకు రూ.21 కోట్ల నష్టం**

జిల్లాలోని పంచాయతీరాజ్ పరిధిలోని 12 వంతెనలతోపాటు 15 కిలోమీటర్ల మేర రహదారులు దెబ్బతినగా రూ.11.98 కోట్ల మేర నష్టం జరిగింది. ఆర్అండ్‌బీ పరిధిలో మొత్తం 375 కిలోమీటర్ల మేర రహదారులు కోతకు గురికాగాబీ రూ.9 కోట్ల మేర నష్టం వాటిలినట్లు ప్రాథమిక అంచనా వేశారు. చదలవాడ విద్యుత్తు ఉపకేంద్రంలోకి వరదనీరు చేరడంతో రూ.1.50 కోట్లు, ఒంగోలులోని స్టోర్ రూంలోకి నీరు చేరడంతో రూ.50 లక్షల విలువైన సామగ్రి దెబ్బతింది. పరివర్తకాలు, స్తంభాలు నేలకొరగడంతో మరో రూ.2 కోట్లు నష్టం వాటిల్లింది.

**పునరావాస కేంద్రాల్లో 9,335 మంది**

ఒంగోలు నగరంతోపాటు జిల్లాలోని 27 మండలాల్లో లోతట్టు ప్రాంతాలకు చెందిన వరద బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 125 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయగా, 3,346 కుటుంబాలకు చెందిన 9,335 మందిని తరలించారు. రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో భోజన, అల్పాహారం, తాగునీటి వసతి కల్పించారు.

# ప్రభుత్వ వాహనం.. ప్రైవేటు పెత్తనం

నెల్లూరు : 'నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రభుత్వం 26 స్వీపింగ్ వాహనాలను మంజూరు చేసింది. రోడ్లను శుభ్రం చేసేందుకు వీటిని వినియోగించాల్సి ఉంది. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ 50శాతం, నగరపాలక సంస్థ 50 శాతం నిధులు ఖర్చు చేసి వీటిని కొనుగోలు చేశారు. 26 వాహనాల్లో 5 చిన్నవి ఉండగా– రెండు బ్యాటరీతో నడిచేవి ఉన్నాయి.'ఎక్కడైనా ప్రైవేటు వాహనాలను ప్రభుత్వం అద్దెకు తీసుకోవడం చూశాం. నెల్లూరు నగరపాలక సంస్థలో మాత్రం ప్రభుత్వ వాహనాల నిర్వహణను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించడంతో పాటు గంటకు రూ. 1485 చొప్పున చెల్లిస్తుండటం గమనార్హం. దీంతో ప్రజలు పన్నుల రూపంలో చెల్లిస్తున్న ప్రజాధనాన్ని అధికారులు, కొందరు పాలకులు కాంట్రాక్టర్లకు దోచిపెడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**24 కోట్ల కేటాయింపు**

ప్రభుత్వ వాహనాల పెత్తనాన్ని ప్రైవేటుకు అప్పగించిన అధికారులు... డ్రైవరు, ఆయిల్, రెండేళ్లపాటు నిర్వహణకు రూ. 24 కోట్ల నగరపాలక సంస్థ సాధారణ నిధులు కేటాయించారు. రోజూ ఒక్కో వాహనం 8 గంటలపాటు రోడ్లను శుభ్రం చేయాల్సి ఉండగా– గంటకు రూ. 1485 చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. గుత్తేదారులు మాత్రం రోజుకు మూడు గంటలు కూడా పనిచేయడం లేదు. రాత్రిళ్లు రోడ్డు పక్కన నిలిపి నిద్రపోతున్నారు. పగలు మినీ స్వీపింగ్ యంత్రాలు అంతర్గత రహదారులను శుభ్రం చేయాల్సి ఉండగా.. ఈ ప్రక్రియ మొక్కుబడిగానే సాగుతోంది. కార్పొరేషన్‌లో 30 మంది వరకు డ్రైవర్లు అదనంగా ఉండటంతో పాటు డీజిల్ బంకు ఉన్నా.. ప్రైవేటు సంస్థలకు నిర్వహణ బాధ్యతలు అప్పగించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఓ వైపు 105 ట్రాక్టర్లతో పాటు కార్లు అద్దెకు తీసుకుని నిర్వహిస్తూ.. మరోవైపు ప్రభుత్వ వాహనాల నిర్వహణ బాధ్యతను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం ఏమిటన్న ప్రశ్న ఎదురవుతోంది. వాహనాల పార్కింగ్‌కూ కార్పొరేషన్‌లోనే కేటాయించడం గమనార్హం.



**జీపీఎస్.. ఆపై పర్యవేక్షణ**


స్వీపింగ్ వాహనాలకు జీపీఎస్‌ఉంది. ఇద్దరు సూపర్‌వైజర్లు పర్యవేక్షిస్తున్నారు. రోడ్లను శుభ్రం చేయకుంటే పరిశీలించి.. చర్యలు తీసుకుం టాం.
రామమోహన్‌రావు, కార్పొరేషన్ ఎస్‌ఈ

స్వీపింగ్ వాహనాలు: 26
నిర్వహణకు గంటకు చెల్లింపు: రూ.1485
రోజుకు 8 గంటలకు : రూ.11,880
26 వాహనాలకు రోజుకు: రూ.3,08,880
నెలకు చెల్లింపు: రూ.92,66,400

# గర్జించిన గుండ్లకమ్మ!

ఒంగోలు : జిల్లాలో ఎంతో కీలకమైన గుండ్లకమ్మ జలాశయం గర్జించింది. వరదనీటితో ఉప్పొంగింది. ఒంగోలు, చీమకుర్తి, నాగులుప్పలపాడు, మద్దిపాడు మండలాల ప్రజల సాగు, తాగునీటి అవసరాలు తీర్చేందుకు ఈ జలాశయం నిర్మాణం చేపట్టారు. దీని ద్వారా ఖరీఫ్‌లో 62 వేల ఆయకట్టు, రబీలో 80 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు,. అద్దంకి, సంతనూతపాడు, ఒంగోలు నియోజకవర్గాల్లోని గ్రామాలకు తాగునీరు అందిస్తున్నారు. 2008లో ప్రాజెక్టు నిర్మాణం పూర్తయిన అనంతరం ఇప్పటి వరకు గరిష్ఠంగా 75 వేల క్యూసెక్కుల నీటిని మాత్రమే దిగువకు విడుదల చేశారు. మొంథా తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు భారీగా వరద నీరు చేరడంతో 1.30 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. అర్ధరాత్రి నుంచి లక్షకుపైగా క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరడంతో అన్ని గేట్లు ఎత్తి సముద్రంలోకి వదిలిపెట్టారు. వరద ప్రవాహం తగ్గడంతో నీటి విడుదల తగ్గిస్తూ వచ్చారు. నిండుకుండలా ఉన్న జలాశయాన్ని, దిగువకు గలగల పారే నీటి గలగలలను తామెప్పుడూ ఈ స్థాయిలో చూడలేదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# వాడని సిమ్‌కార్డులను తొలగించుకున్నారా?




చెన్నేకొత్తపల్లి: ఇప్పటివరకు సైబర్ మోసగాళ్లు మొబైల్ ఫోన్‌లకు అవాంఛిత లింకులు పంపి నగదు కాజేసిన సంఘటనలు ఉన్నాయి. వినియోగంలోని లేని సిమ్ ద్వారా మోసాలకు పాల్పడిన ఘటన ఇటీవల చెన్నేకొత్తపల్లిలో వెలుగులోకి వచ్చింది. ఈనేపథ్యంలో మీ పేరున ఎన్ని సిమ్‌కార్డులు ఉన్నాయి? వాటిని తెలుసుకోవడం ఎలా? అవసరం లేకుంటే వాటిని తొలగించుకోవడం లేదా డి యాక్టివేట్ చేయడం వంటి విషయాలను దశల వారీగా తెలుసుకుందాం.
మొదట మీ మొబైల్‌లో బ్రౌజర్‌లో 'సంచార్ సాథీ (ఎస్ఏఎన్‌సీహెచ్ఏఆర్ ఎస్ఏఏటీహెచ్ఐ) పోర్టర్'ను సందర్శించి దానిపై క్లిక్ చేయాలి.
అందులో కేంద్ర మంత్రి జ్యోతిరాధిత్యాయ సింధియా, రాష్ట్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఫొటోలు కనిపిస్తాయి. వాటిని పైకి జరిపితే సిటిజన్ సెంట్రిక్ సర్వీసెస్ ఐచ్ఛికాలు కనిపిస్తాయి.
అందులో 'నో మొబైల్ కనెక్షన్స్ ఇన్ యువర్ నేమ్' అనే ఐచ్ఛికం కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేయాలి.
వచ్చిన ఐచ్ఛికాలను కొంచెం పైకి జరిపితే 'పది అంకెల మొబైల్ నంబరు' ఐచ్ఛికం కనిపిస్తుంది. అందులో మీ ఫోన్ నంబరు నమోదు చేయాలి. ఆ నంబర్ మీ ఆధార్ నంబర్‌కు లింక్ అయి ఉండాలి.
తరువాత 'క్యాప్చా' నమోదు చేయాలి.
మీ మొబైల్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. దాన్ని 'ఓటీపీ' అని ఉన్నచోట నమోదు చేయాలి.మీ పేరున నమోదైన మొబైల్ నంబర్లు కనిపిస్తాయి. వాటి పక్కనే 'నాట్ మై నంబర్', 'నాట్ రిక్వైర్డ్' 'రిక్వైర్డ్' అనే ఐచ్ఛికాలు కనిపిస్తాయి.

**అవసరంలేని వాటిపై క్లిక్ చేసి, రిపోర్ట్ చేయాలి**

మీ రిపోర్ట్ ఆధారంగా నంబర్లు డీ యాక్టివేట్, లేదా యాక్టివేట్ అవుతాయి. ఈవిధంగా మీ పేరున ఉన్న మొబైల్ సిమ్ నంబర్లను తెలుసుకుని అవసరం లేని వాటిని సులభంగా తొలగించుకోవచ్చు.
ఎన్ని తీసుకోవచ్చు..సిమ్‌కార్డు కొనుగోలు చేసేందుకు ఆధార్ లింకును కేంద్ర టెలికామ్ రంగ సంస్థ తప్పనిసరి చేసింది. ఒక వ్యక్తి తన ఆధార్‌తో 9 సిమ్‌కార్డులు తీసుకోవచ్చు జమ్ము, కశ్మీర్, అస్సాం, ఈశాన్య రాష్ట్రాల్లో 6 సిమ్ కార్డులు తీసుకోవచ్చనే నిబంధన ఉంది.

# చోటా నాయకుల బడా దందా!!



విశాఖపట్నం: మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) వార్డుల్లో చోటా నాయకులు కొందరు బడా దందాకు తెరలేపారు. అదనపు అంతస్తు ఆరంభించినా, కొత్త నిర్మాణం చేపట్టినా అక్కడ వాలిపోతున్నారు. కూటమి, వైకాపా కార్పొరేటర్ల పేరుతో స్థానిక నేతలు ఆ భవన నిర్మాణదారుల నుంచి డబ్బులు భారీగా గుంజుతున్నారు. చెప్పినంత సమర్పించకపోతే, అక్రమ నిర్మాణాలంటూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ఫిర్యాదులు చేయిస్తూ అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. అక్కడితో ఆగడం లేదు. కొన్ని చోట్ల స్థానిక సచివాలయ, పట్టణ ప్రణాళిక సిబ్బందితో కుమ్మక్కై భవన యజమానులను బెదిరించి జేబులు నింపేసుకుటున్నారు.

**వెంటాడి వేధిస్తూ...**

నగరంలో కంచరపాలెంలో నివాసం ఉంటున్న దుర్గాప్రసాద్ టైల్స్ పనులు చేస్తూ జీవనం చేస్తుంటారు. ఇంటిపై అదనపు అంతస్తు నిర్మిస్తుండగా.. సచివాలయ సిబ్బంది నీ జోలికిరాకుండా ఉండలాంటే రూ.2లక్షలు ఇవ్వాలంటూ కొందరు నాయకులు డిమాండ్ చేశారు. ప్లాన్ అనుమతులు పొంది పైకప్పు వేస్తుండగా అడ్డుకున్నారు. అక్రమ నిర్మాణం అంటూ ఫిర్యాదులు చేయించారు. మనస్తాపంతో సదరు యజమాని ఆత్మహత్యాప్రయత్నం చేయడం నగరంలో కలకలం రేపింది. పేద, మధ్యతరగతి ప్రజలు సొంతింటి కలను నిజం చేసుకునేందుకు అడుగులు వేస్తే... నిబంధనల ఉల్లంఘన, సెట్‌బ్యాక్‌లు వదల్లేదు, అదనపు అంతస్తులకు అనుమతుల్లేవు అంటూ బెదిరించి రక్తం పీల్చే జలగల్లా ముక్కుపిండి డబ్బులు వసూలు చేయడం చర్చనీయాంశమవుతోంది.

**వాళ్లకు చెప్పాలంట:** వార్డుల్లో ఎవరైనా ప్లాన్ అనుమతి పొందినా తమ దృష్టికి రాకుండా నిర్మాణం చేయొద్దని కొందరు కార్పొరేటర్లు, ఎమ్మెల్యేల అనుచరులుగా ఉండే చోటా నాయకులు హుకుం జారీ చేస్తున్నారు. నిర్మాణాన్ని బట్టి రూ. లక్ష నుంచి రూ. 2 లక్షల వరకూ వసూలు చేస్తున్నారు. గోపాలపట్నం, పెందుర్తి, కొమ్మాది, మధురవాడ పరిధిలో ఎక్కువ నిర్మాణాలు జరుగుతుండటంతో అక్కడ కొందరు భారీగా దందా చేస్తున్నారు. గాజువాక పరిధిలో దువ్వాడ, షీలానగర్, అగనంపూడి, జగ్గయ్యపాలెం, కూర్మన్నపాలెం శివారు కాలనీల్లో ఈ తరహా ఘటనలపై ఎక్కువగా ఫిర్యాదులందుతున్నాయి. తూర్పు పరిధిలోని 15, 17, 21, 23వార్డుల్లో నిర్మాణాల వద్ద వసూళ్లలో కూటమి చోటా నాయకుల హడావుడిపై చర్చ సాగుతోంది. 29వ వార్డు, సీతంపేట, 39వ వార్డుల్లో కొందరు చక్రం తిప్పుతున్నారు. విశాఖ ఉత్తరం పరిధిలో 46, 47, 51, 54 వార్డుల్లో ఇదే తరహాలో బెదిరింపులు ఎక్కువ ఉన్నాయి.అంతా కలిసి: సోషల్ మీడియా, సహచట్టం ముసుగులో కొందరు, స్థానిక చోటా నాయకులు సచివాలయాల్లో వార్డు ప్లానింగ్ సెక్రటరీలతో కుమ్మక్కై చక్రం తిప్పుతున్నారు. సచివాలయ సిబ్బంది ఇచ్చే సమాచారంతో క్షేత్రస్థాయిలోకి వెళ్లి నిర్మాణదారుల్ని బెదిరిస్తున్నారు. మాట వినని యాజమానులు చేపడుతున్న నిర్మాణాల్లో నిబంధనల ఉల్లంఘన ఉందంటూ వాట్సప్ గ్రూపుల్లో పెడుతున్నారు. ఇలా వైరల్ చేసిన స్క్రీన్‌షాట్‌లు పట్టుకుని వెళ్లి సచివాలయ వార్డు ప్లానింగ్ కార్యదర్శులు, ఇతర సిబ్బంది కొందరు డబ్బులు వసూలు చేస్తున్నారు.

# శారదా.. ముంచెత్తిన వరద..



అనకాపల్లి : మొంథా తుపాను తీరం దాటింది, వర్షాలు తగ్గుముఖం పట్టాయి. ముప్పు తప్పినట్లేనని అంతా అనుకున్న తరుణంలో పరిస్థితి తారుమారయింది. ఎగువ నుంచి నుంచి వచ్చిన వరదతో ఇటీవల కాలంలో ఎన్నడూలేని విధంగా శారదానది ఉగ్రరూపం దాల్చింది. ఎలమంచిలి నియోజకవర్గంలోని నాలుగు మండలాలను అతలాకుతలం చేసింది. ముఖ్యంగా రాంబిల్లి మండలంపై తీవ్ర ప్రభావం పడింది. ఈ ఒక్క మండలంలోనే రెండు గండ్లు పడ్డాయి. రాంబిల్లి మండలం వై.లోవ వద్ద మేజర్ శారదా నది ఎడమ గట్టుకు సుమారు 30 మీటర్ల వెడల్పున అతిపెద్ద గండి పడింది. ఒక్కసారిగా చుట్టుముట్టిన వరదతో నది పరివాహక గ్రామాలు ఉక్కిరిబిక్కిరి అయ్యాయి. రెవెన్యూ, జాతీయ, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళాలు, పోలీసులు హుటాహుటిన రక్షణ చర్యలు చేపట్టారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో నదులు, వాగులు పోటెత్తి ప్రవహిస్తున్నాయి.
ఎలమంచిలి–గాజువాక రహదారిలో పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. ఈ మార్గంలో నారాయణపురం వద్ద వంతెనపై నుంచి వరదనీరు గురువారం ఉదయం నారాయపురం గ్రామంలోకి ప్రవహించింది.ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ దగ్గరుండి అధికారులు, గ్రామస్థులతో ఇసుక బస్తాలను వేసి వరదనీటిని నియంత్రించారు.
మునగపాక మండల పరిధిలో ఇరువైపులా గట్ల అంచులను తాకుతూ శారదా నది ప్రవహిస్తోంది. ఆవలో నీరు విడిచిపెట్టడంతో కొండకర్ల ఆవ మీదుగా రోలుగెడ్డ ప్రవహిస్తూ ఇటు చూచుకొండ, గణపర్తి, మెలిపాక, యాదగిరిపాలెం గ్రామాలకు ముంచెత్తుతోంది.
చూచుకొండ– గణపర్తి గ్రామాల మధ్య రోలుగెడ్డ వంతెనపై మూడు అడుగుల ఎత్తున వరదనీరు ప్రవహిస్తోంది. రెండుగ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. జగన్నాథపురం– మెలిపాక రోడ్డు పైనుంచి వరదనీరు ప్రవహిస్తోంది.
మైనర్ శారదా నదికి నారాయణపురం వద్ద గట్టుకు గండి పడింది. వరదనీరు మరీ ఎక్కువైతే నారాయణపురం గ్రామంతోపాటు ఎలమంచిలి పురపాలిక పరిధిలో సోమలింగపాలెం, కట్టుపాలెం గ్రామాలకు ముప్పు పొంచి ఉందని స్థానికులు చెబుతున్నారు.
అనకాపల్లి సమీపంలో దొంగలగొడ్డ పొంగింది. దీంతో ప్రజలు పలు వీధులు జలమయం అయ్యాయి. నది పరివాహక ప్రాంతంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.
వెంకుపాలెం – కుంచంగి మధ్య వెదుళ్లగెడ్డ పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి.
రాంబిల్లి మండలం వై.లోవ వద్ద పడిన గండితో రజాల, కుమ్మరాపల్లి, మర్రిపాలెం, కట్టుబోలు, కొప్పుగొండుపాలెం గ్రామాలు పూర్తిగా నీటమునిగాయి. ఇళ్లలోకి వరదనీరు చేరడంతో ప్రజలు భయంతో వణికిపోతున్నారు. ఈ ఒక్క మండలంలోనే సుమారు ఐదు వేల ఎకరాల్లో వరిపంట, 240 ఎకరాల్లో రొయ్యల చెరువులు జలమయం అయ్యాయి. 70 మంది బాధితులను రాంబిల్లి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి అధికారులు తరలించారు. తుపానులు వస్తే శారదానది చివరలో ఉన్న రాంబిల్లి మండలానికి తీవ్రమైన నష్టం జరుగుతుంది. ఈసారి అదే పరిస్థితి పునరావృతమైంది. రోలుగెడ్డ నీటితోపాటు శారదానది నీరు కలిసి పెదయాదగిరి పాలేన్ని పూర్తిగా ముంచేసింది. గ్రామంలో ఐదడుగుల మేర నీరు నిలిచి, 150కు పైగా గృహాల్లోకి నీరు చేరింది.

# నాసిరకం పనులపై గురి

నెల్లూరు : నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగంలో అవినీతి అక్రమాలకు అడ్డూ ఆపూ లేకుండా పోతోంది. అధికారులు, ఉద్యోగులు రావడం.. గుత్తేదారులతో కుమ్మక్కై దండుకోవడం.. వెళ్లిపోవడం షరామామూలుగా మారింది. తాజాగా గత ప్రభుత్వంలో జరిగిన ఇలాంటి వ్యవహారమే మరోసారి వెలుగులోకి వచ్చింది. నెల్లూరు నగరపాలక సంస్థలో నాసిరకం పనులు జరిగాయన్న అంశాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. సంబంధిత అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకునేందుకు విచారణకు ఆదేశించింది. ఆ మేరకు ఉత్తర్వులు జారీ చేయగా.. సంబంధిత ప్రతులు కమిషనర్ వైవో నందన్‌కు చేరాయి.

**నలుగురిపై విచారణ**

కార్పొరేషన్ పరిధిలో ప్రత్యేక అభివృద్ధి నిధి(ఎస్‌డీఎఫ్) పథకం కింద సిమెంట్ రోడ్లు, కాలువలు, కల్వర్టులతో పాటు వివిధ పనులు చేపట్టారు. అవన్నీ నాసిరకంగా జరిగాయని విమర్శలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న నలుగురు అధికారులపై విచారణకు ఏపీ టిడ్కో చీఫ్ ఇంజినీరు కె.ఎస్.రామమూర్తిని విచారణాధికారిగా నియమించింది. ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఎ.శేషగిరిరావు,



డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఎ.శ్రీనివాసరావు, అప్పటి అసిస్టెంట్ ఇంజినీర్లు ఎస్.కె.ఖాదర్‌మస్తాన్, షేక్ ఫాజిల్‌పై మూడు నెలల్లో విచారణ పూర్తి చేసి నివేదిక అందించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ ప్రక్రియను ప్రభుత్వం తరఫున ముందుకు తీసుకువెళ్లేందుకు నెల్లూరు పబ్లిక్ హెల్త్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీరును ప్రెజెంటింగ్ అధికారిగా నియమించింది. ప్రభుత్వం తీవ్రంగా పరిగణించిన నేపథ్యంలో బాధ్యులపై చర్యలు తప్పవన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ?
దీనిపై కమిషనర్ వైవో నందన్ మాట్లాడుతూ.. ఆ ఎస్‌డీఎఫ్ పనులు గత ప్రభుత్వంలో జరిగాయి. ప్రభుత్వం వీటిపై విచారణకు ఆదేశించిన విషయం వాస్తవమే. పూర్తి విచారణ అనంతరం ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాల మేరకు ముందుకు సాగుతామని అన్నారు.

# రూపుమారె.. సౌకర్యాలు సమకూరె

కనిగిరి : పేదింటి విద్యార్థులు వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటారు. వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా కనీస మౌలిక సౌకర్యాలు కల్పించాలి. కానీ గత వైకాపా పాలనలో పట్టించుకునే వారు లేక బాల బాలికల వసతి గృహాలు అధ్వానంగా ఉండేవి.. అరకొర వసతులతో అసౌకర్యాలతో విద్యార్థులు సతమతమయ్యేవారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రత్యేకంగా శిథిలావస్థకు చేరిన వాటి ఆధునికీకరణకు ప్రత్యేకంగా నిధులు కేటాయించి మరమ్మతులు చేయించడంతో అన్ని హంగులతో కార్పొరేట్ స్థాయిని మించిపోయాయి. వీటిని చూసి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.
బాగుపడిన 28 సాంఘిక సంక్షేమ వసతి గృహాలు..
జిల్లాలో 81 ఎస్సీ బాల, బాలిక వసతి గృహాలున్నాయి.



వీటిలో ప్రైవేటు భవనాల్లో 36, సొంత భవనాల్లో 45 నడుస్తున్నాయి. వీటిలో 28 సొంత భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. బాత్‌రూం డోర్స్ సరిగ్గా లేవు, ఫ్యాను, తలుపులు, కిటికీలు, విద్యుత్, నీటి సౌకర్యం సరిగ్గా లేక విద్యార్థులు ఉండాలంటే ఇబ్బంది పడేవారు. జిల్లాలో శిథిలావస్థకు చేరిన భవనాల ఆధునికీకరణకు రూ.12.50 కోట్లు మంజూరు చేశారు. వసతి గృహాల్లో అన్ని రకాల వసతులు కల్పించడంతో పాటు మరమ్మతులు చేయడంతో అవికాస్త అందంగా కన్పిస్తున్నాయి. విద్యార్థుల సంఖ్య కూడా పెరిగింది. ఈ విషయమై సోషల్ వెల్ఫేర్ డిడి.ఎన్.లక్ష్మానాయక్ వివరణ కోరగా జిల్లా వ్యాప్తంగా శిథిలావస్థకు చేరిన గృహాల మరమ్మత్తులు చేయించామనీ కార్పొరేట్ స్థాయిలో ఉన్నాయనీ తెలిపారు. ఫలితంగా ఈ ఏడాది విద్యార్థులు సంఖ్య కూడా పెరిగిందని తెలిపారు.

# ఈ– పంట.. ఇక్కట్లేనంట!

నెల్లూరు : గత ప్రభుత్వం ఈ–పంట నమోదుపై నిర్లక్ష్యం చేయడంతో జిల్లాలో వ్యవసాయ యంత్ర పరికరాల రాయితీలు, పంట నష్టపరిహారం, బీమా అందక రైతులు నష్టపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ–పంట నమోదుపై ప్రత్యేక దృష్టి సారించింది. అయితే ఇచ్చిన గడువు పూర్తయినా లక్ష్యాలను పూర్తి చేయలేని స్థితిలో వ్యవసాయాధికారులు ఉన్నారు. జిల్లాలో 3,36,784 ఎకరాల్లో ఈ–పంట నమోదు చేయాలన్నది వ్యవసాయ శాఖ లక్ష్యం. జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో ఆగస్టు 17వ తేదీ నుంచి నమోదు కార్యక్రమం మొదలైంది. రెండు నెలలకు పైగా గడిచినా ఇప్పటివరకు నమోదు చేసింది 2,82,376 ఎకరాల్లోనే.. పది రోజులు గడువు పెంచినా లక్ష్యం చేరుకోలేక పోయారు. జిల్లాలోని లక్ష్యాలు చేరుకోవడంలో బాగా వెనుకబడిన నియోజకవర్గాల్లో ఉదయగిరి, కావలి, కందుకూరు ఉన్నాయి. అక్కడి అధికారుల నిర్లక్ష్యం ఉందని రైతులు ఆరోపిస్తున్నారు.
ఈనెల 30తో నమోదు కార్యక్రమం పూర్తయింది. సాధ్యమైనంత వరకు ఎక్కువమందిని చేర్చాం. గడువు పొడిగింపుపై ప్రభుత్వం నుంచి సమాచారం రాలేదని వ్యవసాయశాఖ జేడీ సత్యవాణి తెలిపారు.
రబీలో సమస్యలేఈ– పంట నమోదు చేసుకోవడం వల్ల రైతులు ధాన్యం అమ్ముకోవచ్చు ప్రభుత్వం నుంచి వచ్చే వివిధ రకాల రాయితీలకు అర్హులు అవుతారు. నమోదు చేసుకోక పోతే రబీ సీజన్‌లో రైతులకు ఇబ్బందులు తప్పవు. అధికారులు స్పందించి గడువు పెంచాలని అన్నదాతలు కోరుతున్నారు.

# 'వక్క'.. ఉపాధి పక్కా

అమరాపురం : వక్క పంట.. రైతులకు ఆదాయాన్ని ఇస్తూనే మహిళా కూలీలకు ఉపాధి కల్పిస్తోంది. మడకశిర నియోజకవర్గంలో వక్క సాగుపై దాదాపు 4,200 మంది రైతులు ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఏటా ఆగస్టు నుంచి ఫిబ్రవరి వరకు ఈ పంట ద్వారా పురుష, మహిళా కూలీలకు చేతి నిండా పని దొరుకుతోంది. 4 వేల మంది మహిళా కూలీలు పనులు చేసుకుంటూ స్వగ్రామంలోనే ఉపాధి పొందుతున్నారు. ఈ ప్రాంతంలో ఇతర పనులకు వెళ్తే రోజుకు రూ.250 కూలి ఇస్తారు. అదే వక్క పనులకు వెళితే రూ.350 నుంచి రూ.400 వరకు కూలి అందుతుంది. ఏడు నెలల పాటు ప్రతి రోజూ ఏదో ఒక పని ఉంటుంది. సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి ముగిసే వరకు కూలీలకు చెల్లించే సొమ్ము రూ.20 కోట్ల వరకు ఉంటుందని రైతులు చెబుతున్నారు. కూలి ద్వారా వచ్చే సొమ్ముతో మహిళలు తమ పిల్లలను చదివించుకుంటూనే ఆర్థికంగా ఎదుగుతున్నారు.

**కుమారుడిని వైద్య విద్య చదివిస్తూ..**

అమరాపురం మండలం హేమావతి గ్రామానికి చెందిన అనసూయమ్మకు ఇద్దరు కుమారులు. ఇరవై ఏళ్ల కిందట భర్త చనిపోవడంతో కుటుంబ బాధ్యత భుజాన వేసుకున్నారు. పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని సంకల్పించారు. గౌడనకుంటలో పుట్టింటికి వచ్చి అన్న ఇంట్లో ఉంటూ కూలీ పనులకు వెళ్తున్నారు. వచ్చిన డబ్బుతో పెద్ద కుమారుడిని ఎంబీఏ, చిన్న కుమారుడిని ఎంబీబీఎస్ చదివిస్తున్నారు.

**కుటుంబానికి ఆసరా**

అమరాపురం మండలం గౌడనకుంట భాగ్యమ్మది పేద కుటుంబం. ప్రభుత్వ ఇల్లు తప్పా సెంటు భూమి లేదు. ఎనిమిదేళ్ల కిందట భర్త శ్రీనివాస్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇంట్లోనే ఉంటున్నాడు. అప్పటి నుంచి ఈమె కుటుంబ పోషణ చూసుకుంటున్నారు. వక్క పని చేయగా వచ్చే కూలి డబ్బులతో తనకున్న ఇద్దరు కుమార్తెలను బాగా చదివించారు. ఒక కుమార్తె బీఫార్మసి పూర్తి చేసి బెంగళూరులో ఉద్యోగం చేస్తోంది. చిన్న కుమార్తె బీటెక్ ఇంజినీరింగ్ చదువుతోంది. వక్క పంట తమ అభ్యున్నతికి ఎంతగానో దోహదపడుతుందని భాగ్యమ్మ చెబుతున్నారు.

# ఈతరం మెచ్చేలా నాయకత్వం!

విశాఖపట్నం: రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా విశాఖకు కేటాయించిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) కళాశాల తక్కువ వ్యవధిలోనే గుర్తింపు సంపాదించుకుంది. ప్రారంభించిన పదేళ్లలోనే ఆవిష్కరణలు, ఆంత్రప్రెన్యూర్‌షిప్, నాయకత్వ అంశాల్లో ఖ్యాతి పొందింది. విద్యార్థులు మంచి అవకాశాలు పొందుతున్నారు.ప్రపంచంలోని వివిధ ప్రముఖ విద్యా సంస్థల్లో శిక్షణ పొందిన ప్రొఫెసర్లు, నిపుణులు ఇక్కడ బోధన సాగిస్తున్నారు. తర్వాతి తరం వ్యాపారవేత్తలు, నాయకులను తీర్చిదిద్దుతున్న ఐఐఎం గురించి కేంద్ర విద్యాశాఖ ఎక్స్ (ట్విటర్) వేదికగా ప్రస్తావించింది.

**పూర్వ విద్యార్థుల సహకారం..:** ప్రస్తుత విద్యార్థులకు, అంకురాలకు పూర్వ విద్యార్థులు సైతం సహకరిస్తున్నారు. దాదాపు 3,000 మంది పూర్వ విద్యార్థులు ఇందుకోసం ఒక నెట్‌వర్క్‌గా ఏర్పడ్డారు.

ఐఐఎంలో విద్యార్థులకు మెరుగైన బోధన, ఇతర సహకారం అందించేందుకు ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ సంస్థలతో ఒప్పందాలు




చేసుకుంది. వాటిలో కొన్ని..

మోనాస్ విశ్వవిద్యాలయం (ఆస్ట్రేలియా)

టెడ్ రోజర్స్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్, టొరంటో మెట్రోపాలిటన్ యూనివర్సిటీ (కెనడా)

యూనివర్సిటీ ఆఫ్ ఆగ్డర్ (నార్వే)

ముర్రే స్టేట్ యూనివర్సిటీ (అమెరికా)

కెంట్ బిజినెస్ స్కూల్, యూనివర్సిటీ ఆఫ్ కెంట్ (లండన్)

మోనాస్ యూనివర్సిటీ (మలేసియా)

అంకురాలకు ప్రోత్సాహం..

అంకుర సంస్థలకు మార్గనిర్దేశం చేసేందుకు ఐఐఎంవీ ఫీల్డ్ సహకరిస్తోంది. లాజిస్టిక్స్, మెరైన్, విద్య, పర్యాటకం తదితర రంగాల్లో ఆవిష్కరణలను ప్రోత్సహిస్తోంది. అంకురాలకు నిధులు సమకూర్చేందుకు విద్యార్థులే ఒక బృందంగా ఏర్పడ్డారు.

అమలు చేస్తున్న కార్యక్రమాలు: ఫీల్డ్ ఉమెన్ స్టార్టప్ ప్రోగ్రాం, నిధి, సూపర్స్, వీ2వీ (విద్యార్థి టు వ్యవసాయం) తదితరాలు.

2018:ఐఐఎంవీ ఫీల్డ్ ఏర్పాటైన సంవత్సరం

సహకారం పొందిన అంకురాలు:180కు పైగా

అందులో మహిళలకు చెందినవి: 130కు పైగా

# తుపాను గాయం.. సత్వర సాయం

నక్కపల్లి: మొంథా తుపాను ప్రభావానికి గురైన ప్రాంతాల్లో ప్రజలకు ప్రభుత్వం ప్రకటించిన సాయం ద్వారా జిల్లాలో వేలాది మందికి లబ్ధి జరగనుంది. ఇందులో మత్స్యకారులు అధికంగా అర్హత పొందనున్నారు. దీనికి సంబంధించి అధికార యంత్రాంగం వివరాలను నమోదు చేసే పనిలో ఉంది. వర్షాలతో మత్స్యకారులు సముద్రంలో వేటకు దాదాపు అయిదు రోజులుగా వెళ్లలేదు. మరికొన్ని రోజులు కూడా వేటకు దూరంగానే ఉండనున్నారు. జలాశయాల్లోనూ వేట నిలిచిపోయింది. దీంతోపాటు చేనేత కార్మికులు చేతివృత్తికి దూరమయ్యారు. చాలాచోట్ల మగ్గాలు తడిసిపోగా, గుంతల్లో నీరు చేరింది. వీరందరికీ ఉపశమనం కలిగించేలా ప్రభుత్వం సాయం అందించాలని నిర్ణయించింది.

మత్స్యకార కుటుంబాలకు 50 కేజీల బియ్యం, కందిపప్పు, పంచదార, ఉల్లిపాయలు, బంగాళదుంపలు కేజీ చొప్పున, లీటరు మంచినూనె ఇస్తుండగా.. మిగిలిన వర్గాలకు ఈ నిత్యావసర సరకులతోపాటు, 25 కేజీల బియ్యం ఇవ్వనున్నారు. జిల్లా పరిధిలో పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, రాంబిల్లి, అచ్యుతాపురం, పరవాడ మండలాల్లోని 28 గ్రామాల పరిధిలో వేలాది మత్స్యకార కుటుంబాలు ఉన్నాయి. అదేవిధంగా తాండవ, రైవాడ జలాశయాల ద్వారా వందలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి.

ఇక చేనేత కార్మిక కుటుంబాలు సుమారు 250కిపైగా ఉన్నాయి. వీరికీ మత్స్యకారులతో సమానంగానే ఇవ్వనున్నారు. జిల్లాలో ఈ వర్గానికి సంబంధించే దాదాపు 30 వేల కుటుంబాలు సాయం పొందనున్నాయి. ప్రభుత్వ ఆదేశాలతో లబ్ధిదారుల జాబితాను రూపొందించే పనిలో అధికారులు, ఉద్యోగులు నిమగ్నమయ్యారు.

పునరావాస కేంద్రాల్లో ఉన్న వారికి కుటుంబంలో సభ్యుల ఆధారంగా కనీసం రూ. వెయ్యి, గరిష్ఠంగా రూ. 3 వేలు ఇవ్వాలని ఆదేశించింది. ఈ సాయం అదనం కానుంది. దీంతో ప్రస్తుత పరిస్థితుల్లో వరద బాధితులకు అందే సాయం తోడ్పాటు కానుంది.

# నాలుగేళ్లుగా నరక ప్రయాణం



ముదిగుబ్బ : ముదిగుబ్బ, కదిరి సరిహద్దులోని మద్దిలేరు వాగు ఉప్పొంగితే 25 గ్రామాలు.. 30 వేల మంది ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. 2021లో నివర్ తుపాను దెబ్బకు మద్దిలేరువాగు ఉద్ధృతంగా ప్రవహించడంతో మలకవేముల క్రాస్ నుంచి రాచువారిపల్లి గ్రామాల మధ్య ఉన్న కల్వర్టు కొట్టుకుపోయింది. దీంతో ముదిగుబ్బ, తలుపుల, కదిరి ప్రాంతవాసులు ఈ మార్గంలో నరకయాతన పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. నల్లమాడ నుంచి తలుపుల మీదుగా పులివెందుల వైపు వెళ్లాలన్నా, యల్లనూరు, పుట్లూరు నుంచి కదిరికి రావాలన్నా ఈ మార్గం కీలకంగా మారింది. దీనికితోడు నూతనంగా నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే, 42, 342వ జాతీయ రహదారులకు ఈ దారి అనుసంధానంగా మారింది. ప్రయాణికుల సంఖ్య పెరిగినా వర్షాకాలంలో తాత్కాలిక కల్వర్టుపై ప్రయాణం చేయలేక పది కిలోమీటర్లు చుట్టేసుకుని మెయిన్‌రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు.

**తాత్కాలిక పనులతో సరి..**

కల్వర్టు కొట్టుకుపోయిన తర్వాత ఏటా తాత్కాలికంగా రాళ్లు, మట్టి వేసి ఏర్పాటు చేస్తున్నారు. వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తే మళ్లీ కొట్టుకుపోతోంది. కల్వర్టు మీద 3 నుంచి 4 అడుగుల ఎత్తులో నీరు ప్రవహిస్తుండటంతో హైలెవల్ వంతెన నిర్మాణానికి అధికారులు 2021 నుంచి ప్రతిపాదిస్తున్నారు. గత ప్రభుత్వంలో నిధులు మంజూరు కాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మళ్లీ రూ.8 కోట్లతో ప్రతిపాదించారు. నేటికీ నిధులు రాకపోవడంతో వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

**నిధులు మంజూరైతే పనులు చేపడతాం**

– రాజేంద్ర, పీఆర్ జేఈ, కదిరి

మద్దిలేరు వాగుపై లోలెవల్‌లో ఉన్న కల్వర్టు తొలగించి హైలెవల్ వంతెన నిర్మిస్తే వాగు పొంగినా రాకపోకలకు ఇబ్బంది ఉండదు. వంతెన నిర్మాణానికి ఏటా ప్రతిపాదనలు పంపుతున్నాం. నిధులు మంజూరైతే వెంటనే పనులు చేపడతాం.

# 'ఊట'.. ఎన్నటికి ఊరట



పెద్దపప్పూరు : నిత్యం అష్టకష్టాలు పడుతున్నా అధికారులు ఆదుకోవడం లేదు. ఏడాదికి మూడు పంటలు పండించే పొలాలు ఊట జలం కారణంగా పనికిరాకుండా పోయాయి. చివరికి శ్మశానవాటికది అదే తీరు. బిక్కుబిక్కుమంటూ గడిపే దయనీయ దుస్థితి. ఇన్ని కష్టాలు పడుతున్నా పట్టించుకునేవారు కరవయ్యారు. ఈ పరిస్థితిని పదేళ్లుగా పెద్దపప్పూరు మండలంలోని పెద్దయక్కలూరు వాసులు ఎదుర్కొంటున్నారు. చాగల్లు ప్రాజెక్టు సమీపాన ఉన్న గ్రామంలో 500కు పైగా ఇళ్లు ఉండగా దాదాపు 3 వేల మంది జనాభా నివసిస్తున్నారు.

**200 ఎకరాల్లో..**బోరు బావుల్లో నీరు ఉబికి వస్తుండటం.. చాగల్లు ప్రాజెక్టు కింద పొలాల్లో ఊట రాకతో పంటలు సాగు చేసే పరిస్థితి లేదు. దాదాపు 200 ఎకరాలు నిరుపయోగంగా మారాయి. ఉన్నతాధికారులకు సమస్యను విన్నవించినా ప్రయోజనం లేదని గ్రామస్థులు వాపోతున్నారు.

**ప్రతిపాదన దశలోనే..** చాగల్లు ఆనకట్ట కింద ఊటతో పాటు ఎడమ కాలువ నుంచి నీరు గ్రామాన్ని చుట్టుముడుతోంది. గతంలో కేంద్ర ప్రభుత్వ అధికారుల బృందం సైతం గ్రామాన్ని పరిశీలించింది. ఆనకట్ట వద్ద ఊట బావులు నిర్మించి.. అనుసంధానం చేయడం ద్వారా వచ్చే నీటిని పెన్నా నదికిలోకి పంపేలా చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదించింది. ఇది కార్యరూపం దాల్చలేదు.

**దినదిన గండంగా..**

గత వైకాపా ప్రభుత్వంలో కలెక్టర్లు పెద్దయక్కలూరు గ్రామాన్ని పరిశీలించినా పరిస్థితిలో ఎలాంటి మార్పు రాలేదు. ఎస్సీ కాలనీలో ఇళ్లు ఎప్పుడు కూలుతాయో తెలియక భయాందోళన మధ్య గడుపుతున్నారు. మరుగుదొడ్ల గుంతలు సైతం ఊటతో నిండిపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయి. చివరి మజిలీకి సైతం ఇబ్బందికరంగా మారింది.

**పునరావాసం కల్పించాలి**

అపరిశుభ్రత కారణంగా అనారోగ్యం బారిన పడాల్సి వస్తోంది. విషపురుగులు సంచరిస్తుండటంతో నిత్యం భయాందోళనతో గడుపుతున్నాం. పంటలు వేసుకోలేని పరిస్థితి. అధికారులు పునరావాసం కల్పించి ఆదుకోవాలి.

పెద్దారెడ్డి, రైతు **ప్రభుత్వానికి నివేదించాం**

క్షేత్ర స్థాయిలో పరిశీలించాం. ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. పంటలు, ఇళ్లు దెబ్బతిన్న మాట వాస్తవమే. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు చర్యలు చేపడతాం.సుధాకర్, హెచ్ఎల్సీ, ఎస్ఈ

# 'కల్లు' అప్పగించి చూస్తున్నారు



పుట్టపర్తి: జిల్లాలో కొందరు కల్లు వ్యాపారులు పేదల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. వారి ఆగడాలను అడ్డుకోవాల్సిన అధికారులు వంతపాడుతున్నారు. నివారించాల్సిన కొందరు నాయకులు అండగా నిలుస్తున్నారు. కల్లు తాగిన హిందూపురం, పరిగి మండలాలకు చెందిన పేదలు అస్వస్థతకు గురవుతుండటమే ఇందుకు నిదర్శనం. మతిస్థిమితం కోల్పోయి వింతగా ప్రవరిస్తుండటంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రులకు తరలిస్తున్నారు.

**ఇష్టారాజ్యంగా..**

హిందూపురం పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల పరిధిలోని పలు గ్రామాల్లో రసాయనాలు కలిపిన కల్లు విక్రయాలు జరుగుతున్నాయి. చౌళూరుకు సరిహద్దున ఉన్న కర్ణాటక గ్రామాల నుంచి సైతం వస్తున్నారు. రెండు లీటర్ల సీసాలో కల్లును నింపి అమ్ముతున్నారు. ఒక్కో సీసా ధర రూ.45 పలుకుతోంది.

ఎక్సైజ్ అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. పుట్టపర్తి ప్రాంతంలో ఉన్న ఓ అధికారి కల్లు దుకాణాల నిర్వహణలో చక్రం తిప్పుతున్నారు. హిందూపురం పరిధిలోని ఓ అధికారి నెలనెలా సొసైటీల నుంచి వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. 150 పైగా సొసైటీలుండగా వాటికి అనుబంధంగా బి లైసెన్సు కలిగినవి వందల సంఖ్యలో ఉన్నాయి.

**సొసైటీలను ఆధీనంలోకి తీసుకొని..**

హిందూపురానికి చెందిన ఓ వ్యాపారి కొన్నేళ్లుగా గీత సొసైటీలను తన ఆధీనంలోకి తీసుకున్నారు. హైదరాబాద్, మహారాష్ట్ర నుంచి డైజోఫాం, హెచ్‌ను గుట్టుచట్టుప్పుడు కాకుండా దిగుమతి చేసుకుని తన ఫాంహౌస్‌లో ఈత కల్లులో కలిపిస్తున్నారు.

**ఈత వనాలెక్కడ?**

వైద్యుల నుంచి అధికారులు, నాయకులు.. అందరూ చెప్పే మాట ఒక్కటే.. కల్తీ కల్లు కాదని. కానీ డిమాండుకు అనుగుణంగా స్వచ్ఛమైన కల్లు తయారు చేయాలంటే వందలాది ఈత చెట్లు అవసరం. వాటి నుంచి వచ్చే స్వచ్ఛమైన కల్లును సేకరించి లైసెన్సు పొందిన దుకాణాల్లో విక్రయాలు చేపట్టాల్సి ఉంది.

చిలమత్తూరు, గోరంట్ల మండలాల్లో ఈతవనాలు ఉన్నాయి. వాటిని అద్దెకు తీసుకున్న కల్లుగీత సొసైటీల నిర్వాహకులు.. చెట్ల నుంచి కల్లును సేకరించి విక్రయించాల్సి ఉంది. వచ్చే సరకు డిమాండుకు సరిపడా లేదన్నది బహిరంగ రహస్యమే.

తగిన ఉత్పత్తి లేనప్పుడు అందరికీ.. అన్నిచోట్ల.. ఎప్పుడు కావాలంటే అప్పుడు చౌకగా ఎలా దొరుకుతుందన్న ప్రశ్నకు సమాధానం ఎవ్వరూ చెప్పడం లేదు.

ఈత వనాల నుంచి అరకొరగా వచ్చే కల్లును సేకరించి అందులో డైజోఫాం, హెచ్ తదితర రసాయనాలతోపాటు తీపి కోసం(డబుల్ డెక్కర్) చాకరిన్, చక్కెర, తెలుపు కోసం మైదా కలిపి పేద ప్రజలకు విక్రయిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

**కల్తీకల్లు ఎక్కడా లేదు..**

జిల్లాలో కల్తీ కల్లు, మద్యం ఎక్కడా లేదు. మద్యం మానుకోవడానికి ప్రయత్నించినప్పుడు వచ్చే మానసిక సమస్యలతో ఆసుపత్రులకు వస్తున్నట్లు హిందూపురం వైద్యులు చెప్పారు. మా సిబ్బంది నిరంతరం నిఘా పెడుతోంది. హిందూపురంలో జరిగిన ఘటనకు సంబంధించి కల్లు నమూనాలు సేకరించాం. వాటిని ల్యాబ్‌కు పంపిస్తాం. గోవిందనాయక్, ఎక్సైజ్, ప్రొహిబిషన్ జిల్లా అధికారి

# నాడు- నేడు.. అవస్థలు చూడు!

తిరుపతి : ప్రభుత్వ బడులను కార్పొరేట్ పాఠశాలల తరహాలో తీర్చిదిద్దుతామని.. వైకాపా ప్రభుత్వం ఆర్భాటం చేసింది. రెండు జిల్లాల్లో తొలి విడతలో కొన్నింటిని పూర్తి చేయగా.. రెండో, మూడో దశలో సరిగా నిధులు ఇవ్వకుండా చేతులెత్తేసింది. వీటిని పూర్తి చేస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటికైనా నిధులిస్తే వచ్చే విద్యా సంవత్సరం ఆరంభానికైనా అవస్థలు తప్పుతాయి.

**ఏమేం చేస్తానన్నారంటే..**

అదనపు తరగతి గదులు, ఆర్వో ప్లాంట్లు, మరుగుదొడ్లు, ప్రహరీ, విద్యుదీకరణ, ఇతర వసతుల కోసం నాడు- నేడు రెండో విడత పనులకు 2021 ఆగస్టులో శ్రీకారం చుట్టారు.వైకాపా ప్రభుత్వం పూర్తి చేయలేకపోయింది. కుప్పం, సత్యవేడు నియోజకవర్గాల్లో ఒకేచోట రెండు తరగతుల పిల్లలను ఉంచుతున్నారు.



**ఉన్నవాటినైనా వినియోగిస్తే..**

కొన్ని పాఠశాలల ఖాతాల్లో రూ.2-10 లక్షల వరకు నిధులున్నాయి. గతంలో అవకతవకలు, నాణ్యతను పరిశీలించాలని ఈ ప్రభుత్వం పనులు నిలపాలని ఆదేశాలిచ్చింది. ఇప్పుడైనా వాటిని వినియోగించడానికి అనుమతిస్తే 90 శాతం పనులు పూర్తయిన చోట మిగతావి చేయడానికి ఆస్కారం ఉంటుంది.

**60 శాతం పూర్తయిన వాటికైనా..**

ఈ ప్రభుత్వం 'మన బడి- మన భవిష్యత్తు' పేరిట వసతులు కల్పిస్తామని చెప్పింది. నిధుల కొరతతో ప్రస్తుతానికి 60 శాతం నిర్మాణాలు జరిగిన చోట పనులు ప్రారంభించాలని పేర్కొంది.

ఇది పిచ్చాటూరు మండలం సిద్ధిరాజుకండ్రిగ ఉన్నత పాఠశాల. రెండు తరగతి గదులు, రెండు మరుగుదొడ్ల నిర్మాణానికి గతంలో రూ.37 లక్షలు మంజూరు చేశారు. మరో రూ.12 లక్షలు విడుదల చేస్తే పనులు కొలిక్కి వస్తాయి. విద్యార్థుల అవస్థలు తీరుతాయి.

రెండో విడతలో ఎంపికైన పాఠశాలలు: 1,692

అంచనా వ్యయం: రూ.819.55

కోట్లు చేసిన ఖర్చు: రూ.391.43 కోట్లు

# 3 వేల ఓట్లు.. లక్ష మందికి పాట్లు!

ఒంగోలు : జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరంలో నాలుగు దశాబ్దాల కిందట వంద మీటర్ల వెడల్పు ఉన్న పోతురాజు కాలువ ఆక్రమణలతో నేడు కేవలం 25 మీటర్లతో బక్కబిక్కిపోయింది. ఏళ్లుగా నాయకులు ఆక్రమణలను పెంచిపోషించడంతో వానొస్తే నగరంలో అడుగుపెట్టలేని పరిస్థితి నెలకొంది. ఆక్రమణల తొలగింపుపై కనీసం ఆలోచన కూడా చేయకుండా మితిమీరిన రాజకీయ జోక్యం నగరానికి పెనుముప్పుగా మారింది. ఇప్పటికైనా సమస్య శాశ్వత పరిష్కారానికి చొరవ తీసుకోవాల్సిన అవసరాన్ని ఏటా చోటుచేసుకుంటున్న ముంపు భయం గుర్తు చేస్తోంది.ఒంగోలు నగరంలోని ముంపు ప్రాంతాల్లో బుధవారం మంత్రి డోలా శ్రీబాలావీరాంజనేయస్వామి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పర్యటించిన సమయంలో పోతు రాజు కాలువలో పూడిక తీయడంతో ముంపు సమస్య చాలా వరకు తగ్గించామని, లేకుంటే విజయవాడలో బుడమేరు మాదిరిగా రెండు రోజులపాటు నగరం నీట మునిగేదని నగర పాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు వివరించారు. ఈ ఏడాది పూడిక తీసినా వచ్చే ఏడాది సమస్య తలెత్తే అవకాశం ఉండడంతో శాశ్వత పరిష్కారంపై దృష్టిసారించాల్సి ఉంది. పేర్నమిట్ట నుంచి కొప్పోలు వంతెన వరకు నగరంలో పది కిలోమీటర్ల మేర పోతురాజు కాలువ విస్తరించి ఉంది. కాలువ కట్టకు రెండు వైపులా భారీ భవనాలు నిర్మించారు. పది, ఇరవై కాదు.. ఏకంగా 700పైగా శాశ్వత నిర్మాణాలు చేపట్టారు. కొన్నిచోట్ల ప్రార్థనా మందిరాలు సైతం ఉన్నాయి. ఒక్కో ఇంట్లో నాలుగైదు ఓట్లు వేసుకున్నా 3 వేల మంది ఓటర్లు ఉండడంతో ఆక్రమణల తొలగింపుపై



ప్రజాప్రతినిధులు, అధికారులు కనీస ఆలోచన చేయడంలేదు.


సమస్యకు శాశ్వత పరిష్కారంగా తక్షణం కాలువపై ఆక్రమణదారులు ఎంతమంది ఉన్నారో గుర్తించి వారందరికి ప్రత్యామ్నాయంగా స్థలాలు చూపి వారిని ఖాళీ చేయించాల్సి ఉంది. కాలువ వెడల్పు చేస్తేనే వరదలు వచ్చినప్పుడు నీరు పారేందుకు వీలు ఉంటుంది. లక్ష మంది నగర ప్రజల భవితవ్యం ముడిపడి ఉన్నందున ప్రజాప్రతినిధులు, అధికారులు సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది. మంగళవారం అర్ధరాత్రి వచ్చిన మాదిరి చీకటి మాటున వరద నీరు చుట్టుముట్టేస్తే ప్రజల ప్రాణాలకు ముప్పు పొంచి ఉన్నట్లే.

**ఇరుకైతే నీరు పారేదెలా?**

ఎస్ఎన్‌పాడు, పేర్నమిట్ట చెరువులు పొంగడంతో ఆ నీరు పోతురాజు కాలువలోకి భారీగా చేరింది. ఓవైపు పైనుంచి వచ్చే వరద నీరు, స్థానికంగా కురిసిన వర్షపు నీరు వెరసి నగరాన్ని ముంచేసింది. కాలువ ఇరుకుగా మారడంతో కట్టకిరువైపులా ఉన్న 40 కాలనీల్లో ప్రజలకు వానాకాలం కష్టాలు తప్పడం లేదు. వంతెనల కింద చెత్త ఇరుక్కుపోవ డంతో వంతెనలపై నుంచి వరదనీరు పారింది. వీటి వద్ద చెత్త తొలగింపునకు నగరపాలక సిబ్బంది శ్రమిస్తున్నారు.

# 39లోనూ తరగని అందం.. 'మన్మథుడు' బ్యూటీ గ్లామర్ ట్రీట్!

'మన్మథుడు' సినిమాలో నాగార్జున సరసన మహేశ్వరిగా నటించి, తన క్యూట్ లుక్స్‌తో తెలుగు ప్రేక్షకులను మాయ చేశారు అన్షు అంబానీ. ఆ ఒక్క సినిమాతోనే టాలీవుడ్‌లో చెరగని ముద్ర వేసుకున్నారు. తన అమాయకమైన నవ్వు, అభినయంతో కుర్రాళ్ళ హృదయాలను కొల్లగొట్టారు. ఇక లేటెస్ట్ గా అన్షు షేర్ చేసిన ఫొటోలు చూసి ఫ్యాన్స్ ఆశ్చర్యపోతున్నారు. ప్రస్తుతం 39 ఏళ్ల వయసులో ఉన్నప్పటికీ, ఆమె అందం ఏమాత్రం తగ్గలేదు. లేత పసుపు రంగు డిజైనర్ శారీలో, స్ట్రాప్‌లెస్ బ్లౌజ్ ధరించి ఎంతో గ్లామరస్‌గా, అదే సమయంలో క్యూట్‌గా కనిపిస్తున్నారు. ఆమె గ్రేస్ చూస్తుంటే వయసు



జస్ట్ ఒక నెంబర్ అనిపిస్తోంది. 'మన్మథుడు' తర్వాత ప్రభాస్ సరసన 'రాఘవేంద్ర' చిత్రంలో మెరిశారు. కెరీర్ మంచి పీక్ స్టేజ్?లో ఉన్నప్పుడే వ్యక్తిగత కారణాలతో సినిమాలకు దూరమయ్యారు. లండన్?లో స్థిరపడి, ఫ్యాషన్ డిజైనర్‌గా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఇన్ని సంవత్సరాలైనా ఆమెలోని ఆకర్షణ మాత్రం అలాగే ఉండటం విశేషం. ఇటీవల అమ్మడు సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేశారు. ఎంత బిజీగా ఉన్నా, సోషల్ మీడియా ద్వారా మాత్రం ఫ్యాన్స్‌కు ఎప్పుడూ దగ్గరగానే ఉంటున్నారు. తన ఫ్యాషన్ లేబుల్?కు సంబంధించిన డిజైన్స్‌తో పాటు, అప్పుడప్పుడు ఇలాంటి బ్యూటిఫుల్ ఫొటోషూట్స్ పోస్ట్ చేస్తూ అలరిస్తున్నారు. ఆమె మళ్ళీ స్పెషల్ రోల్స్ చేస్తే బాగుంటుందని చాలా మంది అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. సాధారణంగా హీరోయిన్లు సినిమాలకు దూరమైతే గ్లామర్ తగ్గుతుంది, కానీ అన్షు విషయంలో అది రివర్స్ అయింది. 39 ఏళ్లలోనూ 20 ఏళ్ల అమ్మాయిలా మెరిసిపోతూ, నేటితరం హీరోయిన్లకు కూడా గట్టి పోటీ ఇస్తున్నారు. ఈ లేటెస్ట్ పిక్స్ చూస్తుంటే ఆమె మళ్లీ వెండితెరపై హీరోయిన్ గా చేసినా ఆశ్చర్య పోవాల్సిన అవసరం లేదని చెప్పవచ్చు.

# గ్లామర్ వర్క్ అవుట్ కాలేదని ఈసారి అలా..?

మహానటి కీర్తి సురేష్ సౌత్ లో తన ఫాలోయింగ్ ఒక రేంజ్ లో ఉన్నా కూడా బాలీవుడ్ లో కూడా తన సత్తా చాటాలని ఒక అటెంప్ట్ చేసింది. బేబీ జాన్ అంటూ అమ్మడు చేసిన ప్రయత్నం వర్క్ అవుట్ కాలేదు. సౌత్ లో చాలా క్లీన్ ఇమేజ్ తో ట్రెడిషనల్ లుక్స్ తో కనిపించిన కీర్తి సురేష్ ఒక్కసారి బాలీవుడ్ నీళ్లు పడ్డాయో లేదో థై షోస్ తో అదరగొట్టేసింది. కీర్తి సురేష్ సౌత్ లో ఇన్ని సినిమాలు చేసినా కూడా చేయని గ్లామర్ షో బేబీ జాన్ లో గుమ్మరించేసింది. ఐతే అదంతా బీ టౌన్ ఆడియన్స్ మెప్పు కోసమే అని తెలుస్తున్నా కూడా అమ్మడు ఈ రేంజ్ గ్లామర్ షో అయితే ఆమె ఫ్యాన్స్ ఎక్స్ పెక్ట్ చేయలేదు.

**బేబీ జాన్ కి బిఫోర్ రిలీజ్ మంచి బజ్..** ఐతే గ్లామర్ షో వల్ల బేబీ జాన్ కి బిఫోర్ రిలీజ్ మంచి బజ్ వచ్చినా సినిమాలో మ్యాటర్ లేకపోవడం వల్ల రిజల్ట్ రివర్స్ అయ్యింది. ఐతే నెక్స్ట్ గ్లామర్ షో కాకుండా ఈసారి కీర్తి సురేష్ ఒక మంచి సినిమాతో మరో ప్రయత్నం చేస్తుంది.



అదే శిక్షక్. బాలీవుడ్ టాలెంటెడ్ యాక్టర్ రాజ్ కుమార్ రావు నటిస్తూ నిర్మిస్తున్న ఈ సినిమాలో కీర్తి సురేష్ ఛాన్స్ అందుకుంది. ఈ సినిమాను ఆదిత్య నింబల్కర్ డైరెక్ట్ చేస్తున్నారు. ఇండియన్ ఎడ్యుకేషన్ సిస్టం నేపథ్యంతో ఈ సినిమా వస్తుందని తెలుస్తుంది. సినిమాలో టానియా మనిక్తల కూడా ప్రధాన పాత్రలో నటిస్తుంది. ఐతే కీర్తి సురేష్ కి సౌత్ లో మంచి నటీమణిగా పేరు ఉంది. అలాంటి పాత్రలో హిందీలో కూడా అదరగొట్టేస్తుంది. బేబీ జాన్ తో తప్పు జరిగినా ఈసారి రాబోతున్న సినిమాల విషయంలో మాత్రం అమ్మడు అసలు తప్పు చేయకూడదు అనుకుంటుంది. ఈ క్రమంలోనే అమ్మడు శిక్షక్ ఛాన్స్ అందుకుంది. ఇక అమ్మడి తెలుగు సినిమాల విషయానికి వస్తే విజయ్ దేవరకొండ తో రౌడీ జనార్ధన్ సినిమా చేస్తున్న కీర్తి సురేష్ నెక్స్ట్ ఎల్లమ్మ సినిమాలో కూడా కథానాయికగా నటిస్తుందన్న టాక్ ఉంది. వేణు యెల్దండి డైరెక్షన్ లో తెరకెక్కబోతున్న ఎల్లమ్మ సినిమా ఫైనల్ కాస్టింగ్ పై ఇప్పటివరకు క్లారిటీ రాలేదు. కీర్తి సురేష్ కి ఆ ఛాన్స్ వస్తే మాత్రం మరోసారి అవార్డ్ గ్యారెంటీ అనేలా స్క్రిప్ట్ ఉందని తెలుస్తుంది. కీర్తి సురేష్ కూడా మళ్లీ టాలీవుడ్ లో గ్రిప్ సాధించేందుకు అమ్మడు గురి పెట్టింది. రాబోతున్న రెండు సినిమాలు తప్పకుండా తెలుగులో మళ్లీ కీర్తి సురేష్ ని తిరిగి ఫాం లోకి వచ్చేలా చేస్తాయన్న టాక్ ఉంది. అటు బాలీవుడ్ లో కూడా తన ప్రయత్నాలను ఆపట్లేదు కీర్తి సురేష్.




# సంక్రాంతికి 'రాజు' గారు రావడం లేదా?



టాలీవుడ్ సినీ ఇండస్ట్రీకి సంక్రాంతి సీజన్ కీలకమని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. ఏటా పొంగల్ కు అనేక సినిమాలు ప్రేక్షకుల ముందుకు వస్తాయి. బెర్తులను ఖరారు చేసుకోవడానికి ముందు నుంచే కర్చీఫులు వేసుకుంటాయి. కచ్చితంగా పెద్ద పండగకే విడుదల చేయాలని మేకర్స్, హీరోలు ఫిక్స్ అవుతుంటారు. బాక్సాఫీస్ వద్ద పోటీ పడుతుంటారు. వచ్చే ఏడాది సంక్రాంతి పండగకు కూడా పలు సినిమాలు థియేటర్స్ లోకి రానున్నాయి. అందుకు గాను ఇప్పటికే ఆయా చిత్రాల మేకర్స్ ఫిక్స్ అయ్యారు. అందుకు అనుగుణంగా సినిమాలకు సంబంధించిన పనులు పూర్తి చేసుకుంటున్నారు. త్వరలో తమ మూవీల రిలీజ్ డేట్స్ ను స్పెషల్ అప్డేట్స్ తో అనౌన్స్ చేయనున్నారు. అయితే 2026 సంక్రాంతికి చిరంజీవి మన శంకరవరప్రసాద్ గారు, ప్రభాస్ ది రాజా సాబ్, రవితేజ భర్త మహాశయులకు విజ్ఞప్తి, విజయ్ జన నాయగన్ రిలీజ్ అవ్వనున్నాయి. శర్వానంద్ నారీ నారీ నడుమ మురారి కూడా విడుదలవుతుందని టాక్. యంగ్ హీరో నవీన్ పోలిశెట్టి లీడ్ రోల్ లో నటించిన అనగనగా ఒక రాజు కూడా పొంగల్ కు రానుందని ఇప్పటికే అనౌన్స్ చేశారు మేకర్స్. జనవరి 14వ తేదీన విడుదల చేస్తామని తెలిపారు. ఇప్పటికే సినిమా నుంచి రిలీజ్ చేసిన ప్రమోషనల్ కంటెంట్ రావడంతో సినీ ప్రియులు మంచి అంచనాలు పెట్టుకున్నారు. ఫ్యామిలీ అండ్ కామెడీ ఎంటర్టైనర్ గా రానున్న ఆ మూవీ కోసం వెయిట్ చేస్తున్నారు. కానీ ఇప్పుడు జనవరి 14వ తేదీన అనగనగా ఒక రాజు మూవీ రిలీజ్ అయ్యేటట్లు లేదని టాక్ వినిపిస్తోంది. సంక్రాంతికి భారీ పోటీ ఉండడంతో అనగనగా ఒక రాజు మూవీ.. వెనకడుగు వేసిందని ఇప్పుడు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. జనవరి 23వ తేదీన సినిమా రిలీజ్ అయ్యే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. అది కాకపోతే.. రిపబ్లిక్ డే వీకెండ్ లో విడుదల్వనుందని టాక్ వినిపిస్తోంది. కానీ మేకర్స్ నుంచి ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అయితే భారీ పోటీ ఉందని ఇప్పుడు తప్పుకున్నా.. ప్రచారంలో ఉన్న కొత్త తేదీ కూడా అంత సేఫ్ కాదు. ఎందుకంటే సంక్రాంతికి థియేటర్స్ లో భారీ సినిమాలు రిలీజ్ అవ్వనున్నాయి. వాటికి పాజిటివ్ టాక్ వస్తే కచ్చితంగా కొన్ని రోజులపాటు ఓ రేంజ్ లో సందడి చేస్తాయి. కాబట్టి అనగనగా ఒక రాజు కొత్త తేదీ కూడా కాస్త రిస్క్ తో కూడకున్నదే. అదే సమయంలో మూవీ రిలీజ్ ఇప్పటికే చాలా లేట్ అయింది. ఇప్పుడు మళ్లీ వాయిదా పడేలా కనిపిస్తోంది. మరి మేకర్స్ ఏం చేస్తారో వేచి చూడాలి.

# వెనిస్ లో స్టార్ హీరో ఫ్యామిలీకి అరుదైన గౌరవం!




కోలీవుడ్ లో తల అజిత్ కుమార్ కెరీర్ దేదీప్యమానంగా సాగిపోతుంది. ఓవైపు సినిమాలు మరో వైపు కారు రేసింగ్ అంటూ రెండు రకాల జర్నీని పర్ఫెక్ట్ గా ప్లాన్ చేసుకుని ముందుకు సాగుతున్నారు. దీంతోఅవార్డులు..రివార్డులతోనూ అజిత్ పేరు మోరుమ్రోగిపోతుంది. ఇదే ఏడాది ప్రతిష్టాత్మక పద్మభూషణ్ అవార్డు కూడా అందుకున్నారు. అంతకు ముందు రాష్ట్ర స్థాయిలోనూ..జాతీయ స్థాయిలోనూ అవార్డులు అందుకున్నారు. ఇక ప్రత్యేకించి రేసింగ్ అవార్డుల గురించైతే చెప్పాల్సిన పనిలేదు. ఇలాంటి అవార్డులు అజిత్ ఇలాకాలో అన్నీ ఇన్నీ కావు. రేసింగ్ కాంపిటీషన్ లోనూ ఎన్నో అవార్డులు అందుకున్నారు. తాజాగా ఇటలీ వెనిస్‌లో 2025 సంవత్సరం గానూ జెంట్‌ల్మన్ డ్రైవర్ అవార్డుతో సైతం అజిత్ సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సమేతంగా అజిత్ అవార్డు కార్యక్రమంలో పాల్గొన్నారు. భార్య షాలిని..పిల్లలిద్దరితో కలిసి ఈవెంట్ కు హాజరయ్యారు. భారతీయ సంప్రదాయాన్ని విదేశాల్లో ఉట్టి పడేలా చేసారు. షాలిని సంప్రదాయ చీర ధరించి హాజరవ్వగా, అజిత్, అతని కుమారుడు సూట్ లో ముస్తాబయ్యారు. కుమార్తె కూడా పద్దతైన ఔట్ పిట్ లో తళుక్కున మెరిసారు. అంతా బ్లాక్ అండ్ డార్క్ బ్లూ థీమ్ లో హైలైట్ అవుతున్నారు. ప్రఖ్యాత ఫిలిప్ షారియోల్ మోటర్‌స్పోర్ట్స్ గ్రూప్ కల్పించిన అవకాశమిది. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది. కుటుంబంతో అజిత్ ఫ్యామిలీని చూసి అభిమానులు మురిసిపోతున్నారు. ఫ్యామిలీతో ఇలా కనిపించడం అన్నది చాలా రేర్. ఇలాంటి అరుదైన ఈవెంట్లు మినహా కుటుంబ సభ్యులెవరు పెద్దగా బయటకు రారు. అజిత్ కోలీవుడ్ లో ఎన్నో సినిమాల్లో నటించారు. ఆ సినిమా ఈవెంట్లకు కూడా షాలిని హాజరు కారు. పెళ్లైన కొత్తలో హాజరయ్యే వారు. ఆ తర్వాత క్రమంలో అలాంటి ఈవెంట్లకు దూరమయ్యారు. ఇక అజిత్ సినిమాల విషయానికి వస్తే ఈ ఏడాది గుడ్ బ్యాడ్ అగ్లీ, విదాముయార్చి సినిమాలతో ప్రేక్షకుల ముందుకొచ్చిన సంగతి తెలిసిందే. వీటిలో గుడ్ బ్యాడ్ అగ్లీ మంచి విజయం సాధించింది. ఈ నేపథ్యంలో ఆ చిత్ర దర్శకుడు అదిక రవిచంద్రన్ తోనే మరో సినిమాకు ఒప్పందం చేసుకున్నాడు. ఈ సినిమా వచ్చే ఏడాది పట్టాలెక్కుతుంది. అలాగే అజిత్ కొత్త కమిట్ మెంట్ల గురించి వచ్చే ఏడాది అప్ డేట్ రానుంది.

# పొట్టి డ్రెస్సులో టిల్లు పాప.. స్టన్నింగ్ లుక్!

'డిజె టిల్లు' సినిమాతో ఓవర్ నైట్ స్టార్‌గా మారిపోయారు నేహా శెట్టి. ఆ సినిమాలో 'రాధిక' పాత్రలో ఆమె చేసిన మ్యాజిక్ అంతా ఇంతా కాదు. ఆ ఒక్క సినిమాతో యూత్‌లో మంచి క్రేజ్ సంపాదించుకున్నారు. తన అందం, అభినయంతో కుర్రాళ్ళ కలల రాణిగా మారిపోయారు. లేటెస్ట్ గా నేహా శెట్టి సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫొటోలు వైరల్ అవుతున్నాయి. పచ్చని ప్రకృతి మధ్యలో, వైట్ కలర్ లేస్ డిజైన్ ఉన్న కో ఆర్డ్ సెట్?లో దేవకన్యలా మెరిసిపోతున్నారు. సూర్యకాంతి ఆమెపై పడుతుంటే, ఆ గ్లో మరింత పెరిగి ఆకర్షణీయంగా కనిపిస్తున్నారు. "ఆత్మ మృదువుగా ఉన్న చోట.. కాంతి సరిగ్గా తాకిన వేళ" అంటూ క్యాప్షన్ ఇచ్చారు. పూరి జగన్నాథ్ కుమారుడు ఆకాష్ పూరి నటించిన 'మెహబూబా' చిత్రంతో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చారు నేహా. మొదటి సినిమా ఆశించిన ఫలితం ఇవ్వకపోయి



నా, సిద్దు జొన్నలగడ్డ సరసన 'డిజె టిల్లు'లో నటించి బ్లాక్‌బస్టర్ హిట్టు కొట్టారు. అప్పటి నుంచి ఇండస్ట్రీలో ఆమె పేరు మారుమోగిపోతోంది. ఆ తర్వాత 'బెదురులంక 2012', 'రూల్స్ రంజన్', ఇటీవల వచ్చిన 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' వంటి చిత్రాల్లో నటించి మెప్పించారు. కేవలం గ్లామర్ పాత్రలే కాకుండా, నటనకు ఆస్కారమున్న పాత్రలను ఎంచుకుంటూ కెరీర్‌ను పక్కాగా ప్లాన్ చేసుకుంటున్నారు. వరుస అవకాశాలతో టాలీవుడ్‌లో బిజీగా మారుతున్నారు. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నప్పటికీ, సోషల్ మీడియాలో మాత్రం నేహా శెట్టి చాలా చురుగ్గా ఉంటారు. ఎప్పటికప్పుడు తన లేటెస్ట్ ఫొటోషూట్లు, గ్లామరస్ అప్‌డేట్స్ ఇస్తూ ఫ్యాన్స్‌ను అలరిస్తుంటారు. చీరకట్టులోనైనా, మోడ్రన్ డ్రెస్సులోనైనా తనదైన శైలిలో మెప్పిస్తూ ఫాలోవర్స్ సంఖ్యను పెంచుకుంటున్నారు. మరి ఈ గ్లామర్ తో అమ్మడు రానున్న రోజుల్లో ఎలాంటి సినిమాలు చేస్తుందో చూడాలి.

# రాశీఖన్నాలో అసంతృప్తి..ఆవేదన!

సినిమా ఇండస్ట్రీలో ఛాన్సులు రావాలంటే? వివాదాలకు వెళ్లకుండా కామ్ గా ఉంటేనే సాధ్యమవుతుంది. తప్పు అయినా సరే అక్కడ ప్రశ్నించడానికి ఉండదు. గొంతెత్తి మాట్లాడితే? బ్యాకెండ్ లో తొక్కే ప్రయత్నాలు అంతే సీరియస్ గా జరుగుతుంటాయి. ఇది అందరికీ తెలిసిందే? అందుకే ఇండస్ట్రీలో ఉన్న ఎవరూ వివాదాల జోలికి వెళ్లరు. ఎప్పుడైనా ఏదో అంశంపై వివాదాలు తలెత్తినా మాట్లాడానికి విముఖత చూపిస్తుంటారు. కానీ లోలోపల మాత్రం లావా మరుగుతూనే ఉంటుంది. అది అగ్ని పర్వతం రూపంలో ఎలా బయట పడుతుందన్నది చెప్పలేం. కానీ సమయం వచ్చిందంటే బ్లాస్ట్ మామూలుగా ఉండదు. తాజాజా రాశీఖన్నా అలాగే బ్లాస్ట్ అయింది. రాశీఖన్నా అంటే ఇంత వరకూ కామ్ గోయింగ్ హీరోయిన్ అనే పేరు ఉంది. ఎలాంటి వివాదాల్లో వేలు పెట్టదు. తన పని తాను చేసుకుని పోవడం తప్ప! పరిశ్రమ అంతర్గత విషయాలు వేటిలోనూ ప్రవేశించదనే అభిప్రాయం ఉంది. కానీ సమయం వస్తే తాను కూడా శివంగిలా మారుతుందని ప్రూవ్ అయింది. తాజాగా అమ్మడు ఆన్



సెట్స్ లో సమానత్వం గురించి బ్లాస్ట్ అయింది. నటీనటుల మార్కెట్ విలువ ఎలా ఉన్నా? సినిమా సెట్స్‌లో మాత్రం అందరికీ సమాన గౌరవం దక్కాలని అభిప్రాయపడింది. దేశంలో చాలా కాలంగా హీరో వర్షిప్ కల్చర్ ఉందని, హీరోల బాక్సాఫీస్ వసూళ్ల ఆధారంగా వారిని నమ్మడం నిజమే. కానీ మార్కెట్ అనేది జెండర్ పై కాకుండా ట్యాలెంట్ పై ఆధారపడాలంది. ఎవరికి ఎక్కువ ఇంపార్టెన్స్ ఇవ్వాలన్నది మార్కెట్ మాత్రమే నిర్ణయిస్తుందన్నారు. తక్కువా? ఎక్కువా? అనే భావన ఆన్ సెట్స్ లో చూపించకూడదంది. మహిళా నటులకు మంచి సదుపాయాలు, వారికి లభించే గౌరవం ఎంత మాత్రం తగ్గకూడదంది. దీంతో ఇప్పుడీ వ్యాఖ్యలు నెట్టింట వైరల్ గా మారాయి. రాశీఖన్నా ఇంత వరకూ ఎక్కడా ఇలాంటి వ్యాఖ్యలు చేయలేదు. తెలుగులో చాలా సినిమాలు చేసింది. ఇక్కడ నటీనటులు, దర్శక, నిర్మాతలతో మంచి స్నేహం ఉంది. ఎలాంటి వివాదాలు కూడా ఆమె పై లేవు. అయితే రాశీఖన్నా ఈ మధ్య తెలుగు సినిమాల కంటే తమిళ, హిందీ సినిమాలకే ఎక్కువగా పని చేస్తోంది. అక్కడ ఎదురైన అనుభవాలు ఆధారంగా ఇలా స్పందించిందా? అన్న సందేహం నెటి జనులు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రాశీఖన్నా తెలుగులో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తోన్న ఉస్తాద్ భగత్ సింగ్‌లో నటిస్తోంది. బాలీవుడ్ లో రెండు సినిమాలు..కోలీవుడ్ లో ఓ చిత్రం చేస్తోంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA. PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536